1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 6
సంచిక : 5
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

అక్టోబరు 2020

అనురాధపురా లో జయశ్రీ మహాబోధి ఆలయం వద్ద ఉత్సవాలు



జగమునేలిన తెలుగు (గోదావరి నుంచి జావా దాకా..) నవలలో...



వేల ఏళ్లుగా తెలుగు నేలతో శ్రీలంకకు ఉన్న అనుబంధానికి నేటికీ చెక్కుచెదరని సాక్ష్యం శ్రీలంకలోని కాండీ కోట

- తమిళనాడులో ఆంగ్ల మాధ్యమం విఫలం
- బ్రతుకుతెరువు కోసం తెలుగు భాష
- చరితార్థుడు స్వామీ కేశవానంద భారతి

## సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో సమస్య పరిష్కారమవుతుందా!

## తెలుగు భాషోద్యమ సమాఖ్య

(రి.నెం. 1288/2003)

# తెలుగు చరవాణి యాపుల పోటీ, తెలుగు వ్యాసరచన పోటీ

పోటీ మొదలు: ఆగస్టు 29, 2020

గడువు తేదీ: జనవరి 1, 2021 మధ్యాహ్నం 12 గంటలు

మరిన్ని వివరాలు: https:/ telugubhashodyamasamakhya.blogspot.com

సంప్రదింపులు: tebhasaspoti@gmail.com

## మొత్తం రు.4 లక్షల బహుమతులు!

చరవాణి యాపు సమర్పణ

forms.gle/koWxehnW6unooDsW8

వ్యాస సమర్పణ

forms.gle/zWRdGfk7sCaQTC4n8

తెలుగులో – తెలుగు నుడి (భాష) గురించి, తెలుగు చరిత్ర గురించి, తెలుగు సంస్కృతి గురించిన నాణ్యమైన సమాచారం అందరికీ అందుబాటులో లేదు. వలగూడు (అంతర్జాలం) వేదికగా అందుబాటులో ఉన్న తెలుగు వికీపీడియాను ఒక ప్రాతిపదికగా తీసుకుంటే పై అంశాల గురించి నాణ్యమైన ఒక వెయ్యి వ్యాసాలు కూడా ఉండవు. మన తెలుగు వారి జనాభా తెలుగు రాష్ట్రాల్లో, తెలుగు రాష్ట్రాల బయటా కలిపి 18 కోట్లు ఉంటే, కనీసం 18 మంది కూడా ఈ విషయమై చూపు సారించి తెలుగు వికీపీడియా లాంటి వనరుల్లో చురుగ్గా పనిచేయటం లేదు. ఏడాదికి కొన్ని పరిశోధనా పత్రాలు వెలువడుతున్నా, అవి ఏదో ఒక గ్రంథాలయ సొరుగులోకో, వెయ్యికి దాటని ప్రచురణలుగానో మిగిలిపోతున్నాయి. ఈ వెలితిని నింపుతూ, కొంతలో కొంత తెలుగు నుడి, తెలుగు చరిత్ర, తెలుగు సంస్కృతి అంశాల్లో సమాచారం వలగూడులో చేర్చే దిశగా తెలుగు భాషోద్యమ సమాఖ్య వ్యాసరచన పోటీని నడుపుతున్నది. నేడు వలగూడు అనేది సమాచారాన్ని పుట్టించటానికీ వాడుకకూ భద్రపరచటానికీ ఉన్న అతి పెద్ద వనరుగా మన ముందుంది. వలగూడులో చేర్చని వ్యాసం ఎక్కువ మంది చదువరులకు చేరదు కూడా. అందరికీ అందుబాటులో ఉండే విధంగా అంశాలను చెప్పాలంటే వలగూడే అందరికీ అందుబాటులోనికి తెచ్చే సాధనం.

వివరాలకు వెనుకఅట్ట లోపలిపుట చూడండి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి

అక్టోబరు 2020


◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...

◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...

◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...



## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకు గాని, ఇంటర్నెట్ పత్రికలకు గాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగా రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదక హృదయం:** | సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో... | | **05** |
| **తిరగబడిన ప్రయోగం:** | తమిళనాడులో ఆంగ్ల మాధ్యమం...? | **అరవింద్ సర్దానా** | **08** |
| **విద్యావిధానం:** | తిరోగమన బాటలో జాతీయ విద్యా... | **రమేష్ పట్నాయక్** | **11** |
| **విద్యావిధానం:** | ఫలితాలు ప్రశ్నార్థకమే! | **డా॥ సామల రమేష్‌బాబు** | **13** |
| **వలసవాదం:** | అమ్మనుడులకు..... | **డా॥గారపాటిఉమామహేశ్వరరావు** | **15** |
| **తెలుగు బోధన:** | బ్రతుకుతెరువు కోసం తెలుగు భాష | **సి.వి. క్రిష్ణయ్య** | **18** |
| **పీవీ శతజయంతి:** | పీవీ గారి సాహిత్యాభినివేశం | **గంధం సుబ్బారావు** | **21** |
| **సంప్రదాయం-సాధికారత:** | నీ కోసం, నీ మంచి కోసం.. | **డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'** | **31** |
| **సాహిత్యరంగం:** | తెలుగు కథల కొలను.. | **డా॥ మధురాంతకం నరేంద్ర** | **39** |
| **ప్రాచీన సాహిత్యం:** | దోనయామాత్యుని సస్యానందము.. | **అప్పిరెడ్డి హరినాథరెడ్డి** | **41** |
| **యాత్రాసాహిత్యం:** | ఆమె లేఖలు | **డా॥ కాళిదాసు పురుషోత్తం** | **44** |
| **ప్రాథమికహక్కుల కాపరి:** | చరితార్థుడు స్వామీ.... | **పెండ్యాల సత్యనారాయణ** | **46** |
| **పుస్తక సమీక్ష:** | గుంటూరు సీమసాహిత్య చరిత్ర | **ఎం.వి. శాస్త్రి** | **49** |
| **గ్రంథాలయం:** | | | **50** |
| **మాటల నిర్మాణం:** | పదనిష్పాదనకళ | **వాచస్పతి** | **25** |
| **నవల:** | జగమునేలిన తెలుగు- 11 | **డి.పి.అనూరాధ** | **27** |
| **ధారావాహికలు:** | పడమటి గాలితో..-5 | **ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి** | **33** |
| | అడుగుజాడల్లో ఆనవాళ్లు-2 | **డా॥ఈమని శివనాగిరెడ్డి** | **36** |
| **కవితలు :** | అమ్మతనం | **అయిత అనిత** | **17** |


| కార్టూన్లు | ఫోటోలు | కంప్యూటర్ |
|---|---|---|
| **సరసి** | **తమ్మా శ్రీనివాసరెడ్డి** | **బండారు రఘురాం** |

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిష్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

## రచయితలకు విన్నపం

❖ ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.

❖ రచయితలు సరళమైన తెలుగు మాటలతో వ్రాయాలని మా విన్నపం. అచ్చతెలుగులోనే వ్రాయాలని మేము కోరడం లేదు. ఇతర నుడుల మాటలను తప్పనిసరైతేనే, వీలైనంత తక్కువగా వాడండి. మీ ప్రాంత తెలుగు మాండలికాల్ని, నుడికారాల్ని ఉపయోగించడానికి వెనుకంజ వేయవద్దు. తాపీ ధర్మారావు గారు చెప్పిన మాటలను ఇక్కడ గుర్తుకు తెచ్చుకొందాం:

*'చదివిన విన్నా జనులందరికీ – చక్కగ తెలిస్తె రాతా/*
*మెదడు చించుకొని నిఘంటులన్నీ – వెదికించేదే రోతా'*

*'వాడుక మాటల వల్లనె భావాల్ – ప్రకటించిందే రాతా/*
*పాడు ముష్టితో పెద్ద సమాసాల్–వాడిందైతే రోతా'*

*'చిన్న మాటలనె గొప్పభావములు – చెప్పగలిగితే రాతా/*
*మిన్ను విరిగినట్టు ధ్వనించి – భావం సున్నచుట్టితే రోతా'*

## చదువరులకు విన్నపం

❖ 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు నేరుగా పోస్టులో పంపిస్తున్నాము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక పత్రిక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. వివరాలు ఈ పుటలోనే గలవు. దయచేసి ఆ సూచనలను అనుసరించ ప్రార్థన.

❖ ఆన్‌లైన్‌లో చందాను పంపినప్పుడు చందాదారుని పేరు, చిరునామా, ఫోన్ నెంబరు, తదితర వివరాలు బ్యాంకు వారి ద్వారా మాకు చేరవు. అందువల్ల మా కార్యాలయంలో ఆ వివరాలు నమోదు కావు. ఈ కారణంగా ఆ చందాదారుకు పత్రికను పంపే అవకాశం లేదు. దయతో ఈ ఇబ్బంది కలుగకుండా చూడండి. పైకం బ్యాంకుకు జమచేసిన వివరాలను కూడా తెలుపడం మరచిపోవద్దు. ఫోన్‌లో/ వాట్స్‌యాప్‌లో లేదా మెయిల్‌లో తెలుపండి.

❖ 'అమ్మనుడి' పత్రికను నడుపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ఆధారం కనుక – మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని కూడా చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.


తెలుగుజాతి పత్రిక
**అమ్మనుడి**
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు


## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ – పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**–యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే చెల్లింపు వివరాలను, చందాదారుని పేరు, పూర్తి చిరునామా, ఫోన్‌నెంబరు, పిన్‌కోడ్ తదితర వివరాలను జాబు ద్వారాగాని, ఫోన్ ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా


**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, తెనాలి
గుంటూరు జిల్లా – 522 211. ఫోన్ : 9440448244
ఇ–మెయిల్ : ammanudi2015@gmail.com


**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

సంపుటి : 6 సంచిక : 5
అమ్మనుడి
అక్టోబరు 2020

సంపాదకీయం

# సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో సమస్య పరిష్కారమవుతుందా!

**ఆంధ్రప్రదేశ్** హైకోర్టు తీర్పుపై కుప్పిగంతులు వేసిన రాష్ట్రప్రభుత్వం చివరకు సర్వోన్నత న్యాయస్థానాన్ని శరణుజొచ్చి, తన వాదనను వినిపించింది. తమది విధానపరమైన నిర్ణయం అనీ, ఆ హక్కు రాష్ట్రప్రభుత్వాలకు ఉందనీ నివేదించింది. సుమారొక పుష్కరకాలం కిందట తెలుగు భాషోద్యమ సమాఖ్య, ప్రాథమిక విద్యలో మాతృభాషా మాధ్యమాన్ని తప్పనిసరిచేయాలంటూ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ న్యాయస్థానంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేసినపుడు ఇది ప్రభుత్వ విధాన నిర్ణయానికి సంబంధించినది గనుక మేము జోక్యం చేసుకోలేమంటూ దానిని కోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆం.ప్ర. రాష్ట్రప్రభుత్వం కూడా ఈ అంశం మీదే ఆధారపడింది. తొలుత ప్రభుత్వ ఉత్తర్వుల్ని వ్యతిరేకిస్తూ కోర్టుకెక్కిన కక్షిదారుల వాదనలతోపాటు, కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్నీ వ్రాత పూర్వకంగా సర్వోన్నత న్యాయస్థానం తీసుకొంది. కేంద్రం సమగ్రమైన సమాధానాన్ని నివేదించింది. (ఆ వివరాలను వెనుక పుటలో చూడండి) అందులో– భాష విషయంలో నూతన జాతీయ విద్యావిధానాన్నీ అంతకు పూర్వ విద్యావిధానాలతో పాటు యునెస్కో నిర్ణయాలనూ వివరించింది. రాజ్యాంగంలోని అంశాలనూ పేర్కొంది. విద్యాహక్కుచట్టం ఉండనే ఉంది. ఇప్పుడు సర్వోన్నత న్యాయస్థానం ఏమని తీర్పు ఇస్తుందో చూడాలి.

విద్యకు సంబంధించి– రాజ్యాంగంలో ఇది ఉమ్మడి జాబితాలో ఉన్నందున, ఎదురవుతున్న సమస్యల్ని రానున్న తీర్పు ఎలా పరిష్కరిస్తుందో చూడాలి. అంతేగాదు. త్రిభాషాసూత్రం అమలులో వస్తున్న సమస్యలనూ, ఇండో ఆర్యన్ భాషలమూలాలతో ముడిపడివున్న భారతీయ భాషలవారు ద్రావిడ భాషల్ని మూడోభాషగానైనా అంగీకరించలేని నిజాన్ని ఎలా పరిష్కరిస్తారు. దేశమంతటికీ ఒక జాతీయ భాష ఉండాలనే వాదాన్ని ఏంచేస్తారు. భాషా రాష్ట్రాల ఏర్పాటు వల్ల రాష్ట్రాల్లో భాషాపరంగా తక్కువ సంఖ్యలో ఉన్న ప్రజల భాషాసమస్యనెలా పరిష్కరిస్తారు – ఇలాంటి పలు సమస్యల పరిష్కారానికి సర్వోన్నత న్యాయస్థానం తీర్పు దారితీస్తుందా, ఇదంతా తేనెతుట్టెను కదిలించినట్లవుతుందా?

మాతృభాషోద్యమాలు ప్రపంచమంతటా తలెత్తుతున్నాయి. కొందరు అనుకొంటున్నట్లు ప్రపంచమంతా ఒకే భాషాధిపత్యానికి లొంగిపోక తప్పదన్నది భ్రమ. ప్రతి మాతృభాషా తన జాతి భావోద్వేగాలకే కాదు, సంస్కృతికీ, బ్రతుకుతెరువుకూ స్వేచ్ఛకూ ముడి పెట్టుకొని ఉంటుంది. బహుభాషాజాతుల సమ్మేళనమైన మనదేశంలో పాలకవర్గాలు ఈ విషయంలో జాగరూకత వహించాలి.

ఇక్కడ తప్పనిసరిగా పరిశీలించవలసిన 'అసలు సంగతి'ని పక్కకు పెట్టకూడదు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ఆంగ్లమాధ్యమంలోకి మొత్తం విద్యను తేవాలన్న నిర్ణయాన్ని తీసుకోవడం ఒక్కసారిగా జరగలేదు. ఇంతకుముందున్న తెలుగుదేశం ప్రభుత్వం, దానికి ముందు పాలించిన కాంగ్రెస్, తెదేపా ప్రభుత్వాలూ ఆ బాటనే నడిచాయి. కాకపోతే ఈ ప్రభుత్వం కొంచెం దూకుడుగా, పట్టుదలగా వ్యవహరించింది. ఇదే సమయంలో – భారతదేశంలో కొన్ని ఇతర రాష్ట్రాల్లో కూడా ఏదో విధంగా ఈ ప్రయత్నం జరుగుతూనే ఉన్నది. భాషారాజకీయాలతో నడిచే తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లోనూ ఏదో ఒక స్థాయిలో ఈ ప్రయత్నం జరుగుతూనే ఉంది. కర్నాటక ప్రభుత్వానికీ, ఆరాష్ట్రంలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యానికీ న్యాయస్థానాల్లో జరిగిన పోరాటం సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు పౌరుల ప్రాథమిక హక్కులకు భంగకరమనే కారణంగా ఇచ్చిన తీర్పు ఆధారంగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైకోర్టులో కొంతపోరాడిందన్న సంగతిని మనం మరచిపోకూడదు. అయితే అది మాధ్యమాన్నెంచుకొనే స్వేచ్ఛ విద్యార్థికి ఉండాలన్న అంశానికి పరిమితం. అయినా ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం పంతానికి పోయి, సర్వోన్నత నాయస్థానాన్నాశ్రయించింది. అంతేకాదు, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి గారయితే, ఆంగ్లమాధ్యమాన్ని దేశమంతా అనుసరించడమే మంచిదన్న అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది.

అసలు ఇదంతా భాషల సమర్థతకు సంబంధించిన విషయమేకాదు. అన్ని భాషలూ శక్తిమంతమైనవే. మనం

భాషల్ని వినియోగించే తీరునుబట్టి వాటి వికాసం, ఎదుగుదలా ఉంటాయి. దానితోపాటు మన పాఠశాలలను సమర్థంగా నిర్వహించుకోవడాన్ని బట్టి విద్యారంగ అభివృద్ధి ఉంటుంది. స్వార్థపూరితమైన అవినీతిమయమైన మన రాజకీయ పార్టీలు, నేతలూ ఈ వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్నారు. విధాన ప్రకటనల మంచీ చెడూ, అంతా పాలకుల చిత్తశుద్ధిపైనే ఆధారపడి ఉంటాయి.

బోధనామాధ్యమ సమస్యతోపాటు, దానితో వున్న భాషాపరమైన సమస్యలకు పరిష్కారం త్వరలోరానున్న తీర్పు ఇస్తుందేమో- అశగా ఎదురుచూద్దాం.

తేదీ : 30-9-2020



## ప్రాథమిక విద్య మాతృభాషలోనే

వీలైనంత వరకు ఉన్నతస్థాయిలోనూ... నూతన విద్యావిధానం చెబుతున్నదీ ఇదే ...

యునెస్కో కూడా దీన్నే సమర్థిస్తోంది... ఏపీ ప్రభుత్వ పిటిషన్ పై సుప్రీంకోర్టులో కేంద్రం కౌంటర్...

ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలో సాగాలన్నదే తమ విధానమని కేంద్రం స్పష్టం చేసింది. అంతేకాదు.. వీలైనంత వరకూ ఉన్నతస్థాయిలోనూ మాతృభాషలోనే బోధించాలని 1988 నాటి విద్యావిధానంలో ఉందని చెప్పింది. 2020 జులై 29న కేంద్రం ఆమోదించిన నూతన విద్యావిధానం కూడా ఇదే చెబుతోందని వివరించింది. ప్రాథమిక విద్యను ఆంగ్లంలో బోధనను తప్పనిసరి చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ఎస్ఎల్పీ కేంద్ర పాఠశాల విద్యాశాఖ గురువారం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. విద్యానాణ్యత పెంపు కోసం యునెస్కో కూడా మాతృభాషాబోధననే సమర్థిస్తున్నట్లు పేర్కొంటూ అందుకు సంబంధించిన 2008 నాటి నివేదికను అఫిడవిట్ జత చేసింది. 'ప్రాథమిక విద్యాబోధన తప్పనిసరిగా పిల్లల మాతృభాషలోనే సాగాలి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 350ఎ ప్రకారం భాషాపరంగా మైనార్టీ వర్గాల పిల్లలకు సైతం ప్రాథమిక విద్యను వారి మాతృభాషలోనే బోధించాలి. అందుకు అనువైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, స్థానికసంస్థల మీదా ఉంటుంది. మాతృభాషలో బోధించడమే అత్యుత్తమమని 2005 నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ చెబుతోంది. ఆ కరిక్యులమ్‌ను ఇప్పటికే అన్ని రాష్ట్రాలు ఆమోదించాయి. దాని ప్రకారం 'త్రిభాషా సూత్రం అమలుకూ ప్రభుత్వాలు కృషి చేయాలి' అని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది.

2009 విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 29 (ఎఫ్).. సాధ్యమైనంత మేరకు విద్యాబోధన మాతృభాషలోనే ఉండాలని చెబుతున్నట్లు కేంద్రం గుర్తుచేసింది. పిల్లలు భయపడకుండా స్వేచ్ఛగా భావాలను వ్యక్తం చేసే వాతావరణం పాఠశాలల్లో ఉండాలని పేర్కొంది. దాన్ని దృష్టిలో ఉంచుకొనే పిల్లల మాతృభాషే బోధనా భాషగా ఉండాలని నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్‌లో పేర్కొన్నట్లు వెల్లడించింది. భాషాభివృద్ధి గురించి 1968 నాటి విద్యా విధానంలోనూ వివరంగా ఉన్నట్లు కోర్టు దృష్టికి తెచ్చింది. విశ్వవిద్యాలయాల స్థాయిలోనూ మాతృభాషలో బోధన ఉండాలని అందులో పేర్కొన్నట్లు గుర్తు చేసింది. "విద్య, సాంస్కృతికాభివృద్ధికి భారతీయ భాషలు, సాహిత్యం శక్తిమంతం కావాలి. స్థానిక భాషలు అభివృద్ధి చెందేవరకూ విద్యాప్రమాణాలు మెరుగుపడవు. విజ్ఞానం ప్రజల చెంతకు చేరదు. ఇప్పటికే ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో మాతృభాషల్లో విద్యాబోధన జరుగుతోంది. ఇప్పుడు యూనివర్సిటీల స్థాయిల్లోనూ మాతృభాషలో బోధించాలి" అని 1968 నాటి విద్యావిధానంలో ఉన్నట్లు కేంద్ర విద్యాశాఖ తన అఫిడవిట్‌లో తెలిపింది. ఆ భాషా విధానాన్నే 1986, 1992 విద్యా విధానాలు కూడా సమర్థించినట్లు వెల్లడించింది. 2020 జులై 29న కేంద్రం ఆమోదించిన నూతన విద్యావిధానం కూడా ఇదే చెబుతున్నట్లు వివరించింది. "పిల్లలు తమ మాతృభాషల్లో అయితేనే క్లిష్టమైన అంశాలను సులభంగా నేర్చుకోగలరు. కనీసం ఐదో తరగతి వరకైనా మాతృభాషలో విద్యాబోధన ఉండాలి. దీన్ని 8వ తరగతి, అంతకు మించి కొనసాగించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ తర్వాత కూడా సాధ్యమైనంత మేర మాతృభాషలో విద్యాబోధన కొనసాగించాలి. దీన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అమలుచేయాలి. సైన్స్ సహా అత్యంత నాణ్యమైన పాఠ్యపుస్తకాలను మాతృభాషలో అందుబాటులోకి తేవాలి. పిల్లలు మాట్లాడే భాషకు, బోధనా భాషకు ఎక్కడైనా తేడా ఉంటే ప్రాథమిక స్థాయిలోనే దాన్ని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలి" అని నూతన విద్యావిధానం పేర్కొన్నట్లు కేంద్రం తన అఫిడవిట్‌లో వివరించింది.(ఈనాడు 25-9-2020)

**మరుపురాని మనిషి**

# కనుమరుగైన పాటల మాంత్రికుడు



ఆయన తన పాటలతో అందరినీ పులకింపజేశాడు. పండితులనూ, పామరులనూ అందరినీ మంత్రముగ్ధులను చేశాడు. కనుకనే ఆయనను పాటల మాంత్రికుడని మనం చెప్పుకోవచ్చు.

సంగీతాన్ని ఒక శాస్త్రంగా ఏ గురువు వద్దా నేర్చుకోలేదని ఆయనే ఎన్నోసార్లు చెప్పారు. కాని, కొద్దిపాటి సాధనతోనే ఆయన శాస్త్రీయ సంగీతబద్ధమైన పాటలనూ గొప్పగా పాడారు. సినిమా పాటలే గదా అని కొట్టిపారవేయడానికి వీలులేని వేలాది పాటల్ని ఆయన వినిపించాడు. హాస్యపాత్రలకూ, కథానాయకులకూ పిల్లలకూ, కుర్రకారులకూ ముసలివారికీ అన్ని రకాల వేషధారులకూ ఆయన పాడిన పాటలు సరిగ్గా సరిపోయాయి. ఎవరుపాడినా ఘంటసాలగారి తర్వాతే అని ఆరోజుల్లో సినీ సంగీత ప్రియులనుకొనేవారు. వారి మాటల్నీ వమ్ముచేశాడు పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం. ఒక్క తెలుగులోనే కాదు, తమిళం, కన్నడం, హిందీ, ఒరియా, భోజ్‌పురి, కొంకణితో సహా ఎన్నో భాషల్లో పాటలు పాడి అంతగా పేరు తెచ్చుకొన్నాడు. ఆయా భాషల్లో ప్రసిద్ధిగాంచిన గాయకుల అభినందనలనూ పొందాడాయన. నాలుగు దశాబ్దాలకుమించి సినీరంగాన్ని ఏలినా, తన తర్వాతి తరాన్నీ ప్రోత్సహించాలనే ఆలోచనతో ఎవరూ ఊహించని రీతిలో 'పాడుతా తీయగా' వంటి అద్భుత ప్రయోగాన్ని చేశాడు. ఆ యోచనా యోజనా రామోజీరావుగారిదో, ఎస్పీగారిదో తెలియదు గాని; ఇద్దరూ కలిసి గొప్ప ప్రయోగాన్ని చేశారు. బాగా పాడాలనే ఉత్సాహమున్న పిల్లల్ని, యువతనూ చేరదీసి పాడించారు. వారిలోంచి ఎందరో గాయకులు దూసుకొచ్చారు. వారితో పాటు ఆ కార్యక్రమానికి సంబంధంలేని పాటగాళ్లూ కొందరు తమంతటతామే ముందుకొచ్చారు. అందర్నీ ఆయన ప్రోత్సహించాడు. ఇప్పుడు వారే తెలుగు సినీరంగంలో కుదురుకొన్నారు. సినిమా పాటల కచేరీల్లో, టీవి కార్యక్రమాల్లో అలరిస్తున్నారు.

పాటనే కాదు, 'మాట'ను కూడా తనకు కావలసిన స్వరంలో స్థాయిలో తీర్చిదిద్దుకోగలిగాడు. ఎందరో నటులకు డబ్బింగ్ సినిమాల్లో తన గొంతునిచ్చాడు. మరెవ్వరూ సాటిరాలేనంతగా పాటకూ, మాటకూ తనదైన ముద్రను వేశాడు.

ఆయన కేవలం గాయకుడే కాదు, చక్కని నటుడు కూడా. చాలా సినిమాల్లో తనకనువైన పాత్రల్లో నటించాడు. 'మిథునం' సినిమాతో ఆయన బహుశా తానే ఊహించనంత కీర్తినందు కొన్నాడు.

సాధారణ స్థాయి నుండి ఎదిగి, సరస్వతితో పాటు లక్ష్మీదేవిని కూడా ప్రసన్నం చేసుకొన్నాడు. తన జీవితాన్ని అత్యున్నతంగా మలచుకొన్నాడు. తానున్నరంగంలో ఎందరో ఆత్మీయులను పొందగలిగాడు. ఆయన మరణానికి వారే కాదు, కోట్లాది అభిమానులు విలపించారు.

ఆయన అన్ని భాషలనూ ప్రేమించాడు; తన అమ్మనుడి తెలుగును ప్రాణప్రదంగా భావించాడు. తొలినుంచీ చెన్నైతోనే తన బంధం పెంచుకొన్నాడు. అక్కడే సెప్టెంబరు 25న కన్నుమూశాడు.

తెలుగును కాపాడుకోవాలని ఎక్కడ వీలున్నా చెప్పేవాడు. తెలుగు గొప్పదనాన్ని, ముఖ్యంగా తెలుగు సాహిత్యాన్ని గురించి వీలున్నచోటల్లా పొగిడేవాడు. అయితే తెలుగు ఉద్యమాలలో ఆయనెన్నడూ భాగం కాలేదు. 'పాడుతా తీయగా' వంటి వేదికల ద్వారా తనదైన శైలిలో ఆ పనినీ చేశాడు.

75 ఏళ్ల ప్రాయంలోనూ ఆయన గొంతు, ఆయన ఆరోగ్యం ఎన్నాడూ ఆందోళనకు తావివ్వలేదు. ఆయన బహుశా రెండు జీవితకాలాల శ్రమను చేశాడు. తన ఊపిరితిత్తులను అంతగా వాడేసుకొన్నాడేమో, 'కరోనా' దెబ్బను తట్టుకోలేకపోయాడు. తాను క్షేమంగా బయటపడగలననీ, గానసాగరంలో ఇంకా ఈదులాడగలననే ఆశతో చివరివరకూ ఉన్నాడు. తనకు తానే చెరిగిపోని చరిత్రను నిర్మించుకొన్న మహావ్యక్తి ఆశల్ని, విధి ఇలా తారుమారు చేసింది. తెలుగు ప్రజల సంపదను కూలదోసింది. మరొక బాలసుబ్రహ్మణ్యం తెలుగుజాతిలోంచి ఎదగడని భావించనక్కరలేదు. నిరంతర కృషితో ఎంతకైనా ఎదగవచ్చనే ఆయన జీవిత సందేశాన్ని అందిపుచ్చుకోగల శక్తిమంతులైన యువత కోసం ఎదురుచూద్దాం.

– సంపాదకుడు

అరవింద్ సర్దానా



# తమిళనాడులో ఆంగ్లమాధ్యమం వైపు మొగ్గడం పిల్లలకు ఎందుకు ఉపయోగపడడం లేదు?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను పూర్తిగా ఆంగ్లమాధ్యమంలోకి మార్చేస్తూ ఉత్తర్వులిచ్చిన సంగతీ, ఆ తర్వాతి పరిణామాలూ, చివరికిది భారత ఉన్నత న్యాయస్థానం ముందుకు వెళ్లడం- ఇదంతా తెలిసిందే. ఆయితే, ఆంగ్లమాధ్యమం పట్ల మోజుపెరగడంతో మరి కొన్ని రాష్ట్రాల్లో కూడా ప్రభుత్వాలు ఆంగ్లమాధ్యమాన్ని ఐచ్ఛికంగా అమలు చేస్తున్నాయన్న నిజం కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చు. మన పొరుగునే ఉన్న తమిళనాడులోనే ప్రభుత్వం ఐచ్ఛికంగా ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టిందనీ, దానివల్ల చేదు అనుభవాలను పొందుతున్నదన్న వాస్తవాన్ని అందరూ గర్తించాలనీ, కోరుతున్నాం. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, కొన్ని అధ్యయనాల వివరాలతో అరవింద్ సర్దానా వ్రాసిన ఈ వ్యాసాన్ని చదవండి.

-సంపాదకుడు

**కొన్ని** రాష్ట్రాలు ప్రభుత్వ విద్యావైఫల్యానికి ఆంగ్ల మాధ్యమమే విరుగుడుగా భావించాయి. ఆంధ్రప్రదేశ్ అయితే దీనిని అందరూ చేపట్టాలని ఆశిస్తున్నది. తమిళనాడులో కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో మాధ్యమంగా ఆంగ్లం ఐచ్ఛికం.

ప్రైవేటు పాఠశాలలతో పోల్చుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గిందని తమిళనాడు ప్రభుత్వం గమనించింది. ఈ తగ్గుదల ఆంగ్లం వైపు ప్రజల మొగ్గుకు తార్కాణమని తమిళనాడు ప్రభుత్వం భావించింది. అందుకు తగ్గట్టుగా తమిళనాడు మంత్రి ఒకరు 2012 లో శాసనసభలో చెప్పడం జరిగింది. ఆంగ్ల మాధ్యమం అమలు చేయడం వల్ల పాఠశాలలు గ్రామీణ పిల్లలకు ఆకర్షణీయంగా తయారవుతాయని ఆయన అన్నారు. అప్పటి నుంచి, ప్రభుత్వ పాఠశాలలోకి దాదాపు 3,00,000 మంది పిల్లలు చేరారు.

తమిళనాడు రాష్ట్ర విద్యాశాఖ వారి 2013-2014 సంవత్సర విధాన పత్రంలో....ఆంగ్ల మాధ్యమం నవ సంక్షేమ పథకాలలో ఒకటి అని ప్రకటించి, ఉచిత యూనిఫాం, క్రేయాన్లు, జామెట్రీ పెట్టెలు ఇవ్వడం వల్ల , ప్రభుత్వ పాఠశాలలు గ్రామీణ పిల్లలను బాగా ఆకర్షిస్తాయని పేర్కొన్నది.

ఒక వైపు, ప్రభుత్వ విద్యకు కట్టుబడి వుండి, క్షేత్ర స్థాయిలో వచ్చిన మార్పులకు తగ్గట్టుగా ప్రభుత్వం స్పందిస్తున్నట్లు చెప్పవచ్చును. కానీ, సమస్య స్వభావం, సమస్య పట్ల సరైన స్పందన... "నాణ్యమైన విద్య" భావనపట్ల ప్రశ్నలను, ఆంగ్లాన్ని మాధ్యమంగా అమలుచేసే ప్రేరణ పట్ల ప్రశ్నలను రేకెత్తిస్తుంది.

తమిళనాడు ప్రభుత్వం తన విధానాన్ని ఒక "గొప్ప సాధన" గా ప్రకటించి, విద్యార్థుల నమోదు రాష్ట్ర స్థాయి సాధన సర్వేలో ఆంగ్లం పెరుగుదలను ఉదహరిస్తున్నది. కానీ, ఉపాధ్యాయులు మరోవిధంగా చెప్తున్నారు. చాలా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎంతో కష్టంతోనే ఆంగ్లం మాట్లాడ గలరు గనుక, తరగతులు పేరులోమాత్రమే ఇంగ్లీషు మాధ్యమంగా, ఒక బలవంతపు విధానంగా ఉందని వారంటున్నారు.

**నిర్బంధ విధానం**

కాంచీపురం జిల్లా లో 3-4 తరగతులలో 28 మందికి గానూ, 25 మంది పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నారు. రెండు మూడు సంవత్సరాల కిందట వారు బడికి రావడం ప్రారంభించినప్పుడు, తమిళం మాధ్యమంగా వుండేది. కానీ, గత సంవత్సరం ఆంగ్ల మాధ్యమం ప్రారంభించినపుడు, ఓ ముగ్గురు తప్ప అందరూ ఆంగ్ల మాధ్యమంలోకి మారారు. ఆ ముగ్గురు అదే తరగతిలో కొనసాగుతున్నారు.

ప్రధాన ఉపాధ్యాయురాలు, తమతో తమిళనాడు ప్రభుత్వం ఈ విధాన మార్పు గురించి చర్చించలేదన్నారు. అయినప్పటికీ, ఆంగ్ల మాధ్యమం గురించి తల్లిదండ్రులను నిరుత్సాహపరచలే దన్నారు. 3-4 తరగతులను బోధించే సుప్రియ, పిల్లలకు తమిళమే ఉత్తమం అన్నారు. "ఆ మాటే వారి తల్లిదండ్రులతో చెప్పితే, ఎక్కడ పిల్లలు బడి మానేస్తారోనని మేం భయపడుతున్నా" మని ఆమె తెలిపారు.

**కార్యాచరణ ఆధారిత బోధనా పద్ధతి**

'అక్షరాలు లేదా పదాలు,చిన్న వాక్యాలు నేర్పడం ఉపాధ్యాయులకు పెద్ద సమస్య కాదు, 1వ తరగతి నుంచే ఆంగ్లాన్ని రెండవ భాషగా బోధిస్తూనే వున్నాము' అంటుంది సుప్రియ. సమస్యంతా, ఆంగ్లంలో పదాలను, ఆలోచనలను, భావాలను వివరించలేము. అదీ కూడా, బొమ్మలలో వివరించ లేనప్పుడు. తమిళనాడు ప్రాథమిక పాఠశాలల్లో, ఒకే ఉపాధ్యాయుడు అన్ని పాఠ్యాంశాలు నేర్పుతారు. భాష, సాంఘిక శాస్త్రం, సామాన్య శాస్తం, గణిత శాస్త్రం....అన్నీ ఒకరే బోధిస్తారు. సుప్రియ కష్టంగా ఆంగ్లంలో మాట్లాడుతుంది. అందువల్ల, అన్ని తరగతులలాగే ఆమె

తరగతి లో కూడా ఆంగ్లమాధ్యమం నామమాత్రం. లేదా ఆమే చెప్పినట్లు, 'ఆంగ్లం లేదా, తమిళం కాదు' తమిళం, ఆంగ్లం రెండింటిలోనూ బోధించడం మంచిది. పిల్లలకు తెలిసి, మాట్లాడగలిగిన భాషలోనూ, నేర్చుకుంటున్న భాషలలోనూ నేర్పగలిగి ఉభయ భాషా ప్రావీణ్యం వున్న ఉపాధ్యాయుల ద్విభాషా పాఠశాలల సంఖ్య పెరుగుతూ పోతుంది. ఈ సందర్భంలో, ఉపాధ్యాయులు తమిళం, ఆంగ్లం రెండూ బోధిస్తూ, క్రమంగా ఆంగ్లం వైపు మళ్ళాలి. సుప్రియ లాంటివారికి ఆంగ్లంలో ప్రావీణ్యం లేదు, ధారాళంగా మాట్లాడటం చేత కాదు.కాబట్టి, వారి తరగతులు ద్విభాషా తరగతులు కాదు, కలగాపులగమైన తరగతులు!

బోధనా పద్ధతులలో పురస్కార గ్రహీతయైన మంగళ, ప్రాథమిక పాఠశాల మాధ్యమంగా ఆంగ్లంలో బోధించడం కష్టమేనని ఒప్పుకుంటుంది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ మాతృభాష లో చక్కగా నేర్చుకుంటారు. బోధనా పద్ధతిలో, తెలిసిన భాషలో బోధన పిల్లలకు ఎంత సులువో వివరించడానికి మంగళ తమిళాన్ని ఎంచుకున్నది. దీనివలన, పిల్లలు అర్థం చేసుకోవడానికి, నేర్చుకున్నది చేయడానికి, ఇతరులతో మాట్లాడడానికి ఎంతగానో దోహదపడుతోంది, ఎటువంటి గందరగోళం, విసుగు, అనాసక్తి లేకుండా చేస్తుంది. ఎంతో అనుభవం వున్నప్పటికీ, ఆంగ్లంలో మాట్లాడడానికి, మంగళకున్న వ్యవహారిక ఆంగ్ల పరిజ్ఞానం ఏమాత్రం సరిపోదు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులందరి మాదిరిగానే, ఆమె కూడా, పదోన్నతులకోసం కావలసిన, మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయుల విద్యార్హతలను సాధించింది. మాధ్యమిక పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుల ఖాళీలున్నాయని ఆంగ్లాన్ని ఎంచుకున్నది.

పిల్లల విద్యలో భాష పాత్ర గురించి ఆమె వివరణ పరిగణించదగినది. **మాతృభాషలో నేర్చుకున్న విద్యార్థి, రెండవ భాష, మూడవ భాష సునాయసంగా నేర్చుకుంటాడని పరిశోధనలు పేర్కొంటున్నాయి; అదీ కూడా ప్రతి భాషా చక్కగా బోధిస్తేనే.**

నేర్పడానికే భాషరానివారు ఆ భాషలో పిల్లలకు బోధన చేయపూనుకోవడం శ్రేయస్కరం కాదు. ఏ మాత్రం పెద్దగా మాట్లాడలేని భాషలో బోధన చేయడం విపత్కరం.

పాఠశాలకు వెళ్ళండి, పిల్లల అధమస్థాయి అభ్యాసనల గురించి ఉపాధ్యాయులను అడగండి. తక్కువ సదుపాయాల ఆంగ్ల భాషాబోధన, గణిత శాస్త్రాన్ని నేర్చుకోవడంలో పిల్లల వెనుకుబాటుతనం....గమనించగలరు. 'రాష్ట్ర స్థాయి సాధన సర్వే' ప్రతి సంవత్సరం బోధనలో ప్రగతిని ప్రస్తావిస్తుండగా, అందుకు భిన్నంగా ఉపాధ్యాయులు ఆ ప్రగతి తరగతి గదులలో లేదు అంటున్నారు. దీన్ని అధిగమించడానికి, 1వ తరగతి నుంచి 4 వరకు క్రియా ఆధారిత బోధనాపద్ధతి, 5వ తరగతి నుంచి క్రియాశీలక అభ్యసనా పద్ధతిని ప్రవేశ పెట్టడం జరిగింది. అయినప్పటికీ, బాగా నేర్చుకొని, అర్థం చేసుకొని, విశ్లేషణ చేయగలిగిన విద్యార్థులు ఆంగ్లం మాత్రం రాయడానికి కష్ట పడుతున్నారు.

**'తమిళనాడు ఆంగ్ల విద్యా విధానం, భాషా విద్యను తక్కువ చేసిన విధాన అవలక్షణం' అంటారు చరిత్రకారుడు ఎ.ఆర్ వెంకటాచలపతి. ప్రభుత్వ నిధులతో ఆంగ్లం, తమిళ భాషలలో నిర్వహిస్తున్న చెన్నైలోని పాఠశాలను ఆయన సందర్శించారు. పిల్లలకు ఆయన పాఠం చెప్పారు. పిల్లలు కనీసం ఒక దినపత్రికను చదివే స్థాయిలో లేరని ఆయన గ్రహించారు. విద్యావిధానం, భాషను కేవలం ఒక సాధనంగా, భావప్రసారానికి కీలకంగా చూడడం వల్ల ఇలా జరిగింది. భాష అనేది ఆలోచించుకోవడానికి అవసరమైనది. కానీ ఎవరూకూడా దీనిని అర్థం చేసుకోలేకపోతున్నారు.**








ఆంగ్లాన్ని రెండవ భాషగా సరిగా బోధించక పోవడంతో, చాలామంది ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఆంగ్లాన్ని సరిగ్గా మాట్లాడలేకపోతున్నారు. వారు ఉపాధ్యాయులైన తర్వాత ఈ సమస్య రెట్టింపు అవుతుంది. చెన్నై లోని డైట్ (జిల్లా విద్యా శిక్షణా సంస్థ) లో పని చేసే ఓ ఆంగ్ల అధ్యాపకురాలు .... చాలా మంది శిక్షణార్థులైన ఉపాధ్యాయులు, 12 ఏళ్ళపాటు ఆంగ్లాన్ని అభ్యసించినా, ఆంగ్లంలో మాట్లాడలేకపోతున్నారు. కేవలం బట్టీ పట్టి భాషాపరీక్షలలో ఉత్తీర్ణులవుతున్నారు **తక్కువ సమయంలో పెద్దవారు ధారాళంగా మాట్లాడే రీతిలో భాషను నేర్పజాలరు. తన తరగతులలో ఆంగ్లం లో మాట్లాడితే ఏ మాత్రం స్పందన వుండదు. అదే తమిళంలో మాట్లాడడం ప్రారంభిస్తే అందరూ ఉత్తేజితులవుతున్నారు అని ఆంగ్ల అధ్యాపకురాలు వివరించారు.**

### శిక్షణా లోపం

**ఉపాధ్యాయుల విద్యలో లోపాల వలన సమస్యలు ఉధృతమవుతున్నాయి. ఉపాధ్యాయుల శిక్షణాసంస్థలైన "డైట్"లు ప్రథమ భాష – ద్వితీయ భాషా బోధనల మధ్య భేదాలను గుర్తించలేకపోతున్నాయి. సమగ్రమైన విద్యపై అవగాహన లేకుండా, కేవలం వ్యాకరణం లాంటి అంశాలలో ఉత్తీర్ణులవుతున్నారన్న వాస్తవాన్ని ఈ విద్యాసంస్థలు గుర్తించడం లేదు. కాబట్టి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల బోధకులు, బయట పడలేనంతగా, ఒక విషవలయంలో కూరుకుపోయారు. ఈ విషయమై విద్యాశాఖ దృష్టి సారించడం లేదు. మాతృభాషలో విద్యా బోధన లాభదాయకమన్న వయోజన విద్యా పద్ధతులను పరిగణించ కుండా, ద్వితీయ భాషగా ఆంగ్ల బోధనలో ఉత్పన్నమవుతున్న ప్రశ్నలను ఉపేక్షిస్తున్నారు–** అన్నారు. ఆమె సహాధ్యాయి అనిత తన మాటలలో ''ఆంగ్లం సాంకేతికకు, సమాచార వెల్లడికి బాగున్నప్పటికీ, తమిళంలాగా వుండదు. మేము తమిళంలోనే ఆలోచిస్తాము.తమిళంలోనే మా భావాలు, అభిప్రాయాలు వ్యక్తం చేయాలన్నదే మా సంకల్పం'' అని పేర్కొన్నది. ప్రభుత్వ విధానం కాబట్టి, ఆంగ్లంలోనే బోధిస్తామని వారు చెప్పడం జరిగింది.

**తమ ఉద్యోగాలను నిలుపుకోవడానికి, వారు ఆంగ్ల బోధన చేస్తారు. తమిళనాడులో ఉపాధ్యాయుల ఉద్యోగాలు విద్యార్థుల నమోదుతో ముడిపడివున్నవి. ఇది ఒక రకంగా ఓ విషపు ఒప్పందం.** సామర్థ్యమో, మొగ్గు చూపడమో ఏదేమైనప్పటికీ, వారి ఉద్యోగాల పణంగా ఆంగ్ల బోధన చేస్తున్న విషపు ఒప్పందం ఇది. **ఈ ఒప్పందాన్ని విద్యాశాఖ ఎలా సమర్థిస్తుంది?** వాస్తవానికి భిన్నంగా, ఉపాధ్యాయులందరూ "ఉన్నతమైన శిక్షణ" పొందారన్న విషయాన్ని విశ్వసించడం రెండో విషయం, ఆంగ్లంలో విద్యాబోధనకు ప్రతి సంవత్సరం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని బలంగా విశ్వసించడం ఎలా సమర్ధనీయమవుతుంది?

నాలుగు రోజుల స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాల ద్వారా బ్రిటిష్ కౌన్సిల్ వారి బోధకుల శిక్షణ వలన, ఆంగ్ల మాధ్యమంలో ఉపాధ్యాయుల సామర్థ్యం పెంపులో ఉన్న సమస్యలను అధిగమిస్తుందని విద్యాశాఖ ప్రగాఢ విశ్వాసం.

ఉపాధ్యాయులు మిడిమిడి ఆంగ్ల పరిజ్ఞానంతో, అరకొర ఆంగ్ల బోధనా నైపుణ్యాలతో ఎలా ఆంగ్ల బోధన చేస్తారన్న ప్రశ్నకు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి నుంచి బ్లాక్ అభివృద్ధి అధికారుల వరకు ఒకటే స్థిరమైన సమాధానం: "వారికి శిక్షణ ఇస్తున్నాము". శిక్షణ ప్రభావం ఎంత? ఉన్నత పాఠశాలలో ఆంగ్ల బోధన చేసిన మేరి అనే బ్లాకు స్థాయి ఉపాధ్యాయుల బోధకురాలి మాటలలో "భాషాపరమైన శిక్షణ వలన ఆంగ్లంలో ఉపాధ్యాయులు 40%–50% స్థాయిలో ఆంగ్లంలో మాట్లాడగలుగుతున్నారు'' అని చెబుతూ, ఇది అచ్చెరువును కలిగించే గణాంకాలు అని ఒప్పుకుంటున్నది. ఉపాధ్యాయులు గడించిన పూర్వవిద్యకు ఇలాంటి వృత్తిపరమైన శిక్షణలు ప్రత్యామ్నాయం కానేరదు అని పేర్కొన్నది. **తమిళనాడు విద్యావ్యవస్థలోని అధికారస్వామ్యం ఉపాధ్యాయులను ఒక సమస్యగా భావిస్తుంది. ఉపాధ్యాయులు సరైన శిక్షణ పొందరని, సోమరిపోతులుగా వుంటారని, జవాబుదారీతనం వుండదని, రాజకీయ ప్రయోజనాల వల్ల రక్షింపబడతారని ( ఉపాధ్యాయులు రాష్ట్ర రాజకీయాలలో బలమైన వారు) రాష్ట్ర విద్యాశాఖ విశ్వసిస్తుంది.** ఏదిఏమైనా, ఉపాధ్యాయుల నియమాలను రూపొందించేది ఈ అధికారస్వామ్యమే. ఈ నియామకనియ మాలలో, ప్రధాన అంశమైన "బోధనా సామర్థ్యం"ను ఉపేక్షించడం జరిగిందని కొందరు ఆలోచనాపరులైన ఉపాధ్యాయులు ప్రస్తావించారు. **వాస్తవంగా, స్వల్ప ఆంగ్ల పరిజ్ఞానంతోనే ఆంగ్ల బోధన చేయాలన్న అధికారుల బలవంతం వల్ల , ఆంగ్ల బోధనకు అవసరమైన కనీస నైపుణ్యాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి.**

### జరిగిన నష్టం

చెన్నై కార్పొరేషన్ వారు వారి పాఠశాలలో ఒక వినూత్న పద్ధతిని అవలంబించారు. "టీచ్ ఫర్ ఇండియా" అనే సంస్థకు 32 పాఠశాలలు అప్పగించారు. ఈ సంస్థ సభ్యులు, లాభాపేక్షలేని, బోధనేతర ఉద్యోగం చేసిన, లేదా పట్టభద్రులైన యువకులు. బోధనా పద్ధతుల గురించి రెండు వారాల పాటు, అదీ కూడా క్రియా ఆధారిత బోధనా పద్ధతి లేకుండా శిక్షణపొంది, రెండు సంవత్సరాల పాటు ఆంగ్ల శిక్షణ ఇవ్వడానికి ఒప్పందం చేసుకుంటారు. వారు ఆంగ్లంలో మాట్లాడుతారు, ఆంగ్లంలో బోధిస్తారు, కానీ స్థానిక భాషను నేర్చుకోవాలనుకోరు.

సెంట్రల్ చెన్నైలోని ఓ పాఠశాలలో రెండవ సంవత్సరం ఆంగ్ల బోధన చేస్తున్న మాలిని ఇలా బోధించడం అద్భుతమన్నారు. ఏదైనా సమస్య ఎదుర్కొన్నారా? అన్న ప్రశ్నకు, 4 వ తరగతి విద్యార్థుల గురించి ఆమె ఇచ్చిన సమాధానం " పిల్లలు నేర్చుకోవడంలో ఇప్పటికీ సమస్య ఉన్నది". నార్త్ చెన్నై పాఠశాలలోని నాల్గవ తరగతి ఉపాధ్యాయుడు ఒక ఇండో అమెరికన్. ఆయన తన విద్యార్థుల చేత ఒక ప్రశ్నకు సమాధానం చెప్పించడానికి ప్రయత్నం చేశాడు. "సెరిబెల్లం (చిన్న మెదడు) ఎటువంటి విధులను నియంత్రిస్తుంది" అన్న ప్రశ్నకు విద్యార్థులు తమ తలల మీద చేయి పెట్టి సెరిబెల్లం ఎక్కడ వుందో చెప్పడానికి ప్రయత్నించారు.

సెంట్రల్ చెన్నైలోని ప్రధానోపాధ్యాయురాలైన ఎస్ థెరిసా, తమ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుల కొరతవున్నందున "టీచ్ ఫర్ ఇండియా" సంస్థకు ఋణపడివున్నానని తొందరపాటుతో చెప్పినప్పటికీ, ''ఈ ఆంగ్ల బోధనా కార్యక్రమాలు ప్రభుత్వేతర సంస్థలకు 1–2 సంవత్సరాల పాటు ఇవ్వబడినవి. ఈ ఏర్పాటు సముచితం కానిది. దీనివలన **అటు అరవం రాదు, ఇటు ఆంగ్లం రాదు. నాలుగవ తరగతి విద్యార్థులు ఆంగ్లంలో రాయడం చేతకాక, సాంఘికశాస్త్రంలో ఉత్తీర్ణులు కాలేకపోయారు. వారికి ఏ భాషా రాదు. రాయడానికి ఆంగ్లం రాదు. అంతేకాదు, ఇప్పుడు పిల్లలు 'తమిళం వద్దు, ఆంగ్లమే ముద్దు' అంటున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు తమిళాన్ని రెండవ భాషగా నేర్పుతున్నప్పటికీ, పిల్లలు చదివే, రాసే నైపుణ్యాలు కోల్పోతారని ఆమె భయపడుతున్నది.** దీని ఫలితంగా, తమిళ ఉపాధ్యాయురాలు వారానికి రెండు గంటలు అదనంగా ఈ విద్యార్థులకు తమిళం బోధించడం జరుగుతున్నది.

తమిళనాడు విభిన్నతకు ప్రతీకయైన రాష్ట్రంగా గుర్తింపు

**తరువాయి 14వ పుటలో.......**

రమేష్ పట్నాయక్
79012 86396

# జాతీయ విద్యావిధానం 2020 మాతృభాషా మాధ్యమానికి అనుకూలంగా ఉందా?

**అ**ఖిల భారత విద్యాహక్కు వేదిక జూలై 29న కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం 2020 ప్రకటించిన తరువాత ఉభయ తెలుగు రాష్ట్రాలలో మాతృభాషా మాధ్యమానికి మహర్దశ పట్టింది అనే భావం ప్రచారంలో ఉంది. ప్రధానమంత్రిగారు కూడా మాతృభాషా మాధ్యమ ప్రాధాన్యత గురించి మాట్లాడే సరికి ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. ఈ నూతన విద్యావిధానం మాతృభాషా మాధ్యమ ఆవశ్యకతను బహుళంగా చెప్పిన మాట వాస్తవమే కాని మాతృభాషా మాధ్యమానికి సంబంధించిన స్పష్టమైన నిర్దేశాలు ఏమి ఉన్నాయి అన్న విషయం పరిశీలించాలి. పదగుంభనం ఎంత సారవస్తువు ఎంత ఎంచి చూడాలి కదా! ఈ సందర్భంగా జాతీయ విద్యావిధానం 2020 ని ఇప్పుడు అధికారంలో ఉన్న 'విద్యా హక్కు చట్టం'తో అలాగే 1986 నాటి 'విద్యలో జాతీయ విద్యావిధానం' తో పోల్చిచూడడం ఎంతైనా అవసరం.

2010 ఏప్రిల్ 1నుండి 'బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009' అనే కేంద్ర చట్టం అమలులో ఉన్న విషయం తెలిసిందే. 6 - 14 వయోపరిమితిలో ఉన్న బాలల రాజ్యాంగ బద్ధమైన ప్రాథమిక హక్కు 21 ఎ ని వాస్తవీకరించడానికి ఈ చట్టం చేయబడింది. ఈ చట్టం విద్యావ్యాపారాన్ని నిషేధించక పోయినందున, ఉమ్మడి బడి విధానానికి మార్గం వేయనందున ఇంకా పాఠశాలలో వనరుల మరియు వసతుల విషయంలో తక్కువ స్థాయి నిబంధనలు కలిగి ఉన్నందున విమర్శలకు గురవుతున్నది. అయితే, పాఠ్య ప్రణాళిక విషయంలో విద్యాహక్కు చట్టం పెద్దగా విమర్శలను ఎదుర్కోలేదు. ఈ చట్టం విభాగం 29(2)(యఫ్)లో వీలయినంత వరకు, మాతృభాషా మాధ్యమంలోనే విద్య అందించాలని నిర్దేశిస్తుంది. ఈ నిబంధన ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలన్నింటికి 1 నుండి 8వ తరగతి వరకు వర్తిస్తుంది. అయితే తెలుగు రాష్ట్రాలతో పాటు అనేక రాష్ట్రాలు చివరికి కేంద్ర ప్రభుత్వం కూడా ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నాయి. ఉల్లంఘించబడని చట్టం మన దేశంలో ఏదీ లేదు. అది వేరే విషయం. ఈ చట్టం వచ్చిన తరువాత కూడా ప్రైవేటు పాఠశాలలు ఆంగ్ల మాధ్యమాన్ని కొనసాగిస్తూ ఉన్న విషయం తెలిసిందే. ఇక ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వాలు మాతృభాషా మాధ్యమాన్ని అమలు చేయమని ప్రైవేటు పాఠశాలలను నిర్బంధించడానికి బదులు ప్రభుత్వ పాఠశాలలలో కూడా ఆంగ్ల మాధ్యమాన్ని వివిధ స్థాయిలలో ప్రవేశపెడుతున్నాయి. ఈ మధ్య ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో మాతృభాషామాధ్యమం విషయంలో ప్రభుత్వంపై వచ్చిన కేసు సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టంలో 'వీలయినంతవరకు' అని ఉందని ఆ వెసులుబాటును 'ప్రజాభీష్టం మేరకు' తాము ఉపయోగించుకుంటున్నామని చెప్పింది. ప్రభుత్వ వివరణను హైకోర్టు తిరస్కరించింది. 'వీలయినంతవరకు' అన్నది వెసులుబాటు మాత్రమే కావున చాలా ప్రత్యేక సందర్భాలలోనే అంటే మాతృభాషలో విద్య అందించలేని సందర్భాలలోనే ఉపయోగించు కోవాలని న్యాయస్థానం వివరించింది. అనేక చట్టాలలో 'వీలయినంతవరకు' అనే పదబంధం ఉంటుందని దానిని ప్రత్యేక సందర్భాలలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు లిటిగేషను దారి తీయకుండా ముందు జాగ్రత్తగా చేరుస్తారని గత కొన్ని తీర్పులను ఉటంకిస్తూ కోర్టు వివరించింది. బాలల విద్యాహక్కు చట్టం మాతృభాషా మాధ్యమం విషయంలో అధికార పార్టీ ఎన్నికల మేనిఫెస్టోకు గాని, ప్రైవేటు మేనేజ్‌మెంట్ల ప్రయోజనాలకు గాని, చివరకు తల్లిదండ్రుల అభీష్టానికి గాని ఎటువంటి అవకాశం కల్పించలేదు. విద్యాహక్కు చట్టం బాలల సమగ్ర మరియు సహజ అభివృద్ధి అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాజ్యాంగం తరపున మాతృభాషా మాధ్యమాన్ని నిర్దేశించింది. అదే చట్టంలో ఉన్న 'బాలల కేంద్రగతంగా, వారికి స్నేహపూర్వకమైనదిగా విద్య అందించబడాలి' అన్న నిబంధన కూడా మాతృభాషా మాధ్యమాన్నే సూచిస్తుంది. ఇప్పటికీ అధికారం (ఫోర్సు)లో ఉన్న 'బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009' ప్రభుత్వ మరియు ప్రైవేటు యాజమాన్యాలన్నింటిలో 8వ తరగతి వరకు మాతృభాషా మాధ్యమాన్నే నిర్దేశిస్తుంది.

ఇప్పుడు మనం జాతీయ విద్యావిధానం 2020 ని పరిశీలిద్దాం. ఈ విధానం 4.11 విభాగంలో 'వీలయిన చోట (వీలయిన ప్రతిచోట అని ఇంకా వీలయిన ప్రతి సందర్భంలో అని కూడా అర్థం చెప్పవచ్చు) కనీసం 5వ తరగతి వరకు, 8వ తరగతి మరియు ఆపై స్థాయిలో కూడా అయితే మంచిదే, ఇంటి బాష లేదా మాతృభాష లేదా స్థానిక భాష లేదా ప్రాంతీయ భాష బోధనామాధ్యమంగా ఉంటుంది' అని పేర్కొంది. పై ఉటంకింపును బట్టి ఈ విధానం ప్రకారం, 5వ తరగతి వరకు వారి వారి భాషలలోనే బాలలకు విద్య అందించాలి. ఇంకా ఈ విధానం ప్రకారం 8వ తరగతి వరకు మరియు ఆపై స్థాయిలలో విద్యార్థులకు వారి వారి భాషలలో విద్య అందించగలిగితే మంచిదే. విద్యాహక్కు చట్టం అయితే 8వ తరగతి వరకు బాలలకు మాతృభాషలోనే విద్య అందించాలని స్పష్టంగా పేర్కొంది. విద్యాహక్కు చట్టంలో ఉన్న 'వీలయినంతవరకు' మరియు ఈ విధానంలో ఉన్న 'వీలయిన చోట' అన్న పదబంధాలను మనం ప్రక్కన పెడితే విద్యా హక్కు చట్టం 8వ తరగతి వరకు మాతృభాషా మాధ్యమాన్ని నిర్దేశిస్తే ఈ విధానం 5వ తరగతి వరకు మాత్రమే మాతృభాషా మాధ్యమాన్ని నిర్దేశిస్తున్నది. మరి ఈ నూతన విద్యావిధానం విద్యాహక్కు చట్టం నుంచి ఒక అడుగు వెనుకకు వేసినట్లే కదా. మరొక విషయం ఏమంటే జాతీయ విద్యావిధానం 2020 దానికదే అమలు జరగదు. సదరు

విధానానికి పార్లమెంటు ఆమోదం లేదుకాబట్టి దానిని అమలు చేయడానికి పార్లమెంటులో అంశాల వారీగా చట్టాలు చేయవలసి ఉంటుంది. పాఠశాల విద్యలో ఇప్పటికే ఒక కేంద్ర చట్టం (విద్యాహక్కు చట్టం 2009) ఉంది కాబట్టి దానిని మారుస్తూ చట్టం చేయవలసి ఉంటుంది. అప్పుడు విషయాలు మరింత స్పష్టమవుతాయి. 1 నుంచి 8 వతరగతి వరకు వర్తించే విద్యాహక్కును ఇటు పూర్వ ప్రాథమిక విద్యకు అటు సెకండరీ విద్యకు విస్తరించాలని కస్తూరి రంగన్ కమిటీ చేసిన సిఫారసును ఈ విధాన పత్రం పట్టించుకోలేదు. మరి అట్టి హక్కుపై ఆధారపడిన చట్టాన్ని అలాగే ఉంచి పూర్వ ప్రాథమిక విద్యకు మరియు సెకండరీ విద్యకు క్రొత్త చట్టాలను తీసుకువస్తారా, ఆ చట్టాన్ని రద్దుచేసి పూర్వ ప్రాథమికవిద్య నుంచి 12వ తరగతి వరకు ఒకే క్రొత్త చట్టాన్ని తీసుకువస్తారా అన్న విషయం ఇంకా తేలవలసి ఉంది. ఎలా చేసినా ఈ నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయాలంటే బోధనా మాధ్యమం విషయంలో ప్రస్తుతం ఉన్న విద్యా హక్కుచట్టాన్ని సవరించవలసి ఉంటుంది. ప్రధానంగా 8వ తరగతి వరకు మాతృభాషా మాధ్యమం అని ఉన్న ప్రస్తుత నిబంధనని 5వ తరగతి వరకు అని సవరించవలసి ఉంటుంది. అంటే ఉన్న చట్టానికి అభివృద్ధినిరోధకమైన సవరణ చేయవలసి ఉంటుంది. మాతృభాషా మాధ్యమం విషయంలో 2010 ఏప్రిల్ 1 నుండి అమలు జరుగుతున్న విద్యాహక్కుచట్టం కంటే 'జాతీయ విద్యావిధానం 2020' ఒక అడుగు వెనుకన ఉందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

బోధనా మాధ్యమం ఒక విషయం అయితే, ఈ విధానం ప్రకారం ఏఏ భాషలను పాఠ్య విషయాలుగా బోధిస్తారు అనేది మరొక చర్చనీయాంశం. 1968 నాటి జాతీయ విద్యావిధానంలో ప్రకటించబడి మరియు 1986 నాటి జాతీయ విద్యావిధానంలో కొనసాగించబడిన త్రిభాషా విధానం ప్రకారం తెలుగు విద్యార్థులకు తెలుగు, హిందీ మరియు ఆంగ్లం అనే పద్ధతి ఉన్న విషయం తెలిసిందే. క్రొత్త విద్యావిధానంలో కూడా త్రిభాషా విధానం కొనసాగుతుందని పేర్కొనబడింది. కాని ఈ జాతీయ విద్యా విధానం 2020 లో 4.13 విభాగంలో నిర్దేశించిన త్రిభాషా విధానం ఇంత వరకు అమలు అవుతున్న విధానంతో పోలిస్తే పూర్తిగా వేరుగా ఉంది. కస్తూరి రంగన్ నివేదికలో హిందీ తప్పనిసరి అని ప్రతిపాదించబడితే హిందీయేతర రాష్ట్రాల నుంచి ప్రధానంగా తమిళనాడు నుంచి వచ్చిన వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని విధాన పత్రంలో హిందీ తప్పనిసరి అనే భావనను తొలగించారు. అంతమేరకు మంచిదే. అంత కంటే ప్రధానమైన విషయం ఏమంటే ఈ విధానంలో మాతృభాషగాని అలాగే ఆంగ్లం కాని తప్పనిసరి అని పేర్కొనకపోవడం. ఈ విధానం విద్యార్థికి చాలా వెసులుబాటు ఇచ్చింది. ఆయా రాష్ట్రాలు, ప్రాంతాలు, ఇంకా ప్రధానంగా విద్యార్థులు తమ అభీష్టం ప్రకారం ఏవేని మూడు భాషలను ఎంపిక చేసుకోవచ్చని, అయితే అట్టి ఎంపికలో కనీసం రెండు దేశ (నేటివ్) భాషలు ఉండాలని ఈ చట్టంలో పేర్కొనబడింది. పునాదిలో విద్యావ్యాపారం ఉన్నప్పుడు వెసులుబాటులు వివక్షలకు దారితీస్తాయి. ఈ విధానం ప్రకారం విద్యార్థి ఆంగ్లం లేకుండా కూడా మూడు దేశీయ భాషలు నేర్చుకోవచ్చు. అలా దక్షిణాది రాష్ట్రాలలో జరగదు కాని కొన్ని ఉత్తరాది రాష్ట్రాలలో జరగవచ్చు. మరొక వైపు చూస్తే ఈ విధానం ప్రకారం మాతృభాష లేకుండా కూడా మూడు భాషలను ఎంచుకోవచ్చు. ఉదాహరణకు తెలుగు రాష్ట్రాలలో ప్రైవేటు పాఠశాలలలో తెలుగు లేకుండా ఇంగ్లీషుతో పాటు 'స్కోరింగ్ సబ్జక్టులైన' హిందీ, సంస్కృతం

**తరువాయి 14వ పుటలో.......**



డా॥ సామల రమేష్‌బాబు
98480 16136

# ఫలితాలు ప్రశ్నార్థకమే !

**జులై** 29న కేంద్ర మంత్రిమండలి ఆమోదించిన జాతీయ విద్యావిధానం మీద దేశవ్యాప్తంగా ఎంతో చర్చ జరుగుతోంది. విధానపత్రం విడుదలైనంత మాత్రాన ఇది వెంటనే అమలులోకి వస్తున్నట్లు కాదు. ఇది పార్లమెంటు ఆమోదం పొందాల్సి ఉంది. రాష్ట్రాలతో కూడిన సమాఖ్య వ్యవస్థలో ఉన్నాం కాబట్టి, 'విద్య' అనే అంశం రాజ్యాంగంలోని ఏదో షెడ్యూలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో ఉండటంతో రాష్ట్రాల ఆమోదాన్నీ తీసుకోవాల్సి ఉంది.

రాష్ట్రాల ఆమోదంతోనే కొత్త విద్యావిధానం అమలులోకి రాగలుగుతుంది. అమలు కోసం తగిన విధంగా కొన్ని చట్టాలను చేయాల్సి ఉంది. ఇదంతా జరగడానికి కొన్ని నెలల సమయం పట్టవచ్చు. ఇప్పుడు దీనిలో భాషా విధానానికి సంబంధించిన అంశాలు గురించి పరిశీలిద్దాం.

రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూల్‌లోని జాబితా ప్రకారం 22 దేశీయ భాషలను అధికార భాషలుగా గుర్తించారు. జాతీయభాషను నిర్ణయించడంలో మన రాజ్యాంగ నిర్మాణకర్తలు ఏకీభావం సాధించడంలో విఫలమై, నాగరలిపిలోని హిందూస్తానీ(హిందీ)ని అధికార అనుసంధానభాషగా అంగీకరించారు. అదే సమయంలో షెడ్యూల్‌లోని 22 భారతీయ భాషలనూ జాతీయ భాషలుగా గుర్తించాలనే అంశం నేటికీ ఒక రాజకీయ డిమాండుగా మిగిలిపోయిందేగాని, చట్టరూపంగా ఆమోదం పొందలేదు. అదే సమయంలో రాజ్యాంగం అమలులోకొచ్చిన 15 ఏళ్లలో జాతీయ అధికారభాషగా ఆంగ్లం స్థానంలో భారతీయ భాషను నిర్ణయించుకోవాలన్న అంశమూ ఆచరణలోకి రాలేదు. దాంతో ఆంగ్లభాష విద్యా పరిపాలనారంగాల్లో బలంగా చొచ్చుకుపోయింది. అయినా అది విదేశీ భాష అయినందున దానికి జాతీయ భాషగా గుర్తింపు వచ్చే ప్రసక్తి లేదు. దేశమంతటా విద్యాపాలనా రంగాల్లోని వాస్తవస్థితిని పరిగణించి, ఆంగ్లాన్ని కూడా షెడ్యూల్లో చేర్చాలనే డిమాండును కొన్ని బలమైన వర్గాలు ముందుకు తెస్తూనే ఉన్నాయి. అయితే, విద్యారంగంలో బోధనా మాధ్యమంగా ఆంగ్లమే ఉండాలనే డిమాండు క్రమంగా దేశవ్యాప్తంగా బలాన్ని సంతరించుకుంటోంది. ఈ పరిస్థితులు నలభై ఏళ్ల నాటి విద్యా విధానం నుంచీ క్రమంగా పుంజుకొని, గత 20–30 ఏళ్లలో మరింతగా బలపడ్డాయి.

**మిగిలిన భాషల మాటేంటి?**

ఇప్పుడు వెలుగుచూసిన కొత్త విద్యావిధానం చాలా తెలివిగా భాషాసమస్యలను పరిష్కరించాలని ప్రయత్నించినట్లు కనబడుతోంది. రాజీలేని జాతీయవాదాన్ని అన్ని రంగాల్లోను తీర్చిదిద్దాలనే నేటి కేంద్ర ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగానే ఆ ప్రతిపాదనలు సాగాయి. ఆ తపనలో హిందీ, సంస్కృతం తప్ప తక్కిన అన్ని భాషల అభివృద్ధిని, ప్రజల ప్రయోజనాలను, ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోకుండా కొత్త విద్యావిధానం చిన్న చూపు చూసింది. బోధనాభాషలుగా వాటి వినియోగం ప్రాథమిక విద్య వరకే లేదా మరి మూడేళ్లకు పరిమితమవుతుంది. వాటి పక్కనే త్రిభాషా సూత్రం ప్రకారం హిందీయేతర భాషలతోపాటు హిందీ, దానితోపాటు సంస్కృతమూ తప్పనిసరి అనకపోయినా అమలులోకి వస్తాయి. ఇంకా విశేషం ఏంటంటే ఇంగ్లీషు భాష ప్రాథమిక విద్య నుంచి ఎంత పైస్థాయి విద్యలోనైనా మాధ్యమంగా ఏదో ఒక రూపంలో తప్పనిసరై కూర్చుంటుంది. అంటే నేటి కేంద్ర పాలకుల దృష్టిలో జాతీయతకు, దేశ ఐక్యతకూ ప్రతిబింబంగా హిందీ, సంస్కృత భాషలు స్థిరపడి, భారతీయతకు ఆనవాళ్లుగా నిలుస్తాయి. భారతీయులను ప్రపంచ పౌరులుగా నిలబెట్టేందుకు, కార్పొరేట్ రంగంలోని అన్ని స్థాయిల్లో సేవలందించగల వారిగా తీర్చిదిద్దడం కోసమూ – ఇంగ్లీషు మరింతగా స్థిరపడి, బలపడుతుంది. మరి తక్కిన 20 భారతీయ భాషల వినిమయం, అభివృద్ధి ఎంతవరకు? నేటి పరిస్థితుల్లో విస్తారంగా అన్ని ఆధునిక అవసరాలకు వినియోగించని భాషలు బతుకుతాయా? వాటికి ఆ సమర్థత లేదా కోట్లాదిమంది మాట్లాడే అతి పెద్ద భారతీయ భాషల ఎదుగుదల కూడా అంతేనా? నేటి కంప్యూటర్ యుగంలో–సాంకేతికతను ఉపయోగించుకొని అవి ఎంతైనా ఎదగడానికి అవకాశం ఉంది కదా. అందుకు అడ్డుకట్టలు వేయడం సమంజసమేనా అందరూ లోతుగా ఆలోచించాల్సిన అంశమిది.

**వాటిని విస్మరించారు!**

నిజానికి రాజ్యాంగం గుర్తించిన అన్ని భాషలనూ జాతీయ భాషలుగా, ప్రకటించాలి. ఏ భాష అయినా, అది చిన్నదైనా పెద్దదైనా అవకాశమిస్తే ఎంతకైనా ఎదగగలరని, అన్ని భాషలకూ మౌలికంగా ఆ శక్తి ఉంటుందన్న శాస్త్రీయ దృక్పదాన్ని ఈ విధానం విస్మరిస్తోంది. పాఠశాల విద్యను పూర్తిగా మాతృభాషా మాధ్యమంలోనే బోధించాలనే నిర్ణయాన్ని తీసుకోవడంలోనూ కొత్త జాతీయ విద్యావిధానం విఫలమైంది.

మరొక ప్రధానాంశం ఉంది. ఏ భాషలో మాట్లాడినా, రాసినా, ముద్రించినా దాన్ని వెంటనే మరొక భాషలోకి అనువాదం చేయగల సాంకేతికత ఇప్పుడు అందుబాటులో ఉంది. అందువల్ల ఇప్పుడు దేశం మొత్తాన్నీ ఒకటి రెండు భాషల ఆధిపత్యంలోకి తెద్దామనే ఆధిపత్య ధోరణులను పాలకులు మానుకోవాలి. ఈ విషయంలో ఒక విధానపరమైన నిర్ణయాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉందని పాలకులు గుర్తించాలి.

భారతదేశం అనేక భాషాసమూహాలతో ఏర్పడిన సమాఖ్య దాన్ని రాజ్యాంగం గుర్తించబట్టే భాషాప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడ్డాయి. రాజ్యాంగం ప్రకారం ఏ విధంగానూ అసమన్యాయం గానీ అన్యాయంగానీ ఎవరికీ జరగకూడదు.

విద్యావిధానానికి సంబంధించి అనేక అంశాలున్నా, దీనికి ప్రాణం లాంటి భాషావిధానాల గురించే, దాని పరిణామాలను మాత్రమే మనం మాట్లాడుకుంటున్నాం. దీన్ని వివరంగా అర్థం

చేసుకోవాలంటే కొత్త జాతీయ విద్యావిధానాన్ని సూక్ష్మంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ప్రపంచ భాషలను నేర్చుకుని మన విద్యార్థులు అత్యంత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించిన ఈ విధాన నిర్మాతలు - అందుకోసం మాతృభాషల్ని శక్తిమంతం చెయ్యాలన్న మౌలిక అంశాన్ని విస్మరించారు!

భాషతోపాటు చర్చించాల్సిన అంశాలెన్నో జాతీయ విద్యావిధానంలో ఉన్నాయి. మనదేశంలోని సామాజిక అసమానతలు, చారిత్రక సమస్యలు, సాంస్కృతికతలోని వైవిధ్యాలు లాంటి అంశాల గురించి ఈ విద్యావిధానం మాట్లాడినా, వాటి విషయంలో చేపట్టదలచిన చర్యలన్నీ ఆ సమస్యల పరిష్కారానికి, శక్తివంతమైన భారతీయ సమాజాన్ని నిర్మించే దిశగానూ ఏమాత్రం దోహదం చేయలేవు. పైగా ఈ సమాజాన్ని మరింతగా వైరుధ్యాలతో నిర్వీర్యం చేయడానికే పనికివస్తాయి. మొత్తంగా ఈ విద్యావిధానం పెద్ద పెద్ద ఆలోచనలతో ఆశయాలతో నిండివున్నా, అందుకు అనుసరించదలచిన వ్యూహాలు, విధానాల కారణంగా విరుద్ధమైన ఫలితాలనిచ్చేదిగా ఉందని చెప్పక తప్పదు.

'తెలుగు వెలుగు' సెప్టెంబరు 2020, సంచిక సౌజన్యంతో

## "తమిళనాడులో ఆంగ్ల మాధ్యమం వైపు...

**10 వ పుట తరువాయి.......**

తెచ్చుకున్నది. తమిళనాడు రాష్ట్ర విద్యాశాఖ వారి 2016-17 విధాన పత్రంలో " పిల్లలకు గరిష్టంగా సదుపాయాలను కల్పిస్తూ, తద్వారా, సాంఘిక, ఆర్థిక అడ్డంకులను, అవరోధాలను అధిగమిస్తూ, అందరికీ చదువుకునే విశాల అవకాశాన్నికల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తమిళనాడు. అంతేకాకుండా, సాంఘిక-ఆర్థిక అడ్డంకులు లేకుండా, పిల్లలందరూ చదువుకొనునట్లుగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టటడంలో అగ్రగామి తమిళనాడు. అన్ని ప్రభుత్వాలు తమ సాఫల్యాలను అతిశయంగా చెప్పుకుంటాయి. కళ్ళ ముందున్న వాస్తవాలను ఒప్పుకుంటున్నప్పటికీ, విద్యాశాఖ వారి దృష్టిలో మాత్రం, నిర్ణీత పట్టిక మేరకు సదుపాయాలు కల్పించడం వల్లే ప్రాథమికవిద్య పెంపొందించబడుతుంది. ఈ నిర్ణీత పట్టికలోని వస్తువులైన - యూనిఫాంలు, జామెట్రీ పెట్టెలు, పుస్తకాలు, ఆంగ్ల మాధ్యమం ఇస్తేనే అది సాధ్యమవుతుంది . కానీ **బోధనామాధ్యమం మార్చడమన్నది సంచులు, సుద్దముక్కల పెట్టెలు ఇచ్చినంత సులువు కాదు.**

ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యలో "ఉచిత" యూనిఫాంలు, సంచులు, పుస్తకాలు ఇవ్వడం ఒక కోణం. ప్రైవేటు (సొంత) పాఠశాల విద్యార్థులకున్న అవకాశాలకన్నా తక్కువ స్థాయిలో అవకాశాలు కల్పిస్తున్నారు. కాని, ప్రభుత్వపాఠశాలలో చదువుకోవడానికి సమానమైన అవకాశాలు కల్పించామని అధికారులు చెప్పుకోవడం పరిపాటి. ఇది పెద్ద మోసం.

(Why Tamil Nadu shift to English Medium instruction is not helping children వ్యాసానికి ఇది తెలుగుసేత.)

## జాతీయ విద్యావిధానం 2020......

**12 వ పుట తరువాయి.......**

అనే త్రిభాషా విధానం అమలు కావచ్చు. మాతృభాషను తప్పనిసరి చేయని ఈ త్రిభాషా విధానం వలన విద్యావ్యాపారీకరణ నేపథ్యంతో మాతృభాషలకే గండం వచ్చే పరిస్థితి కనిపిస్తుంది. అంతేకాక మూడు భాషలకు అదనంగా ఏదేన ఒక భాషను (ఫ్రెంచ్, జర్మన్, కొరియన్, జపనీస్ వంటివి) ఒక ఐచ్ఛిక పాఠ్య విషయంగా తీసుకోవచ్చని జాతీయ విద్యావిధానం 2020లో పేర్కొనబడింది. ఈ విధానంలో అకడమిక్ కోర్సులైన సామాజిక, ప్రకృతి మరియు గణిత శాస్త్రాల వంటివి కూడా ఐచ్ఛిక పాఠ్య విషయాలుగా కుదించబడ్డాయి. అంటే ఎవరైనా ప్రకృతి, సామాజిక మరియు గణిత శాస్త్రాలలో ఒకదానిని (ఆచరణలో సామాజిక శాస్త్రాన్ని) విడిచిపెట్టి ఆంగ్లానికి అదనంగా మరొక విదేశీ భాషను ఎన్నుకునే వీలు కల్పించబడింది. ఈ వీలును ప్రధానంగా ఉపయోగించుకునేది ప్రైవేటు పాఠశాలలు. ఒక స్థాయి ప్రైవేటు పాఠశాలలలో జర్మనీ, జపనీస్, కొరియన్ వంటి భాషలకు డిమాండు ఉంది. ఆ డిమాండును దృష్టిలో పెట్టుకుని ఈ నిర్దేశాన్ని రూపొందించి ఉండవచ్చు. ఈ విధానం అమలు జరిగితే, అధిక ఫీజులు వసూలుచేసే ఐదు నక్షత్రాల ప్రైవేటు పాఠశాలలలో చదివే విద్యార్థులు సామాజిక శాస్త్రాలు నేర్చుకోకుండానే పై స్థాయిలకు వెళ్ళిపోతారు. అట్టివారు నైపుణ్యం కలిగిన కార్పోరేటు మేనేజర్లు కాగలరు గాని సామాజిక స్పృహ కలిగిన పౌరులు మాత్రం కాలేరు. ఈ విధానం యొక్క పర్యవసానంగా తెలుగు రాష్ట్రాలలో, ప్రభుత్వ పాఠశాలలలో ప్రస్తుతం ఉన్న త్రిభాషా విధానం కొనసాగే అవకాశం ఉండగా, ప్రైవేటు పాఠశాలలలో తెలుగును తొలగించి 6వ తరగతి నుంచే సంస్కృతం ప్రారంభం కాగలదు. త్రిభాషావిధానంలో భాగంగా మాతృభాషను తప్పనిసరి చేయకపోవడం మరిమొకవైపు సంస్కృతాన్ని అన్ని పరిధులు దాటి ప్రోత్సహించడం, మాతృభాషా మాధ్యమాన్ని ఐదవ తరగతికి పరిమితం చేయడం ఈ విధానంలో ప్రధానమైన సమస్యలు. ఈ విధానం పేదల ఎడల మాత్రమే కాక భాషల ఎడల కూడా వివక్షగా పరిణమించగలదు.

రచయిత అఖిలభారత విద్యాహక్కువేదిక
అధ్యక్షవర్గ సభ్యులు
ఈ వ్యాసంలో కొంతభాగం 'ఆంధ్రజ్యోతి'
15 సెప్టెంబరు 2020 సంచికలో వచ్చింది.

## 'వికీపీడియా'కు మప్పిదాలు

సెప్టెంబరు సంచికలో శ్రీ రహ్మానుద్దీన్ రచించిన 'ఈశాన్య రాష్ట్రాల జనజాతుల భాషలకు పొంచివున్న ముప్పు' వ్యాసానికి సంబంధించి 9,10,11, పుటల్లోనూ ముఖచిత్రంలోనూ ప్రచురించిన ఫోటోలను 'వికీపీడియా' నుంచి తీసుకొన్నాము. వారికి మప్పిదాలు -సం.

**భాష నశిస్తే జాతి నశిస్తుంది. వాడని భాష వాడిపోతుంది**

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

# అమ్మనుడులకు చావుదెబ్బ-వలసవాదం

**అ**భివృద్ధి చెందిన దేశాల భాషలు ప్రపంచ భాషలుగా చెలామణి కావటం, అట్లా వాటిని చెప్పుకోవటం అనే కొత్త పోకడ ఒకటి మన మానవాళి సంస్కృతిలో భాగమైంది. ఇంగ్లీషు, ఫ్రెంచి, స్పానిష్, పోర్చుగీసు, మొదలైనవాటిని ప్రపంచ భాషలని అనడం పరిపాటైపోయింది. అసలు ప్రపంచ భాషలంటే ఏమిటి? ప్రపంచ వ్యాప్తంగా మాట్లాడటం, నేర్చుకోవడం, అనేకమంది వాటిని రెండవ భాషగా వాడటం, జనాభా పరంగానే కాక, భౌగోళికపరమైన విస్తరణా, అంతర్జాతీయ సంస్థలూ దౌత్య సంబంధాలలో వినియోగం మొదలైన లక్షణాలను కూడా కూడగట్టుకొని వర్గీకరణ జరుగుతోంది (ప్రపంచ భాషలని జి-7 భాషలుగా పేర్కొంటూ మరికొన్ని, అరబిక్, చైనీసు, హిందీని కూడా కలుపుకున్నా, పైన చెప్పినవాటికి ఉన్న రక్తసిక్త చరిత్ర వీటికి ఉన్నట్లు లేదు).

అయితే వీటికి ఈ లక్షణాలు ఎట్లా వచ్చాయి, ఇవి మాత్రమే ప్రపంచ భాషలుగా ఎట్లా ఎదిగాయో మనం తెలుసుకోవాలి. ఇవి ప్రపంచ భాషలుగా రూపుదిద్దుకొనే క్రమంలో విచక్షణారహితంగా జరిగిన ఆదివాసుల జననష్టం, దురాక్రమణలూ, వలసవాదుల హింసా ప్రవృత్తి, ఇవి దేశీయ భాషలూ వాటిని మాట్లాడే జాతుల, తెగల జనాభా అడుగంటిపోవడానికి కారణం అని ఎన్నో పరిశోధనలు నిరూపిస్తున్నాయి.

పదిహేనవ శతాబ్దం ముగిసేనాటికి భారత దేశానికి సముద్ర మార్గాన్ని కనుగొనే నెపంతో ఇద్దరు నావికులు తమ నౌకా దండుతో ప్రయాణమయ్యారు. వారిలో ఒకరైన క్రిస్టోఫర్ కొలంబస్, స్పైన్ నుంచి బైలుదేరి (1492) పడమటివైపు ప్రయాణించి అట్లాంటిక్ మహాసముద్రాన్ని దాటి మధ్య అమెరికాలోని బహామా దీవులను (ఇప్పటి మధ్యఅమెరికాకు చేరువలో ఉన్న దీవులు) చేరుకొని దాన్నే ఇండియాగా భ్రమించాడు. అవే తర్వాత వెస్ట్ ఇండీస్ అంటే పడమటి ఇండియా దీవులుగా ప్రసిద్ధి చెందాయి. రెండవ దండుకు నాయకత్వం వహిస్తూ వాస్కో డా గామా పోర్చుగల్లులోని లిస్బన్ నగరం నుంచి బైలుదేరి (1497) తూర్పువైపు ప్రయాణించి ఆఫ్రికాను చుట్టి హిందూ మహాసముద్రం మీదుగా కేరళలోని కాలికట్ నగరానికి చేరుకున్నాడు. ఈ రెండు అన్వేషణలూ భారతదేశంలోని విలువైన సుగంధద్రవ్యాలూ, బంగారం, వజ్రాలు మొదలైనవాటి వ్యాపారం కోసమే అయినా చివరకు ప్రపంచ చరిత్రను ఊహించనటువంటి మలుపుతిప్పాయి. వీటివలన అమెరికా, ఆఫ్రికా, ఆసియా చివరకు ఆస్ట్రేలియా ఖండాలలోని కోట్లాదిమంది దేశీయ తెగలూ జాతుల జన నష్టంతో బాటు, వారి భాషలూ వాటితోబాటు వారి సంస్కృతులకూ అంత్య కాలం దాపురించింది. ఈ సముద్ర మార్గాలను కనుగొన్న ఐరోపా వాసులు వాటిని వ్యాపారానికి కాక ఇతర ఖండాలలోని తెగలూ జాతులపైన దాడిచేసి, ఆక్రమించి వలసదేశాలుగా మార్చివేసేందుకు వినియోగించారు.

పోర్చుగీసు ఒక భాషగా గుర్తింపు పొందినది 12వ శతాబ్దంలో. అప్పటివరకూ దానికి ఒక గ్రామ్య భాషగానే అంటే లాటిను మాండలికంగానే గుర్తింపు ఉండేది. 1296లో రాజభాషగా వాడేందుకు నిర్ణయం జరిగింది. 12-14 శతాబ్దాలలో వాడిన పోర్చుగీసును ప్రాచీన పోర్చుగీసు అనేవారు. 1536 లో మొట్టమొదటి సారి పోర్చుగీసు భాషా వ్యాకరణాన్ని గ్రంథస్తం చేశారు. అయితే 15-16 శతాబ్దాలలో పరిశోధనలూ అన్వేషణల మూలంగా సొంత దేశపు ఎల్లలను దాటి ప్రపంచంలోని ఇతర దేశాలకు సాగిన వలసలలో భాగంగా పోర్చుగీసు ప్రపంచ భాషగా విస్తరించింది. ప్రస్తుతం 10 చిన్నా పెద్ద దేశాలలో అధికార భాషగానూ మొత్తమ్మీద షుమారు 28 కోట్లమందికి ప్రధాన భాషగా ఉన్నా అసలు పోర్చు గల్లులో పోర్చుగీసు మాట్లాడేవారి జనాభా మాత్రం కోటి మంది మాత్రమే.

2015 లో ప్రపంచంలో ఇంగ్లీష్ మాట్లాడేవారు ప్రపంచవ్యాప్తంగా 150 కోట్లమంది (ప్రపంచ జనాభా మొత్తం 700 కోట్లు) ఉన్నారని ఒక అంచనా (సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్, ద లాంగ్వేజ్ స్పెషలిస్ట్స్). వీరిలో ప్రథమ భాషగా కంటే, రెండవ, మూడవ భాషగా మాట్లాడేవారి సంఖ్యే ఎక్కువ.

2015 లో, ప్రపంచంలోని మొత్తం 195 దేశాలలో, 67 దేశాలలో 'అధికారిక హోదా' తో ప్రాథమిక భాషగా ఇంగ్లీషు ఉన్నా, ఇంగ్లీషును ద్వితీయ 'అధికారిక' భాషగా మాట్లాడే 27 దేశాలు కూడా ఉన్నాయి.

ఇక వేరే (https://www.thehistoryofenglish.com/history_today.html) గణాంకాల ప్రకారం బ్రిటన్, ఐర్లాండ్, యుఎస్ఎ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి కొన్ని కరేబియన్ దేశాల ప్రధానభాష లేక స్థానిక భాష ఇంగ్లీష్. కానీ 57 దేశాలలో (ఘనా, నైజీరియా, ఉగాండా, దక్షిణాఫ్రికా, ఇండియా, పాకిస్తాన్, సింగపూర్, ఫిలిప్పీన్స్, ఫిజి, వనాటు మొదలైనవి), ఇంగ్లీషును "అధికారిక హోదా" కలిగిన భాషగా వాడుతారు. ఇవి ఎక్కువగా మాజీ వలసరాజ్య దేశాలు, ఇవి ఇంగ్లీషును వాటి ముఖ్య వ్యవస్థలలో వాడుక భాషగా చేశాయి. ఆపైన అత్యంత ప్రజాదరణ పొందిన అధికారిక వలస భాష ఫ్రెంచ్ (31 దేశాలకు వర్తిస్తుంది). తరువాత స్పానిష్ (25దేశాలలోనూ), పోర్చుగీస్ (13 దేశాలలోనూ) అధికారిక లేక ప్రధాన భాషగా గుర్తింపును పొందాయి.

12-14 శతాబ్దాలలో ఐరోపా ఖండంలో వచ్చిన బ్లాక్డెత్, మళ్ళీమళ్ళీ తిరగబెట్టిన ప్లేగువ్యాధులూ, కరువుకాటకాలవల్లా, యుద్ధాలవలనా వాటికి తోడు అరాచకత్వం, తిరుగుబాట్లు, దోపిడీలతో మందగించిన ఆర్థిక వ్యవస్థతో ప్రజాజీవనం చిన్నాభిన్నం అయింది. 15వ శతాబ్ది చివరికి ఇంగ్లీషువారి జనాభా 30 లక్షలు మించదని పరిశోధకుల అభిప్రాయం (మిడీఎవల్ పాపులేషన్ డైనమిక్స్ టు క్రీ.శ.1500, పార్ట్ సి: ద మేజర్ పాప్యులేషన్ చేంజస్ అండ్ డెమోగ్రఫిక్ ట్రెండ్స్ ఫ్రమ్ 1250 టో చ. 1520).

అయితే, 16వ శతాబ్ది మొదటిపాదంలో ఆర్థిక వ్యవస్థగాడిలో పడటంతోబాటే రాజకీయంగానూ ఇంగ్లండు బలోపేతం అయింది. 16 వ శతాబ్దం చివరి నుండి 18 వ శతాబ్దం ప్రారంభందాకా,

ఇంగ్లండురాజ్యం విదేశీ వలసలతో ఆస్తుల సంపాదనా వాణిజ్య వ్యాపారాల వ్యవస్థల స్థాపనతో మొదలై చరిత్రలోనే కనీవినీ ఎరగని అతిపెద్దదైన బ్రిటీషు సామ్రాజ్యంగా అవతరించింది. 16 వ శతాబ్దంలో చిన్న వలస ప్రాంతంగా ఉత్తర అమెరికాలోని జేమ్స్ టౌనుతో మొదలైన అమెరికా వలస విధానం నాలుగు సంవత్సరాలు తిరిగేసరికి ఇంగ్లండు వలసవాదులు అమెరికా ఆదివాసులతో జరిపిన యుద్ధంలో పాస్పెఘా అనే రెడ్ఇండియను తెగను నిర్మూలించింది.

**ఇలాంటి సందర్భాలను పురస్కరించుకొని, గత సంవత్సరం అక్టోబర్ 14న అమెరికా సంయుక్త రాష్ట్రాలలో "కొలంబస్ డే" జరుపుకొన్నారు అంటే, జాత్యహంకార మారణహోమానికీ, మన నేలను ఆక్రమించి మనల్ని అనాగరిక బానిసత్వానికి గురిచేసి మన పిల్లలనూ వయోజనులనూ వరుస మానభంగాలకూ ఇంకా శారీరక హింసలకూ గురిచేసి మన భాషలనూ మన సంస్కృతులకూ మరణ శాసనాలు రాసిన నరరూప రాక్షసులకు నాయకత్వం వహించిన కొలంబస్ అమెరికా ఖండంలోని ఒక ద్వీపంపై కాలుమోపిన నాటిరోజును ఒక దినోత్సవంగా జరుపుకుంటారా అంటూ దానికి వ్యతిరేకంగా స్థానిక అమెరికన్లు అమెరికా సంయుక్తరాష్ట్రాలలో అనేక నగరాలలో నిరసనలు తెలియజేశారు. కొలంబస్ అప్పటికే 100 మిలియన్ల మంది నివసించే అమెరికా ఖండాన్ని కనుగొనలేదు అలా కాదని మేము నిరూపించగలమంటూ ఎన్నో సాక్ష్యాలను చూపారు.**

క్రిస్టోఫర్ కొలంబస్ (1492) రాక ముందు అమెరికాలోని స్థానిక ప్రజల జనాభా సంఖ్యను ఊహించడం కొంత కష్టమైనా యూరోపియన్ వలస నివాసుల నుండి పురావస్తు ఇంకా రాతపూర్వక ఆధారాలతో చాలా మంది పండితులూ మరి కొంతమంది చరిత్రకారులూ - సుమారు 5-10 కోట్లమంది లేక అంతకంటే ఎక్కువ ఉండవచ్చని లెక్కకట్టారు. ఐతే ప్రస్తుతం వారి జనాభా 30 లక్షలు మాత్రమే. అయితే వీరిలో 30% కంటే తక్కువమంది మాత్రమే వారి మాతృభాషలను మాట్లాడగలుగుతున్నారు. అంటే 500 ఏండ్లలో అమెరికా ఆదివాసుల జనాభా పెరుగుదలమాట అటుంచి షుమారు 20 నుంచి 30 వంతుల తరుగుదల కనిపించడం జనాభా గణాంకాల పరిశోధకులకు ప్రశ్నార్థకంగా నిలిచిపోయింది.

అమెరికాలోని స్థానిక ప్రజలు అంటే రెడ్ఇండియన్లు ఐరోపాదేశాలనుంచి వలసవచ్చినవారి పరిచయంతో వారి జనాభా పెరుగుదలలో బలమైన అడ్డంకిని ఎదుర్కొన్నారు అని పరిశోధనలు తెలుపుతున్నాయి.పరిశోధనల ఫలితాలు ఇలా ఉన్నాయి. పురావస్తు, చారిత్రక రికార్డులు యూరోపియన్ల సంపర్కం వల్ల రెడ్ఇండియన్ల జనాభాలో విస్తృతమైన మరణాలు సంభవించాయని సూచిస్తున్నాయి. ప్రాచీన-సమకాలీన మైటోకాండ్రియల్ డిఎన్ఎతో అతివిస్తృతమైన సమాచారాన్ని ఉపయోగించి నిర్వహించిన అత్యాధునిక జన్యు అధ్యయనంలో, స్థానిక అమెరికన్ల జనాభా పెరుగుదలలో గణనీయమైన నష్టాన్ని కలిగించిందని సూచిస్తోంది. యూరోపియన్ వలసరాజ్యం దేశీయ అమెరికన్లలో యూరోపియన్ల వలసలు విస్తృతమైన మరణాలను ప్రేరేపించిందని పేర్కొంది. (బ్రెండన్ డి. ఓ ఫలోన్ అన్డ్ లార్స్ ఫెహ్రెన్-శ్మిడ్జ్, పిఎన్.ఏ.ఎస్. డిసెంబర్ 20, 2011; https://doi.org/ @10.@1073/ pnas.1112563108) కొలంబస్ ఇంకా అతని సహచరులు అమెరికాను న్యూ వరల్డ్ అని పిలవడం దుర్మార్గం. వాస్తవానికి, రెడ్ఇండియన్లుగా మనం పిలుచుకొంటున్న ప్రజలు, అనగా తయినో, ఆరవాక్, లుకాయన్లు, అనే వందలాది అమెరికన్ ఆదివాసి తెగలవారు ఈ గడ్డపై అప్పటికి 14,000 సంవత్సరాల నుంచి నివసిస్తున్నారు.

**యూరోపియన్లు అమెరికన్ తీరాలను చేరిననాటి నుండి, శ్వేతజాతుల నాగరికతకూ అమెరికా ఖండపు ప్రాకృతిక ప్రపంచంలోని వివిధ తెగలకూ వారి మధ్యనున్న తేడాలు అనేక ఘర్షణలకు దారితీసింది. ఈ ఘర్షణలు ఏదో ఒక చోట కాక అమెరికా అంతటా విస్తరించాయి. ఈ ఘర్షణలే అమెరికా సంయుక్తరాష్ట్రాలు రెడ్ఇండియన్లపై 1,500 యుద్ధాలూ, దాడులూ జరపడానికీ దారితీసింది. ప్రపంచంలోని ఏ దేశానికైనా దాని స్వంత ప్రజలకు వ్యతిరేకంగా ఇలా చేయడం ఎక్కడా కనబడదు. 19 వ శతాబ్దం చివరలో రెడ్ఇండియన్లపై యుద్ధాలు ముగిసే సమయానికి, 2,38,000 కంటే తక్కువ మంది రెడ్ఇండియన్లు మాత్రమే మిగిలి ఉన్నారు. కొలంబస్ 1492 లో మొదటిసారి అమెరికా చేరినప్పటి ఉత్తర అమెరికాలో నివసిస్తున్న రెడ్ఇండియన్ల జనాభా (హెన్రీ డోబిన్స్,1966) 1 కోటి 50 లక్షల నుండి ఇప్పటి జనాభా 25 లక్షలకు గణనీయమైన తరుగుదల కనిపిస్తోంది.**

1492 లో కొలంబస్ సముద్రమార్గంద్వారా ప్రయాణించి తను భరతఖండానికి సత్వర సముద్రమార్గాన్ని కనుగొన్నట్లు తప్పుడు నమ్మకంతో, నేటి హైతీ - డొమినికన్ రిపబ్లిక్ లేక ఇస్పానియోలా అని పిలిచే చిన్న ద్వీపాలకు ప్రయాణించి చేరుకున్నాడు. వాస్తవానికి, ఆ దేశంలోని దేశీయ రెడ్ఇండియన్లను సాధారణంగా, "ఇండియన్" అని పిలవడానికి ఏకైక కారణం ఏమిటంటే, తను భారతదేశంలో ఉన్నానని పొరపాటుగా భావించటమే. తిరుగుప్రయాణంలో 500మంది రెడ్ఇండియన్లను బానిసలుగా అమ్మేందుకు బందీలను చేసి పట్టుకెళ్ళాడు.

స్పానిష్ రాజు ఫెర్డినాండ్, క్వీన్ ఇసాబెల్లా నుండి మరింత ఆర్థిక సహకారం పొందటానికి, తను ఇండియాకు త్వరిత మార్గాన్ని కనుగొన్నట్లు వార్తలతో తిరిగి వచ్చాడు. ఇట్లా, 1493, 1498, 1502 లలో ఇండియాగా పిలవబడే ఇప్పటి మధ్య అమెరికాకు మరో మూడు ప్రయాణాలకు ఆయన నిధులు పొందారు.

ఆ సముద్రయానాల ఫలితం, ఆదివాసుల భాషలనూ వారి పురాతన నాగరికతలను నాశనం చేయడంతోపాటు, సుమారు ఎనభై లక్షల మంది రెడ్ఇండియన్లను హత్య చేయడం, లక్షలాది మందిపై అత్యాచారం, హింసించటమేకాక వారు అనుభవిస్తున్న లక్షల ఎకరాల భూమిని దోచుకున్నాడు.

ప్రపంచ చరిత్రలో కొలంబస్ అంతటి నికృష్టుడూ- నిస్సందేహంగా పరమ రాక్షసుడు అని నిరూపించే తిరస్కరించలేని ఐదు వాస్తవాలు చారిత్రకంగా నమోదు చేయబడిన కథనాలు ఉన్నాయి:

కొలంబస్ తన అన్వేషణలో "ఆదివాసులను ఏవిధంగానూ గాయపరచకుండా ఉండాలి అని స్పానిష్ రాజు ఫెర్డినాండ్, రాణీ ఇసాబెల్లాల ఆదేశాన్ని కొలంబస్ విస్మరించినట్లు తెలుస్తోంది. ఉదాహరణకు, అతను మధ్య అమెరికాలో 1495 లో తనకు రావలసిన వ్యక్తిగత సుంకంగా ఒక "కట్టుబడి" వ్యవస్థను సృష్టించాడు, 14 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తీ ప్రతి మూడు నెలలకూ ఒకసారి "చిరు గంట" అంత బంగారాన్ని అందించాలి. కట్టుబడి అందించినవారికి వారి మెడలో ధరించడానికి "టోకెన్" లాంటిది ఇచ్చేవారు. అలా

అందించనివారిని "చేతులు నరికి చంపడం ద్వారా శిక్షించడం", "చనిపోయేంతవరకూ నెత్తురు ఓడుతుండేట్లు వదిలివేయడం" జరిగేది అని కొలంబస్ కుమారుడు ఫెర్నాండో తన దినచర్యలో భాగంగా రాసుకున్నాడు. హైతీ మరియు డొమినికన్ రిపబ్లిక్‌లో సుమారు 10,000 మంది అలా హింసకు గురయ్యారు. చాలా మందిని కొన్నిసార్లు - సజీవంగా ఉండగానే - ''ఇనుప మేకులు తేలిన కట్టెల మీద కాల్చటం"... ఇంకా ఆక్రమణదారులు తమ కత్తుల పదును తేల్చేందుకు "ఆదివాసుల పిల్లలను ముక్కలు చేయడం'', ఇంకా, కొలంబస్ మనుషులు "ఆదివాసుల పిల్లలను తమ తల్లి రొమ్ము నుండి లాగి కాళ్ళుబట్టి, బండలకేసి తలలు బాదడం...", పిల్లల మృతదేహాలను వారి తల్లులపైవేసి ... కత్తులతో చీల్చడం జరిగేది", "వారి కత్తుల పదును పరీక్షించడానికి", తన మనుషులను ''వారి నుండి పరుగెత్తే పిల్లల కాళ్ళను నరికివేయమని" ఆదేశించేవాడట. అతని సిబ్బంది "ఆదివాసులపై ... మరిగే సబ్బునీళ్లు పోయడం", ఇతరులను ''బతికుండగానే పీక్కుతినడానికి, ఆదివాసులపై కుక్కలను ఉసిగొల్పడం", ఇంకా భయానకమైనదేమంటే తమ వేటకుక్కలకు మాంసం అయిపోతే, "ఆదివాసుల పిల్లలను కుక్కలకు ఆహారం కోసం చంపివేయడం" అంటూ బార్టోలోమ్ డి లాస్ కాసాస్ అనే స్పానిష్ చరిత్రకారుడూ కాథలిక్ పూజారీ తను నమోదుచేసినట్లు, కొలంబస్ దండు జరిపిన మారణహోమానికి సాక్ష్యమిచ్చాడు.

కొలంబస్ తోటి నావికుడు, మిగ్యుల్ కునియో కూడా ఇలా వ్రాశాడు, "మేము స్పెయిన్‌కు బయలుదేరాల్సి వచ్చినప్పుడు, 1,600 మంది మగ, ఆడ రెడ్‌ఇండియన్లను సేకరించాము... ఫిబ్రవరి 17, 1495న... మేము ఈ విషయాన్ని... నావికులలో ఎవరైనా కావాలనుకుంటే ... వారిని అనుభవించవచ్చని తెలియపరిచాం." కొలంబస్, నావికులలో ఒకరికి 16ఏండ్ల కరేబియన్ అమ్మాయిని బహుమతిగా ఇచ్చాడు."ఆమె ప్రతిఘటించినప్పుడు (అతడు) ఆమెను కనికరం లేకుండా కొట్టి ఆమెపై అత్యాచారం చేశాడు". అత్యాచారాల గురించి మాట్లాడుతూ, యూనివర్సిటీ ఆఫ్ వెర్మోంట్ చరిత్ర ప్రొఫెసర్ డాక్టర్ జేమ్స్ లోవెన్ "1493 యాత్ర కరేబియన్‌కు చేరుకున్న వెంటనే ... కొలంబస్ తన లెఫ్టినెంట్లకు స్థానిక మహిళలను బహుమతిగా ఇస్తున్నాడు. హైతీలో, వారిని సెక్స్ బానిసలుగా చేసి ఆనందించేవారు." ఇందులోని వయోజనులూ పిల్లలూ అత్యాచారానికి గురయ్యేవారు ఉన్నారు. "బాలికలలో ... 9-10 వయసువారికి ... డిమాండ్ ఉంది" అని కొలంబస్ స్వయంగా 1500 లో వ్రాసినట్లు తెలుస్తోంది". ఒక రోజున, డి లాస్ కాసాస్ ప్రత్యక్షసాక్షిగా, కొలంబస్ సైనికులు "3,000 మంది స్థానికులను విడదీయడం, శిరచ్ఛేదం చేయడం లేదా అత్యాచారం చేయడం" చూశానని రాసుకున్నాడు. డిలాస్ కాసాస్ మాటల్లో "ఈ చర్యలను మానవ స్వభావానికి విరుద్ధమైనవిగానూ పరమ నికృష్టమైన వికృతచేష్టలుగా నా కళ్ళకు అనిపించాయి. ఇప్పుడు నేను వ్రాస్తున్నప్పుడు నేను వణుకుతున్నాను." అంటూ పేర్కొన్నాడు.

అతి క్రూరమైన పాశవిక మారణకాండను ఎదుర్కొంటున్న ఆరవాక్ ఆదివాసులు స్పెయిన్ వలసవాదులకు వ్యతిరేకంగా పోరాడటానికి ప్రయత్నించారు. కానీ వారికి యూరోపియన్ల దగ్గర ఉన్న ఆయుధాలూ, తుపాకులూ, కత్తులూ ఇతరత్రా ఇంకా గుర్రాలు కలిగిన యుద్ధసంపదతో పోలికే లేదు. బందీలుగా తీసుకున్న రెడ్‌ఇండియన్లను స్పెయిన్ వలసవాదులు ఉరితీయడమో లేదా కాల్చివేయడమో చేసేవారు. ఈ పరిస్థితులలో, ఆరవాక్ ఆదివాసులు సామూహిక ఆత్మహత్యలు చేసుకోవడం ప్రారంభించారు. వారు తమ శిశువులను స్పానిష్ వలసవాదుల నుండి కాపాడటానికి కసావాకంద విషాన్ని తినిపించేవారు. రెండేళ్లలో, హైతీలో ఉన్న 2,50,000 మంది ఆదివాసులలో సగం మంది హత్యకు గురవ్వడమో, అంగవైకల్యం పొందడమో లేదా ఆత్మహత్యల ద్వారా చనిపోవడమో జరిగింది. 1550 నాటికి 500 మంది రెడ్‌ఇండియన్లు మాత్రమే మిగిలారు. ఇక **1650 నాటికి, ఆరవాక్ ఆదివాసులుగా ప్రపంచానికి పరిచయమైన రెడ్‌ఇండియన్లు అమెరికా ఖండం నుండి పూర్తిగా తుడిచిపెట్టబడ్డారు. వారితోబాటే వారి భాషకూడా వలసవాద యూరపుదేశీయుల దాష్టీకానికి బలైపోయింది. ఈ రక్తసిక్త చరిత్ర పునరావృతం కాకూడదంటే వీటిని మననం చేసుకోవడం మనకు తప్పనిసరి. కాలగతిలో వచ్చిన మార్పులను ఆసరాగా తీసుకొని ఈ నేలపై పుట్టిన జాతులపై వారి భాషలపై ప్రపంచీకరణ పేరుతో పరభాషలను రుద్దే ప్రయత్నాలను జాగ్రత్తగా గమనించాలి. గమనించటమేకాదు వాటిని అడ్డుకునే ప్రయత్నమూ చేయాలి.**

కవిత

## అమ్మతనం

అందాల కలలలోకంలో
ఆదమరిచి విహరించిన ఆ మనసు..!
ఆనందాల బృందావనమయ్యే
అపురూప క్షణాలు..!

ఉదరపు కుడ్యాలను తడుముతున్న
ఆ వెచ్చని పాదాలు..!
వెన్నులో నుండి పుట్టుకొచ్చిన
నాడులు నాట్యాలు..!

భరించలేని బాధల సుడుల్లో
తనువు పుండైన తరంగాలు..!
ఉమ్మనీటి సెలయేరులో
స్వేచ్ఛగా ఈదురున్న ఆ
వారసుని రాకకు సూచికతో..
దిక్కులు పిక్కటిల్లేలా సంతోషపు కేకలు..!

ఒకవైపు కండరాలన్ని బరువెక్కి
ఎముకలన్నీ విచ్చుకోగా
ఆ...ఊపిరాడని క్షణాల్లో
మరణవేదికపై తల్లిగా ఓ..పునర్జన్మ!

చీకటి ముసిరిన ఆకళ్లల్లో దివ్యతేజస్సులు
పొత్తిళ్లలో బిడ్డను చూసిన మది
ఆనందతాండవాలు..!

ప్రతి స్త్రీకి ఆ...నవమాసాలు అద్భుత
అనుభూతులకు ఆలవాలమే!
వారసుల వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుతూ
పొందే అనుభవం ఓ అపురూపవరమే!

- అయిత అనిత
89885 348424

సి.వి.క్రిష్ణయ్య
93965 14554

# బ్రతుకుతెరువు కోసం తెలుగు భాష

నేనొక పల్లెటూరు హైస్కూల్లో పనిచేస్తున్నాను. సిటీ నుండి ఈ ఊరికి బస్ సౌకర్యం ఉంది. గంటలోపు ప్రయాణం. పిల్లలు కాలేజి చదువులకు వచ్చినందువల్ల, ప్రయాణ సౌలభ్యం వల్లా సిటీలో సంసారం పెట్టాను.

సిటీ బస్ కోసం ప్రతి రోజు ఒక బజారు సెంటర్లో నిలబడి ఎదురుచూసేవాడిని. ఆ సెంటర్లో అనేక షాపులతో పాటు ఒక యస్.టి.డి. టెలిఫోను బూతు, ఒక ఫోటోస్టుడియో కూడా ఉన్నాయి. ఈ రెండింటిలో పని చేస్తున్న ఇద్దరు యువకులు నాకు పరిచమయ్యారు. వారు చాలా తక్కువ జీతానికి పనిచేస్తున్నారు. వేరే ఎక్కడైనా కొత్త పని కోసం ప్రయత్నిస్తూ ఉన్నారు.

నేను బస్ వచ్చే వరకు యస్‌టిడి బూతులో కూర్చుని అక్కడ పనిచేస్తున్న ప్రసాదుతో పిచ్చాపాటి మాట్లడతూ ఉండేవాడిని. ఒక రోజు ఉన్నట్లుండి ప్రసాదు "సార్ ఇంతకూ మీరు ఏమిచేస్తుంటారు? అని అడిగాడు.

"పిల్లలకు అక్షరాలు నేర్పుతుంటాను" అని బాధగా చెప్పాను.

మీరు ఎలిమెంటరీ స్కూలు టీచరా?

"కాదు, హైస్కూల్లో సీనియర్ తెలుగు పండితుడిని".

అయితే అక్షరాలు నేర్పడం ఏమిటి?

"ఏమి చేయమంటావు? పదో తరగతికి వచ్చినా చదవడం రాయడం రాదు. ఏంరాదో అదేకదా నేర్పాలి" అన్నాను విసుగ్గా.

ఈ మాటలు విన్న ప్రసాదు, నారెండు చేతులు గట్టిగా పట్టుకొన్నాడు. నేను ఆశ్చర్యపోయాను. "సార్ నా పరిస్థితి గూడా ఇదే. నేను పదోతరగతి వరకు కాన్వెంట్‌లో ఇంగ్లీషు మీడియంలో చదివాను. నాకు ఇంగ్లీషూ రాదు. తెలుగూ రాదు. అయితే తెలుగు కొంచెం మెరుగు. మనం మాట్లాడే భాషేగదా! కాని సరిగ్గా రాయలేను. తప్పులుపోతాయి. మా అమ్మ ఉదయం సాయంకాలం చిన్న టిఫెన్ సెంటర్‌నడువుతూ ఉంది. నేను రాత్రి ఇంటికి వెళ్లగానే రేపటికికావలసిన సామాను ఏది ఎంతకావాలో చెప్పి డబ్బులిస్తుంది. నేను ఆ సామాను పేర్లలో మొదటి అక్షరాలు ఒక చీటీ మీద రాసుకొంటాను గుర్తుకోసం. ఆ చీటీని తీసుకొని కొట్టుకు వెళతాను. చీటీ చూసి ఏది ఎంత కావాలో రాసుకొమ్మని కొట్టువాడికి చెబుతాను. అతను నా చేతులోని చీటి ఇమ్మంటాడు. దాన్ని ఎలా ఇచ్చేది? అసలు సంగతి ఏమిటంటే ఆషాపువాడు నాబాపతే. ఈ మధ్య నాకు ఒక ఎలక్ట్రిక్ షాపులో ఉద్యోగం ఇస్తామన్నారు. లెక్కలు రాసే పని. రాదన్నాను. నేర్చుకొని రమ్మన్నారు. ఎలాగా అని అలోచిస్తున్నాను. దేవుడిలా మీరు దొరికారు. ఎల్లాగైనా మీరు నాకు నేర్పాలి. ఉండండి శంకర్‌ని కూడా పిల్చుకొని వస్తాను. అంటూ ఫోటో స్టూడియోకెళ్లి శంకర్‌ను పిల్చుకొని వచ్చాడు.

"సార్ ఎంతడబ్బు అయినా ఇచ్చుకుంటాం. మీరు మాకు చదువు నేర్పాలి అంటూ ప్రాధేయపడ్డారు. ఇంతకూ మీరు పది పాసయ్యారా అని అడిగాను. 'పాసయ్యాము ఇంటర్లోకూడా చేరాము. ఇంటర్ చదవలేమని త్వరలోనే తెలిసిపోయింది. కాలేజీ మానుకొన్నాము. పనుల్లో కుదురుకున్నాము.'' అని చెప్పారు. మరి పదెలా పాసయ్యారని అడిగాను.

"ఏమోసార్ ఎలా పాసయ్యామో అంటూ సిగ్గుపడుతూ తలలు వంచుకున్నారు. అవును. చూసి రాశామనీ, పరీక్షహాల్లో మూకుమ్మడిగా అందరికీ బిట్‌పేపర్లు జవాబులు చెప్పారనే సంగతి ఎలా చెబుతారు. టీచర్లు అధికారులు, ప్రభుత్వమూ కలిసి పిల్లల జీవితాలతో ఆడుకుంటుంన్నారనీ, పిల్లల తల్లిదండ్రులను మోసగిస్తున్నారనీ అంటే ఎవరూ ఒప్పుకోరు. పైపెచ్చు పిల్లలకు సహాయం చేసామని చెబుతారు. ఇంక ఎవరు మాత్రం ఏమీ చేయగలరు? సంవత్సరమంతా సిలబస్, పాఠాలంటూ శ్రమపడడం ఎందుకు? అంతా పరీక్షరోజుల్లో సాయం చేస్తే సరిపోతుంది గదా! నిజంగానే ఇలాగే అనుకొంటున్నారు చాలా మంది.దీనివల్ల చెప్పే టీచర్లకు కూడా ఆసక్తి లేకుండా పోయింది. చదివే పిల్లలు చదవడం మానుకొన్నారు. పదో తరగతి పిల్లలకు సంవత్సరమంతా ఎలా పాసవ్వాలో శిక్షణ ఇస్తూ ఉంటారు. పిల్లలు పది పూర్తిచేసి బయటకు వచ్చి బతాకాల్సి వచ్చినపుడు ఈ పాస్‌లూ మార్కులూ ఎందుకూ పనికిరావు. వాళ్లకు మిగిలేది చదవడమూ, రాయడమూ కాస్తంత గణితమూ. అందుకే ఐన్‌స్టీన్ బడిలో సంపాదించిన జ్ఞానాన్ని గురించి ఒక మాట అంటాడు. "బడిలో నేర్చుకొన్నదంతా మరిచిపోయిన తర్వాత ఏదిమిగిలి ఉంటుందో అదే జ్ఞానం అంటాడు. ఇప్పుడు మన పిల్లలకు మిగిలింది ఏమిటి? ఎంతసేపటికీ నూటికి పదిమంది చదివే ఉన్నత చదువుల గురించే ఆలోచిస్తారు. తొంభైమంది సంగతి గాలికి వదిలేశారు.

'సార్ ఏమిటి ఆలోచిస్తున్నారు. మాకు మీరేదిక్కు." అంటూ ప్రాధేయపడసాగారు. శంకర్ ప్రసాద్‌లిద్దరూ. అవసరం వారిదీమరి."నేను సాయంకాలం వచ్చి మీతో మాట్లాడతాను. మీకు చదువు నేర్పే బాధ్యత తీసుకొంటున్నాను. ధైర్యంగా ఉండండి' అని వారికి భరోసా ఇచ్చాను.

సిటీ బస్సెక్కి కూర్చోగానే అనేక ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. హామీ అయితే ఇచ్చాను గాని ఓపిగ్గా చెప్పగలనా? ఎన్ని రోజులు పడుతుందో? సందేహించాను, భయపడ్డాను. కాని పిల్లల శక్తి సామర్థ్యాల మీద నాకు అపారమైన నమ్మకముంది. టీచర్‌గా నా సర్వీసు పెరిగే కొలదీ పిల్లలతో అనేక అనుభవాలు పొందాను. ఈ అనుభవాల ఆధారంగా బడిని గురించి పిల్లల చదువుల గురించి నాలో కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలు ఏర్పడ్డాయి.

1.పిల్లలు బడిలో చదువు నేర్చుకోవడానికీ, నేర్చుకోలేకపోవడానికీ వారి తెలివితేటలకూ ఏ సంబంధమూలేదు.

2.పిల్లలు బడిలో తమశక్తి సామర్థ్యాలను ప్రదర్శించడానికి ఎలాంటి అవకాశంలేదు. సాధ్యమైనంత వరకూ వాటిని అణచుకొని తమనుతాము అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నిస్తూ ఉంటారు.

3.కొందరు పిల్లలు పదేళ్లు బడిలోఉన్నా చదవలేకపోవడానికీ, రాయలేకపోవడానికీ కారణం టీచర్లు చెప్పకపోవడం కాదు, టీచర్లు చెప్పకపోయినా బడికి వచ్చినందుకైనా 50 అక్షరాలు గుర్తుపట్టి అక్షరం పక్కన అక్షరం పెట్టి చదవడం రాయడం స్వయంగా నేర్చుకొని ఉండాలి. ఆ మాత్రం నేర్చుకోగల్గిన శక్తిసామర్థ్యాలు పిల్లలకున్నాయి. బడిలో టీచర్ల వల్లా, బోధనా పద్ధతులవల్లా పిల్లల్లో ఏర్పడ్డ మానసిక సమస్యఇది.

4.భయం- ఈ అర్థంగాని చదువుల వల్లా, టీచర్ మాటలవల్లా, పరీక్షలు, మార్కులు, పాస్, ఫెయిల్- ఇలాంటి వాటి వలన బడిలో ఒకరకమైన భయం ఏర్పడుతుంది. ఈ భయం జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది. ఆరోగ్యంపైన ప్రభావం చూపిస్తూ ఉంటుంది.

5.ఆత్మన్యూనత- చాలా విషయాలు అర్థం కానందు వల్ల నిరంతరం ఇతరులతో పోటి ఉన్నందు వల్ల (పరీక్షలు మార్కులు ఒక రకమైన పోటీయే) ఆత్మన్యూనత ఏర్పడుతుంది. తనను తాను అసమర్థునిగా భావించుకొంటాడు.

6.పిల్లలను చదువులపేరుతో హింసించడం తిట్టడం మాని ఆత్మవిశ్వాసం కల్గించేలా ధైర్యం చెప్పాలి. ప్రోత్సహించాలి. భయాన్ని, ఆత్మన్యూనతను పోగొట్టాలి. వారే చదువుకొంటారు. వృత్తి నిపుణులపేరుతో కొంతమంది కౌన్సిలింగ్ ఇస్తూ పిల్లల్ని హింసిస్తూ ఉంటారు. ఈ కౌన్సిలింగ్ సన్నిహితంగా ఆత్మీయంగా ఉండే టీచరే చేయాలి. ఈ విషయాలన్నీ నాకు గుర్తుకురాగానే నా పని సులువుగానే పూర్తవుతుందని నమ్మకం ఏర్పడింది.

సాయంకాలం బస్సుదిగగానే ప్రసాద్ శంకర్‌లు పరుగెత్తుకొంటూ నా దగ్గరకొచ్చారు. ఇంటికెళ్లి బడలిక తీర్చుకొని ఒక అరగంటలో వస్తానని చెప్పాను. పాపం వారి ఆత్రం వారిది. నాకూ ఆసక్తిగానే ఉంది. ముందు వారికెంత వచ్చో, ఏమిరాదో తెలుసుకోవాలి. గణితం, భాషల్లో ప్రాథమిక విషయాలు (బేసిక్స్) ఎంత వచ్చో తెలుసుకోడానికి నేను కొంత సరంజామా సిద్ధంచేసుకొని ఉన్నాను. ఈ సరంజామా నాలుగు స్థాయిల్లో ఉంటుంది. ఈ సరంజామా అంతా తీసుకొని శంకర్ పనిచేసే ఫొటోస్టూడియోలో కూర్చొన్నాం. ఒక అరగంటలోనే వారికెంత తెలుసో? రానిదేదో అర్థమైపోయింది.

వీరికి తొంభైశాతం వచ్చు. మిగిలిన పదిశాతం కూడా సందేహాలేకానీ రాకపోవడంగాదు. గణితంలో బాగా వెనుకబడి ఉన్నారు. స్థాన విలువలు, సంఖ్యామానం, క్లిష్టంగా ఉన్న తీసివేతలు, భాగహారాలు, ఆయా సందర్భాలలో సున్న(0) విలువ తెలియదు. పదిరోజుల కృషితో దారిలో పడ్డారు. ప్రోత్సాహించడం, ధైర్యంచెప్పడం కొన్ని చిన్నచిన్న పొరపాటు అభిప్రాయాలను సరిదిద్ది ధారాళంగా చదివే అలవాటు చేయడం. ఇవే నేను చేసిన పనులు. వారి శ్రద్ధా, భవిష్యత్తు మీద ఆశా, అవసరాలే వారు వేగంగా నేర్చుకొనేటట్లు చేసాయి.

**పదిరోజులు నేను చేసిన కృషి వివరిస్తాను.**

1. పరీక్షించిన రోజునుంచే పని ప్రారంభించాను. వారికి ఇప్పుడు రాయడం ముఖ్యం. తప్పులేకుండా రాయాలంటే మొదటచేయాల్సిన పని స్పష్టంగా, భావయుక్తంగా, ధారాళంగా చదవడం రావాలి. ముక్కుతూ, నసుగుతూ చదువుతున్నారు. ఎలా చదవాలో వినిపించి చిన్నచిన్న కథల పుస్తకాలిచ్చి రాత్రికి బాగా చదువుకొని రమ్మని చెప్పాను. పాపం రాత్రి చాలాసేపు మేలుకొని ఒక్కో కథ నాలుగైదుసార్లు చదివి, మరుసటి రోజు నాకు చదివి వినిపించారు. నేను ఆశ్చర్యంపోయాను. ఒక్కరోజులోనే చాలా అభివృద్ధి కనబడింది. అంటే పఠనాన్ని ఎంత నిర్లక్ష్యం చేస్తున్నామొ అర్థమయింది.

2. భయాన్ని సిగ్గుపడటాన్ని దానికి కారణాలను వివరించి - తప్పో ఒప్పో రాయడం, మనం రాసింది మనమే తప్పులు సరిచూసుకోవడం, పుస్తకంలో ఉన్న కథలను సొంతమాటల్లో రాయడం అలవాటు చేసాను. రాసేటప్పుడు ఎక్కువగా చేసే పొరపాట్లను సరిదిద్దాను.

3. ఎక్కువ తప్పులు పోతున్నవి గుడిదీర్ఘం, ఏత్వం, ఓత్వం- ఉన్నచోట్ల తీసేయడం లేనిచోట్ల ఇవ్వడం-దీనికి కారణం వీటిని దీర్ఘంగా భావించడంలేదు. కకా, కికీ, కుకూ, కెకే, కొకో, ప్రతి రెండో అక్షరం దీర్ఘమే. పొల్లు అన్నా దీర్ఘంఅన్నా ఒకటే, సౌలభ్యంకోసం కొన్ని అక్షరాలకు దీర్ఘాన్ని 'కా' మాదిరి భూమికి సమాంతరంగా కాకుండా పైకి మళ్లించారు. 'కీ, కే, కో'"- ఈ మూడు అక్షరాలకు దీర్ఘం(పొల్లు) భామిక సమాంతరంగా రాస్తే ఎలా ఉంటుందో ఊహించుకోండి. అర్థం చేసుకోవడం కష్టం అవుతుంది కదా.

ఇలా వివరించి రాసేపదాన్ని ముందుగా పైకి పలుకుతూ రాయమని సలహా ఇచ్చాను.

4. ద్విత్వాలు(క్క,ప్ప) తప్పులేకుండా రాస్తున్నారు. కాని సంయుక్తాలు (క్ర, ర్ప) అక్కడక్కడా ఇబ్బంది పడుతున్నారు. విడదీసిరాయడం ఎలాగో నేర్పించాను.

సుల్తాను - సుల్‌తాను, - కార్యం - కార్‌యం

చక్రవర్తి - చక్ రవర్‌తి, ప్రయత్నం - ప్ రయ త్‌నం.

హల్లు నిండు అక్షరంగాను, నిండు అక్షరం వత్తుగాను మారడం గమనింపచేసాను.

5.ష స శ చ - ల ళ - న ణ - లమధ్య ధ్వని బేధాలను గుర్తింపజేసి తప్పులు రాసే సందర్భాలను తెలియజేసాను.

6.వత్తు అక్షరాలు - ఖ ఘ ఛ ఝ ఠ ఢ థ ధ ఫ భ - ముఖ్యంగా ధ,భ,ఫ-లు ఎక్కువగా వాడుకలో ఉన్నకొన్ని పదాలను గుర్తించి ఒక జాబితా ఇచ్చాను.

7.ఙ,ఞ,ఝ,థ - వీటిని చూసి భయపడకుండా ఏపదాల్లో వస్తాయో వివరించాను.

8.అనుమానం వచ్చినపుడు ఎలా మాట్లాడుతున్నామో అలాగే రాసి, తరువాత తప్పొప్పుల గురించి ఆలోచించి సరిచేసుకోవల సిందిగా సలహా ఇచ్చాను.

9.మ, య - గుణింతంలో మొమో-యెయో-ఇలా రాసే సంప్రదాయాన్ని తెలిజేసాను.

10.ప్రామిసరీనోటు రాయడం, రశీదు రాయడం, అప్లికేషన్లు పూర్తిచేయడం, రైల్వే రిజర్వేషన్‌ఫారం పూర్తి చేయడం, బయోడేటా రాసిపెట్టుకోవడం, ఆర్జీరాయడం, బ్యాంకులావాదేవీలు, జమ చేయడం, నగదు తీసుకొనే ఫారాలు పూర్తిచేయడం నేర్పాను.

11. గణితంలో రానివేవో అవినేర్పాను. సులభంగానే నేర్చుకొన్నారు. జమా ఖర్చులు ఎలారాయాలో నేర్పాను. బ్యాంకు

## పిల్లల్ని పరీక్షించకండి-ప్రోత్సహించండి.

తెలుగు భాషాభిమానులు, పిల్లల చదువులపై శ్రద్ధఉన్నవారు, అధికారులు స్కూళ్లకు వెళ్లుతూ ఉంటారు. ఏదో ఒక తరగతిగదిలో అడుగుపెడతారు. పరిచయం చేసుకొంటారు.

పిల్లల్ని కొన్ని ప్రశ్నలు వేస్తారు. ఏదీ ఒకపద్యం చెప్పండి? సవర్ణదీర్ఘసంధి సూత్రం చెప్పండి? ప్రకృతికి వికృతి చెప్పండి? మన రాష్ట్రపతి ఎవరు? మనదేశ సరిహద్దులు చెప్పండి. పందొమ్మిదో ఎక్కం చెప్పండి. ఇలాంటివి ఏవో అడుగుతారు. ఇలా అడిగి పిల్లలకు ఏమీరాదని, అక్కడి టీచర్లు ఏమీ చెప్పడం లేదని నిరూపించదలిచామా?

ఆ సమయంలో పిల్లలు ఎలాంటి స్థితిలో ఉంటారు? ఎవరో వచ్చారు, ఎవరిని ఏమి ప్రశ్నిస్తారో అని భయపడుతూ ఉంటారు. ఈ భయంతో వచ్చింది కూడా మరచిపోతారు. ఆ సమయంలో ఏమీ ప్రశ్నించకండి. వాళ్ల ఇబ్బందులుకూడా అడక్కండి. ఏమి చెబితే ఏమవుతుందో అని ఎవరూ ఏమీ చెప్పరు.

స్కూలుకు వెళ్లేటప్పుడు నాలుగు కథల పుస్తకాలు తీసుకెళ్లండి. ఒక కథను చెప్పమని అడగండి. లేదా మీరు తెచ్చిన కథల పుస్తకం ఇచ్చి చదవమనండి. అంతా శ్రద్ధగా వినండి. ఆ కథలో విషయాలను ప్రశ్నించకండి. ఆ'కథ'ను అనుభూతి పొందడమే ఇక్కడ ముఖ్యం. మీరు బాగా చదివగల్గితే ఒక మంచి కథచదివి వినిపించండి. నీకు వచ్చినదేదైనా పిల్లలముందు ప్రదర్శించండి. జోక్స్ చెప్పండి. లేదా జోక్స్ చెప్పమని పిల్లల్ని అడగండి. ఆ కొద్ది సమయంలో మీరొక మంచి జ్ఞాపకంగా మిగిలిపొండి. చిరునవ్వుతో ఉండండి. చిరునవ్వుతో సెలవు తీసుకోండి. మీరు తీసుకెళ్లిన పుస్తకాలు పిల్లలకు బహూకరించండి.

పిల్లలు తెలుగు మాటల్ని, తెలుగు సంభాషణలను, తెలుగు సాహిత్యాన్ని తెలుగు పుస్తకాల్ని ప్రేమించేటట్లు చేయండి. భయపెట్టకండి.

పాసుపుస్తకంలో బ్యాంకువారు ఎలా జమాఖర్చులు రాస్తారో పుస్తకం పరిశీలింపజేశాను.

12. చివరలో 5 పదాలు ఇచ్చి కథ రాయమన్నాను. కథ అద్భుతంగా రాసారు. ఆనందంగా రాసారు.

"జీవితంలో ఇంత ఆనందంగా, ఇంత ధైర్యంగా స్వంతంగా ఇంతవరకూ రాయలేదు. ఇలా రాయగలమని మాకు తెలియదు. సార్ ఏమీ అనుకోరంటే ఒక మాట చెబుతాము. మీరు తెలుగు పండితులుగదా పద్యాలు, ప్రతిపదార్థం, సంధులు, సూత్రాలు ఇలాంటివి చెబుతారోమోనని భయపడ్డాం. తెలుగు ఇంత సులభమా? మరి అందరూ తెలుగు ఇలా ఎందుకు చెప్పరు" అని ప్రశ్నించారు.

"సర్ ఇన్నేళ్లు భయం భయంగా నేర్చుకొన్నాం. ఈ పదిరోజుల్లో ఇన్ని విషయాలు నేర్చుకొన్నాం. చదువంటే భయం పోయింది. ఇప్పుడు మళ్లీ కాలేజీలో చేరి చదవాలనిపిస్తున్నది. మీ రుణం ఎంత ఇచ్చినా తీర్చుకోలేం. మీ ఫీజు ఎంతో చెబితే ఇచ్చుకొంటాం" అంటూ నా గురుదక్షిణ ఎంతో చెప్పమన్నారు.

"మీరు భయంభయంగానైనా బడిలో ఎంతో నేర్చుకొన్నారు. కాకపోతే కర్ణుడి శాపంలా, భయంవల్ల ఆచదువు ఎందుకూ ఉపయోగంలేకుండా పోయింది. నేను కొన్ని కొత్త విషయాలు నేర్పిఉండవచ్చు. నేను చేసింది మీకు ధైర్యంచెప్పి ఆత్మవిశ్వాసం కల్గించడమే. బడిలో ఉపాధ్యాయుల్లాకాకుండా మీతో స్నేహంగా సన్నిహితంగా ఉన్నాను. ఇందువల్లనే మీరు నేర్చుకొన్నారు. ఫీజు సంగతి అంటారా? నానుండి మీరెంత నేర్చుకొన్నారో మీనుండి కూడా నేను ఎంతో నేర్చుకొన్నాను. నాకు ప్రభుత్వం జీతం ఇస్తున్నది. నేను నా తెలుగునేగదా నేర్పాను. ఒక పనిచేయండి. మీలాంటి యువతీ యువకులు మీచుట్టూ ఉంటారు. మీలానే ఇబ్బంది పడుతుంటారు. మీరు నేర్చుకొన్న విషయాలన్నీ దాచుకోకుండా వారికి నేర్పించండి అంటూ నా ఆశీస్సులు అందించాను.

మరునాడే ప్రసాదు ఎలక్ట్రిక్ షాపులో ఉద్యోగంలో చేరాడు. మూడోరోజు మా యింటికొచ్చి బెడ్‌లైట్ ఒకటి బహూకరించాడు. మీకు కరెంటుకు సంబంధించి ఏ వస్తువు కావాలన్నా మా షాపుకురండి. లేదా ఫోన్ చేసి చెప్పండి తెచ్చి ఇస్తానని తన షాపు విజిటింగ్‌కార్డు ఇచ్చి నన్ను తన కస్టమర్‌గా చేసుకొన్నాడు.

శంకర్ ఆవీధిలోనే ఒక వారం తర్వాత కొత్త ఫొటోస్టూడియోపెట్టి నాచేతనే ప్రారంభోత్సవం చేయించాడు. ఇది కథ కాదు ఒక అనుభవం.

ఇప్పటినుండి నా మనస్సులో ఒక ప్రణాళిక రూపుదిద్దుకొన్నది. శంకర్ ప్రసాదులాంటి యువకులకు, యువతులకు నిత్య జీవితంలో అవసరమైన తెలుగు గణితం నేర్పాలి. ఇందుకోసం అవసరమైన సిలబస్ రూపొందించుకోవాలి. 15 రోజులు, నెల రోజులు, 3 నెలల కోర్సులు పెట్టి సర్టిఫికెట్లు ఇవ్వాలి. ఈ ఆలోచన రేపోమాపో కార్యరూపంలో పెట్టాలనుకొంటూ ఉన్నాను. ఇంతలో రెండు ఉపద్రవాలు వచ్చి పడ్డాయి. ఒకటి నా అనారోగ్యం, రెండు కరోనా. ప్రస్తుతం ఆశానిరాశలమధ్య కొట్టుకులాడుతున్నాను.

భవిష్యత్తులో తెలుగు భాషాభిమానులు ఈపని చేస్తారని ఆశిస్తున్నాను. తెలుగును బ్రతికించుకోవడం ఒక్కటే మన ఆశయంకాదు. బ్రతుకు తెరువుకోసం తెలుగును ఎలా ఉపయోగించుకోవాలో కూడా మనం పిల్లలకు నేర్పాలి.



ఒక వ్యక్తితో అతనికి అర్థమయ్యే భాషలో మాట్లాడినప్పుడు ఆ మాటలు అతని తల వరకే చేరుతాయి. అతని మాతృభాషలో మాట్లాడితే అవి మనసులో నిలుస్తాయి

**-నెల్సన్ మండేలా**

డా. గంధం సుబ్బారావు
7901093537



# పీవీ గారి సాహిత్యాభినివేశం

**పీవీ నరసింహారావు గారు బహుముఖ శేముషీవిలసితుడు. ఆయనలో కవితాగుణాలు, దార్శనికతా లక్షణాలు - రెండూ జంటగా పెనవేసుకొనివున్నాయి. ఆయన వృత్తి రాజకీయాలు. ప్రవృత్తి కవిత్వం. ఆయనలో బాల్యం నుంచి భావావేశం అనే సహజలక్షణం వుండినది. కళాత్మకంగా తాదాత్మ్యానుభవం పొందే చిత్తస్ఫూర్తి, అన్వేషణాశీలమైన సూక్ష్మవివేకం, ఆస్వాదనాశీలమైన గ్రహణ ప్రకర్షణలతో పాటు, అపురూపమైన ధీవిభవం, స్వయంప్రేరకమైన వక్తృత్వ వైశద్యం వంటి ప్రతిభానైపుణ్యాలు నిబిడీకృతమైవున్నాయి. పీవీ గారు సహజకవి, రచయిత, భావుకుడు.**

"అతడు మహాకవి కాలేదు. గొప్ప నవలారచయితా కాలేదు. సంగీత విద్వాంసుడు గానో, లేదా చిత్రకారుడు గానో రూఢీ చెందలేదు. తత్వవేత్తగానో, శాస్త్రపరిశోధకుడుగానో - లేక విఖ్యాత న్యాయవాది గానో కూడా పేరు పొందలేదు". పీవీ గారి గురించి ఈ మాటలనే సాహసం చేసిన వ్యక్తి ఆయన ఆప్తమిత్రుడు, కాకతీయ పత్రిక సంపాదకులు, కీ.శే. పాములపర్తి సదాశివరావు గారు. 1972 మార్చిలో "జనధర్మ" ప్రచురించిన పీ.వీ. నరసింహారావు అభినందన సంచికలో రాసిన వ్యాసంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు.

సదాశివరావు గారంటే, బాల్యం నుంచీ శరీరాలు వేరైనా ఆత్మ ఒకటిగా పీవీతో జీవించిన మహానుభావుడు. అందుచేత ఇవి పీవీ గారు తనను తాను అంచనా వేసుకున్న మాటలుగా భావించవచ్చు.

ఈ మాటల్లో గుర్తింపవలసిన ఒక చమత్కారంవుంది. ఇక్కడ 'కాలేదు', 'చెందలేదు', 'పొందలేదు' - అంటూ చెప్పబడినవన్నీ అట్లా కావడానికి, చెందడానికి, పొందడానికి తగిన ప్రతిభా సామర్థ్యాలు పీవీలో పుష్కలంగా ఉన్నాయని నిర్ద్వంద్వంగా తెలియజెప్పటమే. పీవీ వ్యాసంగ వైవిధ్యాన్ని, వ్యాపకత్వాన్ని సువ్యక్తం చేయడమే. ఆ లక్షణాలన్నింటినీ ఒక చోటికి చేరిస్తే రూపుగట్టిన వ్యక్తిత్వం పీవీ గారిది.

పీవీకి గల పై అన్ని లక్షణాల్లో ఆయనకు రాజకీయ రంగం తరువాత, ఇంచుమించుగా అంతటి గుర్తింపును తెచ్చిన మరొక రంగం ఆయనకు గల సాహిత్యాభినివేశం. కవిత్వం, కథ, నవలిక, అనువాదం, నాటకం, విమర్శ, వ్యంగ్యం - హాస్యం, జర్నలిజం వంటి దాదాపు అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ ఆయన తన ప్రతిభను సందర్భోచితంగా ప్రదర్శించారు.

**కవిత్వం:**

ఆనాటి హైదరాబాద్ రాజ్య రాజకీయ పరిస్థితిల్లో సంఘాలు పెట్టుకోవడం, రాజకీయ సమావేశాలు నిర్వహించడం నిషేధం. అందుచేత దేవుని పేరిట భజన మండళ్ళను ఏర్పాటు చేసుకుని, భజనల నెపంతో సమావేశాలను నిర్వహించుకోవడం, ఈ సమావేశాల్లో విద్యార్థులకు దేశ సమకాలీన రాజకీయ పరిస్థితులు, జాతీయోద్యమం వంటి అంశాలను బోధించి, వారిలో స్ఫూర్తిని రగిల్చి, చైతన్యవంతులను చేయడం జరుగుతుండేది. గ్రంథాలయోద్యమం కూడా ఇదే వ్యూహంతో కొనసాగింది.

హనుమకొండ హైస్కూల్లో కూడా ఇటువంటి భజన మండలి ఒకటి ఏర్పాటైంది. ఆ ఏర్పాటులో పీవీ ది ప్రధాన పాత్ర. ఆ మండలి సమావేశాల్లో కవితాపఠనం, కథాపఠనం, విద్యార్థులు తాము రచించినవి చదవడం మొదలైనవి ఉండేవి. ఆ భజన మండలి, ఒక సమావేశంలో పీవీ ''జయచంద్రా ! హైందవ విధ్వంసకా!'' మకుటంతో రచించిన పద్యాలూ, వాటిని ఆయన చదివిన ఉద్విగ్నభరితమైన తీరూ అక్కడ వున్నవారినందరినీ ఉత్తేజితుల్ని

చేశాయి. పృథ్వీరాజు పై వ్యక్తిగతమైన అసూయాద్వేషాలతో దేశద్రోహానికి పాల్పడిన జయచంద్రుని అధిక్షేపిస్తూ రాసిన పద్యాలివి. ఆనాడు నిజాంకు తొత్తులుగా వుండిన కొందరు ప్రజాభీష్టానికి వ్యక్తిరేకంగా చేస్తున్న చర్యలను నిరసిస్తూ రాసిన పద్యాలివి. కానీ ఆ పద్యాలిప్పుడు లభించడం లేదు. అయితే, ఈ పద్యాలు మత్తేభ, శార్దూల విక్రీడితాలని, విషయ వ్యక్తీకరణకు, అభివ్యక్తికి అనుకూలమైన పద్యాలని, పద్య రచనలో చేయి తిరిగిన తీరు 'మకుటం' సూచిస్తున్నదని డా. కోవెల సంపత్కుమారాచార్య తమ వ్యాసం "పీవీ సాహిత్య వ్యక్తిత్వం" లో పేర్కొన్నారు.

పీవీ గారు కేవలం వృత్తాలను మాత్రమే కాక, ద్విపదలు, గీతాలు, గేయాలు కూడా విరివిగా ఆ రోజుల్లో రాసేవారని, ఆ రచనలు స్థూలంగా భావకవితాధోరణి అనిపించినా, సమకాలీన రాజకీయ, సామాజిక, సాంస్కృతికాంశాల స్పృహ, స్పర్శ వాటిలో దోబూచులాడుతూ ఉండేవని పాములపర్తి సదాశివరావు గారు పేర్కొన్నారు.

"నిర్మలాకాశం పై నుంచి ఒక 'చుక్క చాన' తనను ఆకర్షణతో మిలమిలా చూస్తున్న రమణీయ తరుణంలో – హఠాత్తుగా, అది చూచి ఘూక కాంత యొకర్తు గొల్లున నవ్వె" అనే అనుభవం ఒక గీతికలో పొందుపరచబడింది. అలాగే, బాల్య స్నేహితులను, వారితోడి ఆటాపాటలను, కేళీవిలాసాలను, వాటిలోని అమాయక అనుభూతి ఘడియలను తలచుకున్నప్పుడు – "కఠినునకునైనా నాగునే కంటినీరు" అంటూ మరొక గీతం రాశారు. యౌవనంలో ప్రేమ అనీ, ప్రణయం అనీ పీవీ ఆ రోజుల్లో ఎవరో ఒక ఊహాసుందరిని తలపోసి, శృంగారంపై చక్కటి రొమాంటిక్ వేదనతో కవితలు, ఖండకావ్యాలు రాశారు. ఇంగ్లీషులో కొన్ని భావగీతాలు, 'ఆర్త గీతాలు' అన్న పేరుతో ద్విపదలు రాశారు. ఈ రాతప్రతులు ఎవరో మిత్రుడు తీసుకుని వెళ్ళి తిరిగి ఇవ్వలేదట. ప్రబంధ శైలిలో వర్ణనలు, ఉపాలంభనలు కూడా పీవీ కొద్ది రోజులు రాసేవారు. 'గ్యాదర్డ్ పెటల్స్' అంటూ కొన్ని ఇంగ్లీష్ భావగీతికలు కూడా ఆయన రాశారు.

ఒక బాలవ్మాయ పోటీకి పీవీ, షేక్స్పియర్ నాటకాలు నాలుగింటికి సంగ్రహ కథారూపాలను రాసి పంపారు. అందులో రెండు విషాదాంతాలు, రెండు సుఖాంతాలు. అయితే ఆ ఎంట్రీల ఫలితం ఏమైందో తెలియదు. ఇదే ఫక్కీలో ఒకటి, రెండు హిందీ సినిమా కథలు కూడా రాసి పంపారు. కాలేజీల్లో చదివే రోజుల్లో కాలేజీ మ్యాగజైన్లకు అనేక రచనలు చేశారు.

తదనంతర కాలంలో రాజకీయాలలో తలమునకలవుతున్న సమయంలో పీవీ లోని కవితాత్మ నిద్రాణమైపోయిందనవచ్చు. అయితే అప్పుడప్పుడు తనలోని భావోద్రేకం మిక్కుటమైపోయినప్పుడు అది కవిత్వం రూపంలో పెల్లుబికిన సందర్భాలూ వున్నాయి.

పీవీ నరసింహారావు గారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు 1972లో దేశ స్వాతంత్ర్య రజతోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆ సంవత్సరం ఆగష్టు 15వ తేదీ ప్రవేశించిన అర్ధరాత్రి ఆయన ఆంధ్రప్రదేశ్ శాసనసభను సమావేశపరిచారు. ఈ సమావేశంలో తమ సందేశాన్ని కవితాగీతంగా ఈ విధంగా ఆలాపన చేశారు.

ఆ నిద్రాణ నిశీధిని మానిసి మేల్కాంచినాడు
ఒళ్ళు విరిచి కళ్ళు తెరిచి ఓహో అని లేచినాడు

కటిక చీకటుల చిమ్మెదు కారడవిని పయనించు
నిజ జఠరాగ్ని జ్వాలల నింగినంత లేపినాడు
అదుగో, హిమనగ మిచ్చిన అశ్రుతర్పణమ్మనగా,
కడుపుమంట సెగ ఆవిరి గంగానది చేసినాడు
యుగయుగాల అన్యాయం నగుమోముల దిగమ్రింగగ
సాంధ్యారుణ రౌద్రక్షితిజముఖుడై చెలంగినాడు
వాడొక విప్లవ తపస్వి, మోడుపడిన కాయముల
వాడిన నెమ్మనముల, సర్వం కోల్పోయిన దళగళముల
వాడి చెడిన చూపుల, బువ్వకు నోచని జనగణముల
వెతల బరువు మోసి మోసి విల్లుకు వంగిన నడుముల
జరాహటములై కృశించు జవ్వనంపు వల్లకాళ్ళ –
అన్నిటినీ కాయకల్పమా తపస్సు చేసినాడు,
నవరసార్ద్ర జీవితాల, నవోన్మేష మానసాలా
నవపల్లవ తరుశాఖల రవళించెడు పూజనాల
నవవిధ భక్తుల, రక్తుల, నవశక్తుల మేళవించి
నవనిర్మిత జాతి సంతరించినాడా విప్లవ తపస్వి,
పావు శతాబ్దము పొడుగున పాలకుల, అర్భకుల మధ్య
విభజన వికృతమైపోవగ, బావురుమనే జీవితాలు –
అటు సమృద్ధి, ఇటు దైన్యము, అటు పెంపు, ఇటు హైన్యము
ఒకడు మింటికెగయ, అసంఖ్యాకు లింకిరి భూతలమున,
అర్భకుని భుజాన మోయు అమ్మ, వాని పదద్రోయ
దారిచూపు కాగడాలు తలకొరివిగా పరిణమింప,
ధర్మకర్తలే ధనకర్తలుగా మారిపోయినారు.
పావు శతాబ్దము పొడవున – వెలుగు నీడలలాగాను
దాగిలి మూతలనుచు తలంచ
వెలుగు ముక్కు విదిచెను నీడల నలుపు తిరస్కరించి
తంత్రీనాదముల చెలిమి తరగదంచు భావింపగ
తీగల త్రెంచుచు నాదము తృణీకర మాలపించే
ఈ నిద్రాణ నిశీధిని
ఈ నీరవ వాయుతరంగిణిలో ఒరిపిడివడి
దొర్లిన భావస్ఫులింగములు వెలుగునిచ్చునా?
అటులని విశ్వసించునా పథికుడు?
మృగజలమును జలమని నమ్మి చనిన ఆ చిరపిపాసి
శీతోదక సేవనమున సేదతీరునా నేటికి?
మిన్ను మన్ను కలిసి చెలిమిచెన్నారెడు శివసుందర సీమ,
వచ్చెనంచు సంతసించవచ్చునా పాంథుడు?
భూమి దానవగ్రహమైపోవ రోదసిని మధించి
మానవతావాహనకై పూనుకున్న రాజ్యేందిర
జయదుంధుభి విని ఉత్తేజనము పొందునా పౌరులు?
మోదమలరని చెర అరలో మూల్గిన భావ కిశోరికి
విహరణ స్వేచ్ఛాంతరిక్షవీధిని లభ్యమ్మవునా?
అవునని, అవునౌనని, అవునౌనౌనని జనవాక్యము
తనువులు పులకెత్త ప్రతిధ్వనితమయ్యే మన కంఠము
శాశ్వతమై నిలచెడు ప్రశ్నాపరంపర ఇది –

పృచ్ఛకుడెవరో? ఇవ్వగజాలెదు నెవడో సమాధానము? నాకేల
విహంగమున కాకసంపు కొలతలేల?
చిన్ని అలకు ఒడ్డు దూరమున్నదన్న చింత ఏల?
దీపము పెనుగాలికి భీతిల్లనేల ?
జీవితాత్మకు ఎన్నడూ బ్రహ్మము
చేరుదునన్న సందియమ్మదేల ?
నేనొక చైతన్యోర్మిని
నిస్తుల ప్రగతి శకలమును
ఇది నా సంతత కర్మ
మరే హక్కులు లేవు నాకు
ఈ నిద్రాణ నిశీధి మహిత జాగృతి పుంజముగ
వెలుగుటయే నా తపస్సు
వెలిగించుట నా ప్రతిజ్ఞ!

అలాగే తన ప్రియ మిత్రుడు కాళోజి నారాయణరావు షష్టి పూర్తి సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పీవీ ఈ క్రింది గేయం రాశారు.

అరు పదులు నిండెనంట నారయ! నీ కాయమునకు –
ఆరా? పదియా? మనస్సునకనెడు సందియము తోచును!

సూక్తులు శాపములును పునరుక్తి దోషమంటకుండ
జగత్తు నభిశంసించుచు శతవత్సరములు దాటుము!

నోటి కస్సుబుస్సుకు కన్నీటి వింత జతగూర్చుచు
అంతరంగ నవనీతము ననారతము పంచియిమ్ము!

బ్రహ్మ నీకు పొరపాటున పాపుల వయసిచ్చుగాక!
కాలుడు మా కాళయ్యను కలకాలము మఱచుగాక!

పీవీ గారి ఒక ఖండకావ్యం "భర్త్సన" లో భగవంతుడిపై సవాలు విసురుతూ, విశ్వరచనలోని లోపాలను అసమగ్రతను ఎత్తి చూపుతూ "నాకు నీ నైజం, శక్తి, సామర్థ్యం, ఐశ్వర్యం, విభవం వంటి వ్యర్థ భాండారం పూర్తిగా తెలుసు. కనుక నీ యొక్క ఆ ఘనతలన్నీ నీ వరకే వుంచుకో. నాకేమీ అవసరం లేదు. నువ్వు నన్ను నా స్థానంలో వున్నవాణ్ణి ఉన్నట్లుగా ఉండనిస్తే అదే పదివేలు. నీ అవ్యాజ అనుగ్రహ అధీనత నుంచి నన్ను దూరంగా తప్పుకుని పోనిచ్చావా – నీకు వేయి నమస్కారాలు నన్ను నా దారిన పోనివ్వు. నీ దారిన నువ్వు పో" అన్నట్లు సాగుతుంది ఈ రచన.

### కథకుడుగా పీవీ

హైదరాబాద్ లో పీవీ, బూర్గుల రామకృష్ణారావు గారి వద్ద జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించేనాటికి భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. దేశమైతే స్వాతంత్ర్యమైంది కానీ, హైదరాబాద్ రాజ్యం రజాకార్ల దురంతాలతో అల్లకల్లోలమైపోయింది. ప్రభుత్వం అండ ఉండడంతో వారి హింసాకాండకు అడ్డూ అదుపూ లేకపోయింది. మతకలహాలు పెట్రేగడంతో హిందూ న్యాయవాదులు మొత్తంగా కోర్టులను బహిష్కరించి తమ వృత్తిని మానుకున్నారు. పీవీ కి తన వకాలత్ పై ఆశలుడిగి, హైదరాబాద్ నుంచి మకాం ఎత్తేశారు.

### బ్లూ సిల్క్ శారీ

ఆ రోజుల్లో పీవీ "బ్లూ సిల్క్ శారీ" (నీలం పట్టు చీర) అనే ఒక పెద్ద కథను ఆంగ్లంలో రాశారు. మతకలహాల్లో ముఖ్య పాత్రధారులు కేవలం గూండా శక్తులేనని వారికి కావలసింది మతం కాదని, తేరగా దొరికే ప్రజల ధన, మాన, ప్రాణాలేనని ఈ కథ వృత్తాంతం.

హైదరాబాద్ సంస్థానంలో పరిస్థితులు రోజురోజుకు దిగజారుతుండడంతో, పీవీ మద్రాసు వెళ్ళి అక్కడ కరపత్రాలు రాసి అన్ని ప్రాంతాలలోని ప్రముఖ వ్యక్తులకు, సంస్థలకు పేరుపేరునా పంపారు. కొందరు పత్రికాధిపతులను కలిసి, హైదరాబాద్ పరిస్థితిని వివరించి, వారి దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. కానీ దాని వల్ల ఆశించిన ఫలితం కనిపించలేదు. ఇందువల్ల ప్రయోజనం లేదని భావించిన పీవీ మద్రాసు నుంచి బయల్దేరి రహస్యంగా మహారాష్ట్రలోని చాందా చేరుకొని అక్కడి స్టేట్ కాంగ్రెస్ క్యాంపులో చేరిపోయి సాయుధ ప్రతిఘటన ఉద్యమంలో పాల్గొన్నారు. యువకులకు గెరిల్లా పోరాట పద్ధతుల్లో శిక్షణ ఇవ్వటం, రైఫిళ్ళు, బాంబులు, స్టెన్ గన్లు వంటి మారణాయుధాలను సమకూర్చడం మొదలైన బాధ్యతలను పీవీ ఇక్కడ నిర్వర్తించారు.

### గొల్ల రామవ్వ

ఈ నేపథ్యంలో పీవీ గారు "గొల్ల రామవ్వ" అనే విప్లవ కథను రాశారు. అందులో తెలంగాణాలో ఒక గ్రామంలో కాంగ్రెస్ గెరిల్లా వీరుడి జాడను పసిగట్టి, పోలీసులు అతని వెన్నాడుతారు. అతడు ప్రాణభయంతో పరిగెత్తి అర్ధరాత్రి వేళ ఒక గుడిసెలో దూరుతాడు. ఆ ఇల్లు గొల్లరామవ్వ అనే అమాయక వృద్ధురాలిది. ఆమెకు పరిస్థితి అర్థం కావడానికి ఎంతో సమయం పట్టలేదు. అతని దేహం గాయాలతో నిండి వుంది. పోలీసులు అతనిని తరుముతున్నారని ఆమెకు అర్థమైంది. అతనిని ఎవరని ప్రశ్నించగా నేను విప్లవ యోధుడిని మేము పోలీసులను ఎదిరించి, మీకోసం పోరాడుతున్నామని చెప్పాడు. అతను తన గుడిసెలో ఉంటే తన ప్రాణాలకే ముప్పని ఆమె తెలుసుకుంది. అయితే ఆమెలోని త్యాగశీలత మేల్కొని, ఇతను మనకోసం ప్రాణాలకు తెగించాడు – ఇతనికి సాయం చేస్తే పోయేది నా ముసలి ప్రాణమే కదా అని నిర్ధారణకు వచ్చి, తన ప్రాణాలకు తెగించి, ఆ వీరుడికి తన గుడిసెలో రక్షణనివ్వడం ఈ కథ వృత్తాంతం. ఒక పక్క పోలీసుల భయం. మరొక వంక తమందరి కోసం చావుకు వెరవక పోరాడుతున్న యువకునికి రక్షణనివ్వాలన్న తాపత్రయంతో ఆ ముసలి ప్రాణం కొట్టుమిట్టాడింది.

ఈ రెండు ద్వంద భావాల సంఘర్షణ ఈ కథలో నాటకీయంగా చిత్రితమైంది. ఆకలితో నకనకలాడుతున్న ఆ గెరిల్లా యోధుడికి తనకున్నదేదో పెట్టి ఆకలి తీర్చడమే కాక, యుక్తవయస్కురాలైన తన మనవరాలి పక్కలో పడుకోపెట్టి, నిజాం పోలీసులు వచ్చినప్పుడు అతను తన మనవరాలి పెనిమిటి అని చెప్పి, వారిని నమ్మించి ఆ యువకుడిని కాపాడి తన ఔదార్యం చాటుకుంది.

ఈ కథ 'కాకతీయ' పత్రికలో 15 ఆగష్టు 1949 సంచికలో "విజయ" అనే మారుపేరుతో పీవీ రాశారు. ఉత్తర తెలంగాణ మాండలికంలో ఆసక్తికరంగా సాగే కథ ఇది. 1955 లో "విస్మృత కథా సంకలనం" ప్రచురించే సందర్భంలో కథా రచయిత శ్రీపతి

చౌరవ, పరిశోధనతో ఇది బయటపడింది. పీవీ మరణానంతరం 2 జనవరి 2005 నాటి 'వార్త' దినపత్రిక ఆదివారం ప్రత్యేక సంచికలో ఈ కథ పునర్ముద్రితమైంది.

ఆ రోజుల్లో పీవీ గారు "జయ", "విజయ", "రాజహంస", "భట్టాచార్య", "రాజా", "విజయం" ఇత్యాది మారు పేర్లతో ఈ రకమైన కథలు, వ్యాసాలు ఎన్నో రాసి, తాము వరంగల్ నుంచి నిర్వహిస్తున్న కాకతీయ పత్రికలోనూ, ఇతర పత్రికల్లోనూ ప్రచురించారు. ఆ తరువాత పుట్టిన తన కుమార్తెలకు "జయ, విజయ" అనే పేర్లనే పెట్టుకున్నారు.

### మంగయ్య అదృష్టం

పీవీ రాసిన మరొక పెద్ద కథ 'మంగయ్య అదృష్టం'. ఇది 1999 నవంబర్ 8 నాటి ఆంధ్రప్రభ వార పత్రికలో ప్రచురితమైంది. దీనిని ఆ పత్రికవారు నవలిక అని పేర్కొన్నారు. ఏమాత్రం విద్యాబుద్ధులు లేని ఒక నీచుడిని కూడా అదృష్టం వుంటే, ఎన్ని అవరోధాలెదురైనా, రాజకీయ పదవులు ఏ విధంగా వరిస్తాయో తెలిపే వ్యంగ్య రచన ఇది. ఆద్యంతమూ ఒకే అంశంలో సాగిన ఈ రచన ఒక ఆహ్లాదకరమైన 'పొలిటికల్ సెటైర్'. దేవతల మధ్య చెలరేగిన ఒక అంతః కలహం తారాస్థాయికి చేరి తమతమ శక్తులను పరీక్షించుకోడానికి మంగయ్య అనే ఒక అనామక నిరక్షరకుక్షిని ఎంచుకున్న అపూర్వ ఘట్టం దీని ఇతివృత్తం. పీవీ గారు ఎంత సమర్థంగా అధిక్షేపాన్ని రచనలో నిర్వహించగలరన్నదానికి ఇదొక ఉదాహరణ.

### సారోస్ ఆఫ్ ఎ మినిస్టర్ (ఒక మంత్రి గారి బాధలు)

1968 జనవరిలో హైదరాబాద్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్లీనరీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రత్యేక సంచిక ప్రచురణ బాధ్యత పీవీ నరసింహారావు గారికి అప్పగించబడింది. సావనీర్ కమిటీ చైర్మన్ పీవీ గారే. 07.01.1968 న విడుదలైన ఈ సావనీర్‌లో పీవీ గారు ఆంగ్లంలో "సారోస్ ఆఫ్ ఎ మినిస్టర్" (ఒక మంత్రి గారి బాధలు) పేరుతో ఒక కథను రాశారు. ఎన్నికల సమయంలో తమ వారితో ఓట్లు వేయించి, గెలిపించిన ముఠా నాయకులు, ఆ నేత గెలిచి మంత్రి అయిన తరువాత తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోడానికి నిబంధనలను తుంగలో తొక్కి ఎంత అడ్డగోలుగా పనిచేయమని ఆయనను వేధిస్తారో వివరించే వ్యంగ్య చిత్రీకరణ ఈ కథ. ఇది పీవీ గారి స్వానుభవం గానే భావించవచ్చు.

### ది ఇన్సైడర్ (లోపలి మనిషి)

పీవీ గారి సృజనాత్మక రచనా వైదుష్యానికి పరాకాష్ట ఆయన ఆంగ్లంలో రాసిన బృహన్నవల "ది ఇన్సైడర్". దీనిని రచించడం తాను ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ప్రారంభించి, ప్రధానమంత్రిగా తన పదవీకాలం పూర్తయిన తరువాత తీరిక సమయంలో వేగం పెంచి, తుదిమెరుగులు దిద్ది పూర్తిచేశారు. దీనిని తెలుగులోకి కల్లూరి భాస్కరం గారు "లోపలి మనిషి" పేరుతో అనువదించారు.

అధిక్షేపం, అపహాస్యం, ఎత్తిపొడుపు, ఉపాలంభనం, అన్యాపదేశం నిర్వహించడంలో ఆయన ఎంత సమర్థులో ఈ రచన నిరూపిస్తుంది. ఈ గ్రంథం తన ఆత్మకథ కాదని, "భారతదేశపు డైరీ" అని స్వయంగా పీవీ గారే పేర్కొన్నారు. ఆయన అంతర్మథనం ఈ నవల ద్వారా బాగా వ్యక్తమైంది. ఆత్మసంవేదనా పూరితుడైన ఒక వ్యక్తి బాహిరంగా, పరిస్థితుల వత్తిడితో కొంత రాజీపడినా, ఆ వ్యక్తి అంతరంగ వేదనలు వేరుగా వుంటాయని చెప్పడం ఈ రచన ఉద్దేశ్యమని భావించవచ్చు.

"ఈ రచన ఆత్మకథ కాదు. కాల్పనిక రచనవలె రచయిత స్వచ్ఛంద ఊహలను అనుసరించేదీ కాదు. ఇది కల్పనాయదార్థాల సమ్మిశ్రణ సమన్వయాలతో రూపొందింది. భాగస్వామి, సాక్షి, కథాకారుడు, విమర్శకుడు – ఈ నాలుగు పాత్రలను ఒకే సమయంలో పోషించే ప్రయత్నం చేస్తున్నాడు రచయిత. ఈ విశిష్ట నేపథ్యంలో ఇదా, అదా అనే మీమాంస రచనను పుట్టుకతోనే వెన్నాడుతూవుంది. దేశ స్వాతంత్ర్యోద్యమంలో తుది ఘట్టం నుంచి నేటి వరకు లోపలి మనిషిగా రాజకీయ, సాంఘిక వికాసక్రమాన్ని సాధ్యమైనంత వ్యక్తి నిరపేక్షంగా పరిశీలించిన వాడిని కనుక ఈ రచనా సౌధం గట్టి నేలపై నిలుచుని వుందనగలను. రాబోయే కాలంలో ఆఘాత విస్మయాలు కలిగించే అనేక సమస్యలను దేశం, ప్రపంచం ఎదుర్కోబోతున్నాయి. అందుకని ఈ రచనా వస్తువు అనంతంగా ఉంటుంది. అనంతమైన నూతన రచనల సృష్టికి అవకాశాలు కల్పిస్తుంది. ఇది నిస్సందేహం. ఈ ఒరవడిలో ప్రారంభ ప్రయత్నాలలో ఆవిర్భవించినందుకు లోపలి మనిషి తన భాగ్యానికి సంతోషిస్తున్నాడు" అని పీవీ గారు "లోపలి మనిషి" మున్నుడిలో స్వయంగా పేర్కొన్నారు.

వ్యక్తులలో గుణదోషాలను సమానంగా, నిష్పాక్షికంగా ప్రదర్శించడానికి పీవీ ఇందులో ప్రాధాన్యమిచ్చారు. రచనా శైలి ప్రవాహంలాగా సాగుతుంది. ఎక్కడా ఎలాంటి తడబాటు కానీ అవాంతరాలు కానీ వుండవు. చెప్పదలచుకున్న విషయాన్ని సుస్పష్టంగా అలతి పదాలలో ఆయన చెప్పారు.

ఇందులో కథానాయకుడు ఆనంద్ – పీవీ ఒక్కరే అంటారు. తెలియని అవాస్తవాలను కల్పించి చెప్పడం కన్నా, తెలిసిన విషయాలను, తన అనుభవాలను ఈ పాత్ర ద్వారా చెప్పారు పీవీ. అయితే ఆనంద్ పాత్ర – నరసింహారావు గారి ప్రతిరూపం కాదు. ఆనంద్ పాత్రను కొంత వాస్తవం, కొంత కల్పనతో ఆయన మెరుగులు దిద్దారు.

### అయోధ్య

1992 డిసెంబర్ 6న అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రధానమంత్రిగా పీవీనే బాధ్యుడని ఆయనపై పెద్ద నిందే పడింది. ఈ సంఘటన పై ఆయనను నిందించిన వారిలో కాంగ్రెస్ పార్టీ లోని తన సహచరులే ముందు వరుసలో నిలిచారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్వాపరాలను దేశానికి తెలియజేయటానికి, తనపై నిష్కారణంగా వచ్చిన ఈ నిందను బాపుకోవడానికి పీవీ గారు "అయోధ్య" పేరుతో నివేదికలాంటి ఒక గ్రంథం రాశారు.

(తరువాయి వచ్చే సంచికలో...)

**తెలుగును బోధించడమే కాదు; తెలుగులోనే అన్నీ బోధించాలి**

–వాచస్పతి

# పదనిష్పాదనకళ 3

(గత సంచిక తరువాయి...)

*The joy of coining new words!*

**వ్యావహారికానికి వ్యాకరణం లేదా ?**

కొన్నికొన్ని అభిప్రాయాలు ఎందుకు, ఏ విధంగా ప్రచారంలోకొస్తాయో అర్థం కాదు. అలాంటివాటిల్లో ఒకటి – వ్యావహారికమంటే వ్యాకరణంతో పనిలేని భాష అనీ, లేదా వ్యావహారికంలో వ్యాకరణ నియమాల్ని పాటించనక్కరలేదనీ, వ్యావహారికమంటే ఎవఱిష్టమొచ్చినట్లుగా వారు చెలరేగిపోతూ భాషాపరమైన అరాచకాన్ని ఆస్వాదించడమేనని భావించడం. మానవ నాగరికతలోనూ, మానవ కార్యకలాపాల పరిధిలోనూ నియమాలు లేని రంగం ఒకటి కూడా దర్శనీయం కాదు. మనుషుల్ని బ్రతికించడానికీ, చంపడానిక్కూడా కొన్ని నియమాలున్నప్పుడు మేధాజీవి అయిన మనిషి సాలోచనగా మాట్లాడే భాషకి నియమాలు లేవనుకోవడం వివేకవంతం అనిపించుకోదు. కాబట్టి వ్యావహారికాని క్కూడా తన నియమాలు తనకున్నాయి. మనకు తెలియకుండానే వాటిని అనుసరించి సంభాషిస్తాం. మన సస్పృహ సావధానంలోకి రానంత మాత్రాన అవి లేవనుకోకూడదు. ప్రపంచంలో మనకు సంబంధించిన ప్రతీదీ మనకు తెలిసి జరగదు. మన హృదయ స్పందన, జీర్ణ క్రియల్లాగానే! వ్యావహారిక నియమాలు గ్రాంథిక భాషానియమాల్ని అచ్చుమచ్చుగా అనుసరించేవి కాకపోవచ్చు. కానీ అవీ నియమాలే. ఎవడైనా వాటిని పాటించి తీరాలి. అది తమకోసం, తమ యొక్క, ఇతరుల యొక్క సమీచీన అవబోధ కోసం! మనం బళ్ళలో నేర్చుకునే ఇంగ్లీషు నిజానికి ఆ దేశస్థుల అనునిత్య వ్యావహారికమే. మఱి దానికో వ్యాకరణం ఉందని నేర్చుకుంటున్నాం గదా! వ్యావహారిక తెలుగైనా అంతే !

నియమాలన్నీ మార్పుకూ, ప్రగతికీ అవరోధాలనీ, వాటిని సమర్థించేవారూ, బోధించేవారూ మార్పుకూ, ప్రగతికీ శత్రువులనీ భావించే ధోరణి సరికాదు. మనం కోరుకునే మార్పులూ, పురోగతులూ అమల్లోకొచ్చిన తరువాత వాటిక్కూడా నియమాలేర్పడ తాయి. నియమాల్ని అనుసరించడం ద్వారా మనం ఏం చేస్తున్నాం? మానవచింతనలోని స్వభావసిద్ధమైన క్రమశిక్షణని గౌరవిస్తున్నాం. ఆ భాష మాట్లాడే ప్రజానీకాన్ని, వారి పూర్వీకుల్నీ, వారి మేధా వారసత్వాన్ని గౌరవిస్తున్నాం. ఆ భాషలో కాలపరీక్షకు తట్టుకుని నిలబడగల హేతుబద్ధ సంప్రదాయాల్ని బ్రతికిస్తున్నాం.

**ప్రామాణికత వేఱు – సౌలభ్యం వేఱు**

(Standards and Convenience)

"వాడుకభాష అంటే సామాన్యప్రజలు వాడేదేననీ, అందులో వినపడే ప్రతి వాడుకా, పదమూ ప్రామాణికమే" ననే వాదన. దీనితో ఏకీభవించడం కష్టం. ఎందుకంటే ప్రామాణికత అంటే అందఱికీ అనుసరణీయమైనది. అది వ్యక్తిగతం కాదు. కానీ సామాన్యప్రజల వాడుక వ్యక్తిగతం.

ఈ పై వాదన కేవలం ప్రామాణికం. మనుషులు సాహిత్యం నుంచీ, ప్రామాణికులైన మేధావుల నుంచి నేర్చుకోవాల్సిన అవసరాన్నీ, అలా బౌద్ధికంగా ఎదగాల్సిన అవసరాన్నీ ఇది రద్దు చేయబూనుకుంటోంది. ఇది ఎక్కడున్నవారు అక్కడే ఉండాలని ఆశిస్తోంది. ప్రామాణికాలంటూ ఏమీ లేవని, ఉండవని, ఉండకూడదనీ చెప్పడం దీని అంతరార్థంలా తోస్తోంది.

వాడుకలో ఉన్న ప్రతీదీ ప్రామాణికం కాదు. అదే నిజమైతే ఏ భాషాప్రజలకీ తమ భాషావ్యాకరణం అవసరం లేదు. అలాగే వారికి నిఘంటువులు కూడా అవసరం లేదు. ప్రామాణికం అనేదానికున్న అర్థం బహులోతైనది. ఒక పదానికి లేదా వాడుకకి ప్రామాణికత ఎలా సిద్ధిస్తుందో అర్థం చేసుకుంటే ఆ ప్రక్రియ ముందు వాడుక అనేది ఎంత చిన్న విషయమో మనకి అర్థమవుతుంది. పై అభిప్రాయాన్ని ప్రామాణికంగా తీసుకుంటే ప్రతివారూ తన ఇష్టమొచ్చినట్లు వ్రాస్తూ, పలుకుతూ అలాంటి తప్పుల తడిక భాషని తన అధికారబలాన్ని, మందబలాన్నీ, మందిబలాన్ని ఉపయోగించి తన అజ్ఞానాన్ని వాడుకభాష పేర ఇతరుల నెత్తిన రుద్దుతూ చెలరేగిపోతారు. (ఇప్పుడు జఱుగుతున్నది అదేననుకోండి) ఆ తరువాత కొద్ది వందల సంవత్సరాల అనంతరం ఆ భాషా ప్రజలు వెనక్కి తిరిగి తమ భాష వైపు చూసుకున్నప్పుడు వారసత్వం స్థానంలో ఒక అస్తవ్యస్తపు సాంస్కృతిక అరాచకం గోచరిస్తుంది.

పదస్వరూపాలకి ప్రామాణికత సరైన వ్యుత్పత్తుల (etymologies) ద్వారాను, శబ్దార్థాల యొక్క సమ్యక్ సమన్వయం ద్వారాను సిద్ధిస్తుంది. ఒకే పదానికి అనేక వ్యుత్పన్నాలు(derivatives) ఉన్నప్పుడు వాటిల్లో ఒకదాన్ని మటుకు బొత్తిగా మిగతా వాటితో సంబంధం లేని అర్థంలో వాడుతూంటే, అలా ఎంతమంది వాడినా సరే, అది ప్రామాణికం కాదు. అది సరిచెయ్యదగ్గ పొఱపాటు మాత్రమే. అలాగే పదం యొక్క అసలు వ్యుత్పత్తినే నిర్మూలించే విధంగా కొంతమంది పలుకుతున్నారనే కారణం చేత ఆ దోషభూయిష్ఠ ఉచ్చారణ ప్రామాణికం కాదు. అది సరి చెయ్యదగ్గ పొలపాటు మాత్రమే. అలా అసాధురూపాలు (incorrect forms) ప్రామాణికం అవాలంటే ఆ భాషకున్న వేలాది సంవత్సరాల చారిత్రిక నేపథ్యం చాలావఱకు (మళ్ళీ లభ్యం కావడానికి వీల్లేని విధంగా) నశించాల్సి ఉంటుంది.

పదస్వరూపాలకి ప్రామాణికత ప్రామాణిక వ్యక్తుల వాడుక ద్వారా, వారు రచించిన ప్రామాణిక గ్రంథాల ద్వారా వ్యాపిస్తుంది. ఒక్కొక్క జీవనరంగంలోను ఒక్కొక్క విధమైన ప్రామాణికులు ఉంటారు. రాజకీయాల్లో ప్రామాణికుడైన వాడు కళల్లో ప్రామాణికుడు కాడు. కళల్లో ప్రామాణికుడైనవాడు వ్యాపార రంగంలో కాడు. అలాగే భాషాసాహిత్యాలలో ప్రామాణికులైన వ్యక్తులే పదస్వరూపాలకి ప్రామాణికులు. వారు తమ సొంతగొంతుగా, సొంత అభిప్రాయంగా, సొంత కల్పనగా వినిపించినవాటిల్లో ఏయే వాడుకలు చేశారో అవే ప్రామాణికం. అంతేగానీ దారిన పోయే ప్రతి దానయ్యా చేసే వాడుకలు ప్రామాణికం కావు, వారు ఎంతమందున్నా సరే ! భాషాసాహిత్య విషయాల్లో వారు ప్రామాణికుల్ని అనుసరించాల్సినవారే తప్ప,

అనుసరణీయ-వ్యక్తులు ఎంతమాత్రమూ కారు.

వాడుక ఒక సౌలభ్యం. అంతేతప్ప దానికి ప్రామాణికత లేదు. రెండింటినీ కలిపికొట్టడం, రెండింటికీ అభేదం పాటించడం మాస్ రాజకీయమో, వర్గ రాజకీయమో అవుతుంది తప్ప విద్యాపర చర్చ (academic discourse) అనిపించుకోదు. ఒకఁు సోషలైజేషన్ అని పలకలేక సోసలైజేసన్ అంటారు. అది అతని సౌలభ్యం. నాకు తెలిసిన ఒకాయన తొంబై కి టొంబై అనేవాడు. అది ఆయన సౌలభ్యం. అంతేతప్ప అది ప్రామాణికం కాదు.

ఇది ప్రజాస్వామ్యమైనంత మాత్రాన జనం సర్వజ్ఞులు కారు. జనానికి "ఇది తప్పు, ఇది ఒప్పు" అని చెప్పే హక్కూ, బాధ్యతా విషయపరిజ్ఞానులైన మేధావులకి, ప్రామాణికులకీ తప్పనిసరిగా ఉన్నాయి. అంతేతప్ప వారు తమకంటే తక్కువ తెలిసినవారిని అనుసరించనక్కఁలేదు. ఎందుకంటే విద్యావంత మేధావులు సాంస్కృతిక నాయకులు. సామాన్య ప్రజల తప్పుల్ని సరిదిద్దకపోతే వారు విద్యావ్యవస్థ నుంచి పొందాల్సిన ప్రయోజనాన్ని పొందలేక పోతారు. నమూనా పాత్రలూ (role models), ప్రామాణికాలూ, మార్గదర్శకాలూ లోపించడం చేత వారిలో సృజనాత్మకత కూడా ఎదగాల్సినట్లుగా ఎదగదు.

**అర్థం కానిది ఎవఁతికి ?**

శాస్త్రసాంకేతిక సాహిత్యాన్ని తెలుగువారికి తెలుగులో అందించాలని చెప్పినప్పుడు, "తెలుగులో అందుకు తగ్గ సాంకేతిక పదజాలమేది ?" అని ప్రశ్నిస్తారు. "ఇదిగో, ఈ పదాలు మేము సిద్ధం చేశాం" అని చూపించినప్పుడు "ఇవి మా కర్థం కావట్లేదు. ఇవి సద్యఃస్ఫోరకంగా లేవు. ఇప్పటిదాకా ఇంగ్లీషులో మేము అలవాటుపడ్డ పదజాలం వేఁఱు. వీటిని వింటూంటే మాకు ఆ శాస్త్రం స్ఫురించడం లేదు. (అంటే, మాకు స్ఫురించదు కాబట్టి బహుశా దేశంలో ఎవఁతికీ స్ఫురించకపోవచ్చు)" అంటూ ఒక బిక్కమొహాన్ని అభినయిస్తారు. "వీటిని ఈ ఈ అర్థాలలో ఈ క్రమంలో ఈ ఈ సూత్రాల ప్రకారం రూపొందించాం" అని విడమఱ్చినప్పుడు "మీరు రూపొందించారు సరే! వీటిని వాడేదెవఁరు ?" అని మళ్లీ ప్రశ్నిస్తారు. "ఇదుగో, ఈ ఈ రచయితలు ఇప్పటికే వాడడం మొదలుపెట్టారు. వీటిని ఇంకా ఇంకా ప్రచురపఱచడానికి త్వరలో అధికారుల సహాయం కూడా తీసుకుంటాం" అని చెబుతాం. అంతే! ఆ మాటతో తెలుగువిరోధుల కోపం నషాళానికి అంటు తుంది. చేసేదేమీ లేక అమాంతం అపహాస్యాలకి దిగుతారు.

ఇలాంటివారిని నమ్ముకుంటే పెళ్ళి కుదరదు. పిచ్చీ కుదరదు. "తెలుగుపదాల్ని వాడడానికి ఆటంకంగా ఉన్నవి మానవ కల్పితమైన, లేదా స్వయంకల్పితమైన మానసిక అవరోధాలే తప్ప నిజంగా తెలుగులో పదాల కొఱత లేదు" అని ఇందు మూలంగా మనకి అవగతమవుతుంది. శాస్త్రసాంకేతిక రంగాలలో తెలుగు పదాలు లేకపోవడానికీ, ఉన్నా వాడకపోవడానికీ కారణం - తెలుగంటే ఉన్న చిన్నచూపూ, ఆంగ్లమంటే ఉన్న వెఱ్ఱివ్యామోహం - ఇవే యథార్థమైన కారణాలు. తమ వ్యక్తిగత ఇష్టానిష్టాలకు ఆచరణాత్మకత ముసుగు వేస్తున్నారనేది సుస్పష్టం.

ఆంగ్ల మాధ్యమాన్ని శతాబ్దాల పాటు జనం మీద రుద్దడం ద్వారా కోట్లాదిమందికి చదువు రాకుండా చేసిన దేశం మనది. ఇక్కడ ఎవఁరూ మాట్లాడని, ఎవఁతికీ మాతృభాష కాని ఇంగ్లీషుకి కృత్రిమంగా ఒక సామాజిక విలువని సృష్టించారు.

ఇక్కడ ఈరోజున ఆఖరికి ''ఇంగ్లీషే అర్థమవుతుంది, తెలుగుకా''దనే విడ్డూరపు వాదన ఊపందుకోవడం విచారకరం. మన ప్రజలు అక్షరాస్యులు కాని రోజుల్లో వారికి ఫలానా పదాలు అర్థం కావంటే అందుకొక మంచి కారణం ఉంది.

కానీ జనాలంతా అక్షరాస్యులయ్యే సమయానికల్లా తెలుగు మాధ్యమాన్ని బళ్ళలోంచి బహిష్కరించారు. అందుమూలాన, విదేశాల జనానికి మాతృభాష మీద ఉన్న పట్టు మన జనానికి లేకుండా పోయింది, ఎంత చదువుకున్నా! అదే, మన ప్రజ లందఱినీ తెలుగులోనే విద్యావంతుల్ని చేసి ఉంటే, విద్యారంగంలో తెలుగు మీడియం ప్రాముఖ్యం కొనసాగి ఉంటే అప్పుడు మాతృభాషలో మనవారి పదజాల పరిజ్ఞానం ఇంగ్లీషువారిని మించిపోయి ఉండేది. తమ మాతృభాషాపదాలే తమకర్థం కాకుండాపోయి, వాటికి ఆంగ్లానువాదాన్ని ఇవ్వమని కోరుతున్న విచిత్రజనాభా పుట్టుకొచ్చేది కాదు. రంగులూ, అంకెలూ, జంతువులూ, పిలుపులతో సహా అన్ని పదాల్నీ ఇంగ్లీష్ నుంచి అరువుదెచ్చుకుంటూ ఒక నాసిరకం తెలుగు మాట్లాడే పదదారిద్ర్యపు తరం ఉద్భవించేది కాదు. ఈ రకంగా, ఒకపక్కన దేశమంతా వేలాది విద్యాలయాలతో దేదీప్యమానమై వెలిగిపోతూండగా, మఱోపక్కన విరోధాలంకారంలా మన మాతృభాషానిరక్షరాస్యత మాత్రం యథా పూర్వంగా కొనసాగుతోంది.

మనం ఇప్పుడు వ్రాస్తున్న తెలుగు చాలావఱకు మన ప్రాచీనులకి (ఈ అర్థాల్లో) తెలీదు. నిజానికి ఇదొక కొత్త తెలుగు. ఆంగ్లంతో పోటీపడే ప్రక్రియలో భాగంగా, గత వందా-ఇఱవయ్యేళ్ళుగా మనం ఈ తెలుగుకి కొత్తపదాలు కల్పించుకుంటూ వాటిని వ్యావహారికంలోకి జతచేర్చుకుంటూ ఈ స్థాయికి అభివృద్ధి చేశాం. ఆ కృషినే ఇప్పుడు కూడా కొనసాగించడానికి అభ్యంతరమేముంటుంది? ఇంగ్లీషు పదాలు చాలుననీ, వాటికి తెలుగు సమానార్థకాల్ని సృష్టించే పనిలేదనీ మన ముందుతరాల తెలుగువాళ్ళు అనుకుని ఉంటే ఈపాటికి తెలుగుభాష యావత్తూ మరణించి ఉండేది. ఎందుకంటే ఆంగ్ల పదాల్ని అనువదించకుండా అలాగే వాడితే భాషలో ఏ వాక్యంలోనూ తెలుగు ఉండదు. అలాంటి తెలుగు మాట్లాడ్డం కన్నా ఇంగ్లీషు మాట్లాడ్డమే సులభంగా ఉంటుంది. అందుచేత జనం తెలుగుని పూర్తిగా వదిలేస్తారు. స్వకీయత (originality) లేని భాష ఎవఁతికీ అవసరం లేదు. కొత్త పదాల్ని సృష్టించలేని స్తబ్ధావస్థకి చేఱుకున్న భాషలు వాడుకలోని పదజాలాన్ని సైతం కోల్పోతాయి. ఎదుగుదలే జీవితం (Growth is life). ఆ ఎదుగుదల ఎప్పుడైతే ఆగిపోతుందో అప్పుడే అంతిమక్షణాలు ఆసన్నమవుతాయి.

చనిపోయిన మనిషినైనా బ్రతికించగలమేమో గానీ, వ్యవహారదూరమైన భాషల్నీ, వాటిల్లోని పదాల్నీ ఎట్టిపరిస్థితుల్లోనూ పునరుజ్జీవింపజేయలేమనీ, అవి శాశ్వతంగా పోయినట్లేననే కఠోర వాస్తవాన్ని తెలుగువారు గుర్తించే రోజు శీఘ్రమే రావాలి. సమకాలీనంగా సాంకేతిక విద్యలో తెలుగుకు స్థానం లేదు. మన ఎంజినీరింగ్ కళాశాలల్లో పాఠాలన్నీ ఇంగ్లీషు లోనే జఱుగుతాయి. కనుక ఆ సాంకేతిక పదాలకు తెలుగు సమార్థకాల్ని సృజించాల్సిన

**తరువాయి 42వ పుటలో.......**

నవల

డి.పి. అనూరాధ
90100 16555




*జరిగిన కథ*

***తెలుగుజాతి ఆనవాళ్ల గురించి అన్వేషిస్తూ మయన్మార్, థాయిలాండ్, కాంబోడియా, వియత్నాం, ఇండోనేషియా దేశాలను సందర్శిస్తాడు సూర్యవర్మ. అయితే అదంతా కలఅని తరవాత తెలుస్తుంది. కానీ కలలో తను విహరించిన ప్రదేశాలతో తెలుగు నేలకు స్పష్టమైన సంబంధాలు ఉండడం ఆశ్చర్యపరుస్తుంది. తన కలల రాకుమారిని అన్వేషిస్తూ సూర్యవర్మ శ్రీలంక చేరుకుంటాడు. అక్కడ అతడి ప్రయాణం ఏ మలుపు తిరిగింది?***

**క్యాండీ ఆలయాన్ని రెండు అంతస్థులుగా నిర్మించారు. సందర్శకులని ద్వారం దగ్గర మెటల్ డిటెక్టర్లతో పరీక్షించారు. ఎక్కడ చూసినా కట్టుదిట్టమైన బందోబస్తు ... రెండుసార్లు ఎల్టీటీయీ బాంబు దాడులకు గురైందట ఈ ఆలయం. అయినా తిరిగి పునరుద్ధరించారు.**

అటూ ఇటూ గోడలపై రంగు రంగుల పెయింటింగులు ఉన్న మార్గంలోంచి ఆలయంలోపలికి ప్రవేశించాం. లోపలంతా వేరే ప్రపంచంలా ఉంది. ప్రధాన ఆలయంలో బంగారు బుద్ధ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్నారు. పక్కనే పెద్ద గంట. ఆ ఆలయం చుట్టూ కొందరు ప్రదక్షిణలు చేస్తున్నారు. తెల్ల లుంగీ, తెల్ల షర్టు వేసుకున్న ఓ వృద్ధుడు అడుగులో అడుగు వేస్తూ ప్రదక్షిణ చేస్తున్నాడు. ఆ మాటకొస్తే చాలా మంది స్త్రీపురుషులు తెల్ల దుస్తులే ధరించారు. వాళ్లను చూడగానే ప్రవల్లిక గుర్తొచ్చింది. ఆమె కోసమే ఇంత దూరం వచ్చిన సంగతీ గుర్తొచ్చింది. కానీ నేను ఆ విషయమే మరచిపోయాను. నలువైపులా ఆమె కోసం వెతకడం ప్రారంభించా.

'సూర్యా, రా మనం మేడ మీదకు వెళ్లాలి'

అనురా మాటలకు నా ప్రయత్నాన్ని పక్కకు పెట్టి ముందుకు వెళ్లా. పై అంతస్తుకు వెళ్లడానికి పాతికలోపు మెట్లున్నాయి. అందరూ ఓ పద్ధతిలో వెళుతున్నారు. ఓ పది మెట్లు ఎక్కగానే గోడ మీద పొడవైన పెయింటింగ్ ఆకట్టుకుంది.. ఓ పడుచు జంట పెయింటింగ్ అది. బహుషా రాజకుటుంబీకులై ఉంటారు. అనురా కూడా అదే పెయింటింగ్ ను చూపిస్తూ,

'ఈమె పేరు హేమమాలి, కళింగ రాజు గుహసివ కుమార్తె, ఇతడు ఆమె భర్త దంతకుమారుడు. వీళ్ల గురించి తెలుసుకునే ముందు దంతపురం అనే గ్రామం గురించి తెలుసుకోవాలి. దానికి మనం బుద్ధుడి కాలానికి వెళ్లాలి. బుద్ధుడి నిర్యాణం తరవాత ఆయన ఎడమ కోర దంతాన్ని ఖీమథెరా అనే భిక్షువు సేకరించి, దాన్ని కళింగ రాజు బ్రహ్మదత్తుడికి బహుమతిగా అందజేశాడని బౌద్ధ గ్రంథాలు తెలియజేస్తున్నాయి. ఆ బుద్ధుడి దంతానికి గౌరవంగా రాజు స్థూపాన్ని నిర్మించాడని అదే క్రమంగా దంతపురిగా మారిందని చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఆ దంతం కోసం రాజుల మధ్య నిరంతరం యుద్ధాలు జరిగేవి. అది ఎక్కడ ఉంటే అక్కడ రాజ్యం సుభిక్షంగా ఉండడమే కాదు ఆ రాజుకు ఆధిపత్యం ఉండేది. దంతాన్ని రక్షించేందుకు గుహసివుడు ఓ పథకం ఆలోచించాడు. తన కూతురు, అల్లుడిని దానికి పాత్రధారులుగా చేశాడు. హేమమాలి తండ్రి ఆదేశంమేరకు దంతాన్ని తన కొప్పులో దాచుకుని అతి సామాన్యుల్లా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని శత్రువుల బారిన పడకుండా నౌకలో శ్రీలంకకు చేరుకుంది. ఇక్కడి అనురాధపురాలోని ఆరామంలో బుద్ధదంతాన్ని అందజేసింది. క్రీస్తుశకం మూడో శతాబ్దిలో ఇదంతా జరిగింది. శ్రీలంకకు చెందిన పాలిగ్రంథం దలద వంశం ఈ కథనంతా వివరిస్తోంది. ఆ దంతం ఇక్కడి అనేక ఆరామాల్లో ఉండి ఆఖరుకి క్యాండీ చేరుకుంది. ఈ రాజుల సంరక్షణలో భద్రంగా ఉంది. రోజూ మూడు పూటలా ప్రత్యేక పూజలు చేస్తారు. ప్రతి బుధవారం అభిషేకాలు నిర్వహిస్తారు. ఏడాదికి ఓసారి జరిగే పెరిహెరా ఉత్సవాల్లో బుద్ధ దంతాన్ని ఆలయం బయట ఊరేగిస్తారు. ఆ దంతపురం నేటి ఆంధ్రప్రదేశ్ లో ఉందని పురావస్తు





పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఒకప్పుడు మీ తెలుగు నేలతో మా శ్రీలంకకు గట్టి అనుబంధమే ఉండేది.' అనురా మాటలు వింటుంటే ఒళ్లు పులకించిపోయింది.

తెలుగు తోబుట్టువు, సిక్కోలు రాకుమారి హేమమాలి, ఆమె భర్త దంతకుమారుడి చిత్రాలను గర్వంగా చూశాను. 'అమ్మా మీరెవరో, ఆనాడు మీరు ఎంత కష్టపడ్డారో అన్నది నేటి మన తెలుగు గడ్డ మీద తెలియకపోయినా శ్రీలంకలో మిమ్మల్ని గొప్ప గౌరవంతో చూసుకుంటున్నారు. మీరు ధన్యులు..' అని మనసులోనే నమస్కరించాను.

ఎంతో ఉత్సాహంతో గర్భగుడి దగ్గరకి చేరుకున్నా. లోపల బంగారు పేటిక ధగాధగా మెరుస్తోంది. అందులోనే బుద్ధదంతం ఉందని అనురా చెప్పాడు. బౌద్ధ గురువులు పూజలు నిర్వహిస్తున్నారు. స్వదేశీ, విదేశీ భక్తులతో ఆవరణ అంతా నిండిపోయింది. క్యాండీ ఆలయంలో అడుగడుగునా తెలుగుజాతి చరిత్రను మన తాతముత్తాతలు ఇంత పదిలంగా రచిస్తే ఆ విషయం మన దాకా చేరలేదు. కళింగ రాజుకు ఆపదొస్తే శ్రీలంకలోని వాళ్లు సహాయం అందించారంటే ఆనాడు ఈ రెండు ప్రాంతాల మధ్య ఎంతటి అనుబంధం ఉండేదో. విజయుడు, హేమమాలి, క్యాండీ రాజులు వివిధ కాలాలలో తమ ఘనతను చాటారు. ఈనాటికీ బుద్ధ దంతం మన నేల మీదే ఉంటే ప్రపంచ బౌద్ధానికి చిరునామాగా ఓ అద్భుత ఆలయాన్ని అభివృద్ధి చేసే వాళ్లమా లేక ఏదో ఓ మ్యూజియంలో అలా ఉంచేసి చేతులు దులుపేసుకునేవాళ్లమా. శ్రీలంకలో మాత్రం ఆలయం అద్భుతంగా నిర్వహిస్తున్నారు. కాసేపు అక్కడే కూర్చుండిపోయా. అనురా కూడా నా పక్కనే కూర్చుని ప్రార్థనలు చేస్తున్నాడు. నా చూపులు ప్రవల్లిక కోసం వెతుకుతున్నాయి. కానీ నిరాశే. బయల్దేరుదామా అంటూ తను లేచాడు. నేనూ లేచాను.

'అనురా, క్యాండీ రాజుల కోటలు ఎక్కడున్నాయి?'

'ఈ ఆలయానికి ఉత్తరం వైపున నాటి రాజప్రాసాదాలు అలాగే ఉన్నాయి. వాటిలో కొన్నిటిని మ్యూజియాలుగా తీర్చిదిద్ది సందర్శకులకు అనుమతి ఇస్తున్నారు. వీటిలో క్యాండీ నేషనల్ మ్యూజియం చాలా ముఖ్యమైంది. క్యాండీ రాజులకు సంబంధించి అయిదు వేల వస్తువులను సందర్శనకు ఉంచారు. నీకు ఆసక్తి ఉంటే వెళదాం' అన్నాడు.

'ఫర్వాలేదు అనురా.. నువ్వు చాలా సేపటి నుంచీ నీ పనులన్నీ వదులుకుని నాతో ఉన్నావు. నేను వెళతాలే.'

మాటల్లో ఆలయం వెలుపలికి వచ్చాం.

'ఆ కనిపించే ప్రాకారాలే రాజప్రాసాదాలు మరి నాకు సెలవా. ఏదైనా అవసరం అయితే ఫోన్ చేయి' అంటూ తన మొబైల్ నెంబరు ఇచ్చాడు. సూర్యా, నీతో పరిచయం ఎంతో సంతోషాన్నిచ్చింది..' అంటూ హత్తుకున్నాడు.

'నాక్కూడా అనురా, నిన్నూ, నీ పేరునూ నేనెప్పుడూ గుర్తుంచుకుంటాను' అంటూ వీడ్కోలు తెలిపాను. తను వెళ్లిపోయాడు.

నేను అమరావతికి చెందిన వాడినని అనురా ఇంతలా గౌరవించడం నాకెంతో ఆశ్చర్యం కలిగించింది. వివిధ దేశాలలో ఈనాటికీ ప్రసిద్ధ బౌద్ధకేంద్రంగా అమరావతిని కొనియాడడం గొప్పవిషయం. మనం ఆ ప్రాచీన నగరాన్ని పూర్తిగా మర్చిపోయాం.

రాజప్రాసాదం దగ్గరికి వచ్చాను. మన భారతీయ కోటలతో పోలిస్తే భిన్నంగా ఉంది. ఇందులో రెండు విభాగాలు ఉన్నాయి. మొదటిది 'పల్లె వాహల', ఇది రాజుకు సంబంధించినది. రెండోది 'మేడ వాహల' .. ఇది ఒకప్పటి రాణి అంతఃపుర వాసానికి చెందింది. నేను మొదట పల్లెవాహలకి వెళ్లా. ఇక్కడ ఆయుధాలు, వస్తువులు, ఆభరణాలు, కిరీటాలు, దుస్తులు ఇలా ఎన్నిటినో భద్రపరచారు. అయితే ఓ పొడవాటి అల్మరాలోని గాజు తలుపులలోంచి కన్పిస్తోన్న దుస్తులు రక్తసిక్తమై చిరిగిపోయి ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుంటే కళ్లల్లో నీళ్లు ఆగలేదు. అవి విక్రమరాజ సింగవి. ప్రజల్లో ఎంతో పేరున్న అతడి రాజ్యాన్ని కబళించాలనే నెపంతో బ్రిటీషర్లు తప్పుడు అభియోగం మోపి కోటను స్వాధీనం చేసుకోవడానికి వచ్చారట. వాళ్లకి దొరకకుండా అతడు తప్పించుకున్నాడు. ఇలా ఒకటి కాదు రెండు కాదు మూడుసార్లు బ్రిటీషర్లు చేసిన ప్రయత్నాలు విఫలమే అయ్యాయి. ఆఖరుకి రాజు అనుయాయులే ఉప్పందించారు. కొండల మధ్య ఓ ఇంట్లో ఉన్న రాజు రహస్య స్థావరాన్ని చుట్టుముట్టారట. రాజును చేజిక్కించుకుని దుర్భాషలాడారు. అతడిపై చేయిచేసుకున్నారు. కాళ్లూ చేతులను ఓ స్తంభానికి కట్టేసి అతి కిరాతకంగా బంధించారు. ఆ పెనుగులాటలో అతడి దుస్తులు చిరిగిపోయాయి, రక్తసిక్తమయ్యాయి. ఆనాటి దుస్తులే ఇవి. చరిత్రలో రాజులను తమ ఆంతరంగికులే వెన్నుపోటు పొడిచిన ఘటనలెన్నో. విక్రమరాజ సింగదీ అదే కథ. మనసు బరువెక్కి అక్కడ ఉండలేకపోయా.

మేడ వాహల ఆనాటి రాణుల అంతఃపురం. ఇక్కడ శ్రీలంక ఆర్కియాలాజికల్ డిపార్టుమెంట్ వారిని తప్పకుండా మెచ్చుకోవలసిందే. మన జేజమ్మ వెంకట రంగమ్మ వంటశాలను యథాతథంగా కొన్ని కోట్ల రూపాయలు వెచ్చించి పునరుద్ధరించారు. చాలా మంది సింహళ యువతులు ఆనాటి పాత్రల్ని, వంట సామగ్రిని ఆసక్తికరంగా చూస్తున్నారు. సింహళ ప్రభుత్వానికే కాదు సింహళీయులకు తమ చరిత్ర పట్ల ఉన్న అనురక్తికి జోహార్లు అర్పిస్తూ

అక్కడి నుంచి వచ్చేశాను.

హోటల్లో భోజనం కానిచ్చి టాక్సీలో బయల్దేరా. మన శ్రీకాకుళానికి చెందిన విజయుడు నిర్మించిన అనురాధపుర నా తదుపరి మజిలీ. అదే శ్రీలంక ప్రాచీన రాజధాని నగరం. అంతేకాదు ఆ నగరం ప్రసిద్ధ బౌద్ధక్షేత్రం. దీనికి కారణం అక్కడి బోధివృక్షం. బుద్ధుడికి జ్ఞానోదయం కలిగించిన బుద్ధగయలోని రాగిచెట్టు మొలకే ఈ చెట్టు. ఈ జయశ్రీ మహాబోధి రాగి చెట్టును మొలకగా అశోకుడి కూతురు సంఘమిత్ర భారతదేశం నుంచి శ్రీలంకకు తీసుకువచ్చింది. కచ్చితమైన కాలం తెలియడం వల్ల ప్రపంచంలో మానవుడు నాటిన అత్యంత పురాతన రారిచెట్టుగా ఇది పేరు తెచ్చుకుంది.

ప్రవల్లిక కన్పించలేదన్న అసంతృప్తి తప్పిస్తే నా క్యాండీ ప్రయాణం విజయవంతమైందనే చెప్పాలి. మన తెలుగు జాతికి సంబంధించి ఎన్నో ఆనవాళ్లు అక్కడ ఉన్నాయి. బ్రిటీషర్లు విక్రమరాజసింగతో వ్యవహరించిన తీరు మాత్రం అమానుషం, అమానవీయం.

పైనాపిల్ తోటలు ఇక్కడ ఎక్కువగా ఉన్నట్టున్నాయి. రోడ్డు కిరువైపులా రాశుల్లో అమ్ముతున్నారు. ఓ కిలోమీటరు మేరా అవే. రోడ్లు ఇంకా ఇక్కడ అంత పెద్దగా లేవు. అటూ ఇటూ కలిపి నాలుగు దారులే. టూరిస్టు బస్సులు, కార్లే ఎక్కువ. చాలా మంది పొలాల్లోనే ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారు. మధ్య మధ్యలో ఊర్లు. హోటళ్లతో పాటు బేకరీలూ ఎక్కువే. అప్పుడే చీకటి పడుతోంది. దార్లో భోంచేసి అనురాధపుర వెళ్దామని డ్రైవర్ కి చెప్పా. నగర శివార్లలో ఓ హోటల్లో ఆపాడు. రెండు భోజనాలు చెప్పా డ్రైవర్తో కలుపుకుని. అన్నం, సాంబారు, రసం, రెండు కూరలు తెచ్చిచ్చాడు. మన వంటలతో అలా పోల్చుకోవడమే కానీ వాటి రంగు రుచీ వాసనా వేరేగా ఉన్నాయి. ఇక్కడైనా పెరుగు దొరుకుతుందేమోనని ఆశపడ్డా. దొరికింది. కాకపోతే పెరుగుని కుండతో సహా ఫ్రిజ్లో పెట్టడం కాస్త విడ్డూరంగా అన్పించింది. బీన్స్ని పొడవుగా కోసి ఉల్లిపాయలు కలిపి కూరగా చేశారు. బీన్స్ కంటే కూడా ఉల్లిపాయలు మూడింతలు ఎక్కువగా ఉన్నాయి. ఓ ప్లేట్ నిండా ఇడియప్పాలు తెచ్చి పెట్టాడు సర్వర్.

'ఆర్డర్ చేయలేదు కదా అంటుంటే..'

ఇక్కడ అంతే, ఏం ఆర్డర్ చేసినా ఇడియప్పం మాత్రం తప్పకుండా పెడతారని మీకు ఇష్టమైతే తినొచ్చని, లేకపోయినా ఫర్వాలేదని, ఎన్ని తింటే వాటికి మాత్రమే బిల్లు వేస్తారని ' డ్రైవర్ చెప్పాడు.

ఇక్కడ హోటళ్లలో అంతా పింగాణీ ప్లేట్లూ, పాత్రలూ. డ్రైవర్ తన ప్లేట్లో అన్నం, సాంబారు, కూరలు, ఇడియప్పం, పెరుగు అన్నీ వేసుకుని ఒకేసారి కలుపుకుని తింటున్నాడు. పక్కటేబుల్ వాళ్లని చూశా. వాళ్లూ అంతే. ఒక్కసారే ప్లేట్లో అన్నీ వేసుకుని కలుపి తింటున్నారు. మన లాగా అన్నంలో ఒక్కోటీ కలుపుకుని తినట్లేదు. ఒక్కో దేశంలో ఒక్కో పద్ధతి. ఇక్కడ ఇంతేనేమో. ఏదేమైనా భోజనం రుచిగా ఉంది. నీళ్ల బాటిల్స్ అన్నీ లీటరున్నర సైజులో అమ్ముతున్నారు. అంత పెద్దవి పట్టుకుని తిరగడం కాస్త కష్టమే. అనురాధపురాను చేరుకునేసరికి ఎనిమిది గంటలయ్యింది. జయశ్రీ మహాబోధి సమీపంలో హోటల్ తీసుకుని ఆ రాత్రికి విశ్రమించా.

ఉదయమే ఆలయానికి బయల్దేరా. హోటల్ నుంచి నడిచి వెళ్లేంత దూరమే. చుట్టూ ప్రాకారం అందంగా ఉంది. ప్రవేశ ద్వారం దగ్గర పూజా ద్రవ్యాలు, పూల దుకాణాలు.. అనేక రంగులు, సైజుల్లో కలువ పూలు చూడముచ్చటగా ఉన్నాయి. వందల సంఖ్యల్లో కొబ్బరి మొలకల్ని కూడా అమ్ముతున్నారు. వాటిని చేతుల్లో పట్టుకుని కొందరు లోపలికి వస్తున్నారు. మొక్కులు తీర్చడంలో భాగంగా కొబ్బరి మొలకల్ని ఆలయానికి సమర్పించడం ఇక్కడి ఆచారమట.

అలాగే ముందుకు వెళుతుంటే ధ్యానమందిరం వచ్చింది. బంగారు బుద్ధ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు తాము తెచ్చిన కలువపూలను, అగరువత్తులను అక్కడ సమర్పించి ధ్యానంలో కూర్చుంటున్నారు. నేను కూడా కాసేపు ధ్యానంలో గడిపి బయటకు వచ్చేశాను. పక్కనే కొన్ని మెట్లు.. అవి దాటగానే శాఖోపశాఖలుగా ఆకాశమంతా పరచుకున్న పవిత్ర బోధివృక్షం. కొన్నిటి శాఖలకు అక్కడక్కడా కాషాయ వస్త్రాలు చుట్టారు.

క్రీస్తు పూర్వం మూడో శతాబ్దికి చెందిన వృక్షం కావడం వల్ల ఇనుప స్తంభాలతో తోడ్పాటు అందించి పరిరక్షిస్తున్నారు. ఆ చెట్టు కాండం అంతా ఓ విశాలమైన ఎత్తైన ప్రదేశంలో ఉంది. దాని చుట్టూ రైలింగ్ వేశారు. ఆ ఇనుప చువ్వలకీ బంగారు రంగు పెయింటు వేయడం విశేషం. కొద్ది మందికి మాత్రమే కాండాన్ని తాకే అవకాశాన్ని ఇస్తున్నారు. చుట్టూ ఉన్న విశాలమైన ప్రదేశంలో



బృందాలుగా చేరి భక్తులు ప్రార్థనలు చేస్తున్నారు. గాలి వీచినప్పుడల్లా ఆ పవిత్ర వృక్షం ఆకు రాలిపడుతుందేమోనని ఆశతో చూస్తున్న వారూ లేకపోలేదు. నేను కూడా కాసేపు అలాగే చెట్టునీడలో కూర్చున్నా బోధివృక్ష శాఖలను చూస్తూ ప్రవల్లిక కోసం వెతికాను.

నాకు కాస్త దూరంలో ఓ యువకుడి హస్తరేఖలను చూస్తూ ఓ నడివయసు స్త్రీ జోస్యం చెబుతోంది. ఆమె వస్త్రధారణ అందరిలోకీ భిన్నంగా లంగా జాకెట్టూ, ఓణీ కట్టుకుంది. ఆమె పక్కనే ఓ అయిదేళ్ల పిల్లాడు.. బహుశా ఆమె మనవడు అయిఉంటాడు. ఆమె ఎరుక చెప్పడం అయిపోయినట్టుంది. యువకుడు ఆమెకు డబ్బులిచ్చేసి వెళ్లిపోయాడు. ఆమె, మనవడూ గడ్డిపై కూర్చున్నారు. తన జోలెలాంటి సంచిని తీసింది. అందులోంచి అన్నంతీసి వాడికి తినిపించేందుకు ప్రయత్నిస్తోంది. వాడు మారాం చేస్తున్నాడు. కొద్దిగా కోపంతో ..

'కూడు తినరా అయ్యా'.. అంది....

నా చెవులను నేనే నమ్మలేకపోయాను. ఆమె తెలుగు మాట్లాడుతోందా? నేను తప్పుగా విన్నానేమోనని మరో మాట కోసం చూస్తూ కూర్చున్నా.

'మా అయ్య కదా, తినరా..' అంది కాస్త గోముగా. వాడు వెంటనే నోరు తెరచాడు.

నేను విన్నది నిజమే ఈమె తెలుగే మాట్లాడుతోంది. కానీ వాళ్లను డిస్టర్బ్ చేయదలచుకోలేదు. ఆమె వాడికి అన్నం తినిపించి, తనూతినే దాకా వేచి ఉండి ఆ తరవాత వాళ్ల దగ్గరికి వెళ్లాను.

'అవ్వా, మీది తెలుగా'?

'అవు.. అన్నా, మాది తెలుంగే'..

'ఇక్కడ ఇంకా మనోళ్లు ఎక్కడెక్కడ ఉన్నారు?'

'మన కుదురు వాళ్లు చానే ఉండారు. అదో అక్కడ పాములాడించేవోడు మన తెలుంగోళ్లే'.. అంది.

'అవ్వా.. నీ పేరేమిటి?'

'ముత్తుమారి'

'నీ మనవడి పేరు..?'

'విజయ్'

'నాకూ జోస్యం చెబుతావా అవ్వా?' ముందుకు చేయి చాచా.

ఆమె నా చేయి చూస్తూ.. 'నీకు అన్నదమ్ముల్, అక్కచెల్లెళ్లు లేరు, నువ్వొక్కడివే. పెద్ద కార్యం పైన ఈ దవ్వు వచ్చినవ్. నీవు అనుకున్నది అవుతది. బిరానే..' అంటూ జోస్యం చెప్పింది. ఆమె చేతిలో కొన్ని డబ్బులు పెట్టా.

'మనోళ్ల దగ్గర తీసుకోను'.. అంది.

'మనవడికి ఏదైనా కొనివ్వు అవ్వా.. నేను వస్తా' అంటూ ఆమెకు వీడ్కోలు చెబుతూ అక్కడి నుంచి గేటు బయటికి వచ్చా.

గేటుకు ఓ పక్క ఓ పెద్ద పెట్టె పెట్టుకుని ఓ వ్యక్తి కూర్చున్నాడు. అతడి ముందు ఓ బుట్ట ఉంది. అందులో పాము ఉంది. అప్పుడప్పుడు ఆ బుట్టని కదిలిస్తున్నాడు. పాముల ఆటను చూసేందుకు ఎవరైనా వస్తారేమోనని ఆశగా అటూ ఇటూ చూస్తున్నాడు.

అతడి దగ్గరగా వెళ్లి 'మీరు తెలుగా' ప్రశ్నించా.

'అవునన్నా, మేం తెలుంగే'.

'అన్నా, మీ వివరాలన్నీ తెలుసుకోవాలని ఉంది, మీరు ఇండియా నుంచి ఎప్పుడు ఇక్కడికి వచ్చారు'.

**'మేం పుట్టిందీ, మా తాతముత్తాతలు పుట్టిందీ ఇక్కడే, మేం ఎప్పుడూ ఇండియా వెళ్లలేదు, మేం లంకోళ్లం'**

ఆయన మాటలకు ఆశ్చర్యపోతూ .. 'మరి తెలుగు ఎలాగ వచ్చు'

'మేం తెలుంగోళ్లం, మా తల్లి బాస తెలుంగే'

'శ్రీలంకలో తెలుంగు వాళ్లు ఉన్నారా'

'చాలా మంది, మన కుదుర్లు చానే ఉన్నాయి, మా ఊరు ఇక్కడికి దగ్గరే, వస్తావా?'

'తప్పకుండా అన్నా, మీ పేరు?'

'మసన్న' అని చెబుతూ 'సోమూ...' గట్టిగా కేకేశాడు దూరంగా కోతిని ఆడిస్తోన్న వ్యక్తిని చూస్తూ.

'నీ పేరు ఏమిటి.. ఎక్కడ నుంచి వచ్చావ్?' మసన్న నా వివరాలు అడిగాడు.

'నా పేరు సూర్య, ఇండియా నుంచి వచ్చాను. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అని ఇప్పుడు రెండు రాష్ట్రాలు ఉన్నాయి. అక్కడంతా తెలుగే మాట్లాడతారు.' నా గురించి వివరించాను. ఇంతలో సోము వచ్చాడు. అతడికి నన్ను పరిచయం చేస్తూ..'మనోడే, ఇండియా నుంచి వచ్చాడు' అని చెప్పాడు.

సోము సంబరంగా నన్ను చూసి నవ్వాడు. అతడు పాను నములుతున్నాడు. పాతికలోపు వయసు ఉంటుంది. మసన్న నలభైకి దగ్గర్లో ఉంటాడు. సోము భుజం మీద కోతి కూర్చుని ఉంది. దాని మెడకు బెల్టు వేసి తాడు కట్టారు. అది అల్లరి చేస్తుంటే కోతి.. కోతి అని తెలుగులోనే పిలుస్తున్నాడు. నాకు భలేగా అనిపిస్తోంది.

'సోమూ, నేను సూర్యని మనూరికి తీసుకువెళ్తున్నా. నువ్వా వస్తావా, నీ యవ్వారం చూసుకుని రాత్రికి వస్తావా?

'మీరు వెళ్లండి, నేను రాత్రికి వచ్చి కలుస్తా' అన్నాడు.

మసన్న తన పాముల బుట్టల్ని పెట్టెలో పెట్టి తాళం వేశాడు. 'నీ సామాను ఎక్కడ సూర్యా, బండి మీద వెళదామా' అడిగాడు.

'అన్నా, నా సామాను పక్కనున్న హోటల్లోనే ఉంది. కొలంబో నుంచి టాక్సీలో ఇక్కడికి వచ్చాను. మనం ఊరికి టాక్సీలోనే వెళ్దాం'

'అయితే నువ్వు హోటల్ ఖాళీ చేయి, ఇక్కడ ఎన్నాళ్లున్నా మా తావులోనే ఉండాల' ఆర్డర్ చేసినట్టుగా చెప్పాడు మసన్న.

కాదనలేకపోయాను. హోటల్‌కి వెళ్లి చెక్ అవుట్ చేసి మసన్నతో పాటు వాళ్ల ఊరికి టాక్సీలో బయల్దేరా. కొన్ని బంధాలు విచిత్రంగా ఉంటాయి. నిన్నటి వరకూ శ్రీలంకలో తెలుగు వారుంటారన్న సంగతే నాకు తెలియదు. ఈనాడు నాకు ఇక్కడ ఓ అన్న దొరికాడు. మాది రక్త సంబంధం కంటే గొప్పదైన తెలుగు బంధం.

ప్రయాణం మొదలవగానే ప్రవల్లిక గుర్తుకు వచ్చింది. క్యాండీలో కనబడలేదు, అనురాధపురాలో కనపడలేదు తను. ఇక మగిలినవి సిగిరియా, దంబుల్లా, పొలన్నురువా. ఆరోజు కృష్ణానదిలో లాంచీలో నేను చూసింది ప్రవల్లికేనా. తన కోసం ఇంత దూరం వచ్చాను. తను కన్పించకపోతే ఎలా?

'సూర్యా, నిమ్మకుండిపోయావ్.' మసన్న ప్రశ్నకు ఈలోకానికి వచ్చాను. తనకి అంతా చెప్పేద్దామని అనుకున్నా. నమ్ముతాడో లేదో అన్న భయం. కానీ ఎక్కడో ఓచోట మొదలుపెట్టాలి కదా?

'అన్నా, ఈ మధ్య శ్రీలంక నుంచి ఏదైనా బౌద్ధ బృందం ఇండియా వచ్చారా?

'అవును, ఎవరో కాదు మన జయశ్రీ మహాబోధి కేంద్రం వాళ్లే ఇండియాకి బుద్ధ పాదాల యాత్ర నిర్వహించారు. ఇరవై రోజుల యాత్రలో సుమారు 70 మంది ఇక్కడి నుంచి ఇండియాకు వెళ్లారు'. మసన్న మాటలు నాకు ప్రాణం పోశాయి.

'అన్నా, వాళ్లలో నీకెవరైనా తెలుసా' కుతూహలంతో అడిగాను.

'ఎందుకు లేరు సూర్యా, చాలా మంది ఉన్నారు. అంతెందుకు మా అన్న కూతురు కూడా వాళ్లతో వెళ్లింది. మనూరిలోనే ఉంటాది. ఆ యమ్మతో నిన్ను కలుపుతాలే' అన్నాడు.

'నిజంగానా అన్నా, ఇంకా ఎంత సేపు ప్రయాణం'

'ఓ పావు గంట పడతాది.

అంతకు మించి తను అడగలేదు, నేను చెప్పలేదు. దేనికైనా సమయం రావాలని అనుకునేవాడిలో నేను ముందుంటా. కానీ ఆ సమయం ఎప్పుడొస్తుందో తెలియక తికమకపడేది కూడా నేనే.

(తరువాయి వచ్చే సంచికలో...)

డా॥ పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# 'నీకోసం, నీ మంచికోసం-సదా నీ అభిమానిగా ఉండిపోతాను'-3

("దేలెం ఒసం సకుని అసంగ్- దోహ్వానం సాయ తాయ" సవర పాట.)

(గత సంచిక తరువాయి...)

**మొ**త్తంమీద, పరస్పర విరుద్ధ మైన దృక్పథాల, నాయకత్వాల, తాపత్రయాల నేపథ్యంలో, ఒకనాటి సవర దేశంలో ఉద్యోగవర్గం మధ్య పెరుగుతున్న మల్లిపురం జగదీశ్ వంటి గిరిజన రచయితలు, తమ మూలాలు తెలుసుకొని రాయాలని అతని కథాసంకలనం 'శిలకోల' ముందు మాటలో అతని సాహిత్యగురువు గంటేడ గౌరునాయుడు ఆశిస్తారు.

**గిడసబారిన రోల్ మోడళ్ళు**

'గిరిజనులకు రోల్ మోడళ్ళు లేరు. గిరిజన సాహిత్యం అంటే ఉద్యమ సాహిత్యం అనే పేరు పడిపోయింది, విశాఖ మన్యంలో 'లోల్లోసి' అనే పాటలు ఉండేవట అని 'బహుళ' లో జగదీశ్ అంటుంటే, ఆ వ్యాస సంకలనం సంపాదకుడు, శిలకోలలో ముందుమాట రాసిన జానపద సాహిత్యవేత్త ఏ.కే. ప్రభాకర్, అంబేద్కర్ సార్వత్రిక విద్యాలయం జానపద విజ్ఞానంకోర్సులో, తన వ్యాసాలతోపాటు ఉన్న గిరిజన సంస్కృతి మీద వ్యాసాన్ని గుర్తు చేయలేదు. నిజానికి, ఆ వ్యాసం, మొదటి తెలుగు ప్రపంచ మహాసభలు(1976) ఆంగ్లంలో ప్రచురించిన, నాటి గిరిజన పరిశోధనాసంస్థ సంచాలకుడు డి.ఆర్. ప్రతాప్ చిన్న పుస్తకానికి సంప్రదాయ సాహిత్యగంధం అద్దింది. 'నెలనెలా వెన్నెల' సి.వి కృష్ణారావు మొదలుకుని నేటి వరకు ఎందరో రచయితలు ఆ కుదురునుంచి వచ్చారు. కాని ఇటువంటి ప్రయత్నం కాదుగదా, అసలు ఆ జోలికే వెళ్ళలేదు.

ఎలాచూసినా మనకి గిరిజనసాహిత్యం తక్కువదే అనేభావం ఉంది' అంటారు 'ఇప్పపూలు' ముందుమాటలో జయధీర్ తిరుమల రావు. 91లో విశాఖ ఐ.టి.డి.ఎ 'తెలుగు గిరిజన గీతాలు' (పరివర్ధిత ముద్రణ 'కొండకోనలలో తెలుగు గిరిజనులు') 200 కాపీలు కొని ఉపాధ్యాయులకు పంచింది. వాటిలో ఆ 'లోల్లోసి' పాటలున్నాయి. 1976లో అరకులోయలో గిరిజనులను అభివృద్ధి చేయటానికి జీవితం అంకితం చేసిన కెనడా దేశీయుడు గుస్తాఫ్ 'ఆదివాసీ పండుగలు' ఆ సంస్థ ప్రచురించింది. 'వారి ఆహార సేకరణ , ఉత్పత్తి దశలో సాగే వారి ఆదిమజీవితం లాగే, వారి పాట రూపం మార్పు లేకుండా ఉంది' (కే.ముత్యం 33) అంటూ తెలిసి తెలియక చేసే వ్యాఖ్యానాలకు, సవర జాతాపుల ఇటీవలి సంప్రదాయ పాటలను('నీకోసం ,నీ మంచికోసం సదా నీ అభిమానిగా ఉండిపోతాను' 'దేలెం ఒసం సకుని అసంగ్- దోహ్వానం సాయ తాయ") పార్వతీపురంలో ఆర్ట్స్ సంస్థ ప్రచురణ, బదులిచ్చినట్లుగా భావించ వచ్చు.(సవర జాతాపుజీవన సరాగాలు 2011). సవర రచయిత జగదీశ్, ఈ పార్వతీపురం ITDA లోనే పనిచేస్తున్నాడు.

**ఇస్తినమ్మ వాయనం**

'తెలుగు గిరిజనుల మాండలికం తెలిస్తేనే, మిగిలిన కొండ భాషలలో నుడికారాలు బోధపడతాయి'. అని భద్రిరాజు 1960లలోనే స్పష్టం చేశారు. కాని వారి శిష్యులు గిరిజన మాతృభాషలలో విద్యా బోధన అని మొక్కుబడి వాచకాలు తయారు చేసారు. గిరిజన సంక్షేమ శాఖలో సంపాదకులు ముందుమాటలో, ఆసక్తి గలవారు చదవవలసిన పుస్తకాలజాబితా ఇచ్చి, వాటిని సంక్షిప్తంగా పరిచయం చేస్తే బాగుండేది. ఇటువంటి ప్రాజెక్టులన్నీ ఇస్తినమ్మ వాయనం పుచ్చుకుంటినమ్మ వాయనం అన్న ధోరణిలో నడుస్తాయి. విశ్వవిద్యాలయాలలో అంత్రపాలజి శాఖలుకూడా తక్కువతినలేదు. ప్రతీ సంవత్సరం ఆ శాఖలో PG విద్యార్థులు తమ ఉపాధ్యాయుల మార్గదర్శనంలో ఒక గిరిజన గ్రామాన్ని నెల రోజుల పాటు అధ్యయనం చేస్తారు. 2008 నుండి అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమలౌతుంటే ఆ అమలుకు పునాది అయిన సంప్రదాయ గ్రామపటాన్ని ఒక్కచోట వీళ్ళు గీయలేదు. 'సంతోష చంద్రశాల'లలో స్థానాచార్యులకు గిరిజనుల పాటలలో 'చుక్కల సురిటిపల్లి'లో 'వెన్నెల వెదురుపల్లి'లో 'చూడగల్ల, అడగల్ల బయళ్ళు' కనిపించలేదు. ఇలా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రచయితలు, హక్కుల సంఘాలు జనాన్ని, ముఖ్యంగా గిరిజనులను నాలుగు స్తంభాలాట ఆడిస్తున్నారు.

1940 లలో సంథాల్ పరగణా కలెక్టర్ గా ఆంగ్లేయుడు Archer,వాళ్ళ సాహిత్యం సంప్రదాయాలను గ్రథస్థంచేస్తే, కొంతకాలం గిరిజన శాఖ కమిషనర్గా ఫుల్ బ్రైట్ ఫెలోగా ప్రముఖ ఆంగ్ల రచయిత శితకాంత మహాపాత్ర, 'Modernisation of and Ritual'లో తరువాతి పరిణామాలను పేర్కొన్నాడు తప్ప, విశేషమైన కృషి చేయలేదు. అలాగే ఆక్రోశంతో రచనలు చేసి, పనిచేసిన మహాశ్వేతాదేవి, అంతరిస్తున్న సాహిత్యం నిలబెట్టుకుంటూ, మారుతున్న రోజుల్లో భూమి అడవి నీరు దక్కించుకోటానికి కావలసిన లెక్కాడొక్కా దారి చూపించలేదు. ఇలా సాహిత్యగాళ్ళంతా తమ ప్రపంచంలో తాము బతికారు. కానీ రాంచీ విశ్వ విద్యాలయం ఉపకులపతి రామ్దయాల్ ముండా, గురువు రఘునాధ్ ముర్ము లు గిరిజనుల సంప్రదాయ సాహిత్యాన్ని నిలబెడుతున్నారు. కాబట్టి ఈ పోకడలలో, రచనలలో పాత్రలలో వైరుధ్యాలను, పరిమితులను తెలుసుకుంటూ ముందుదారి వెతుక్కోవాలి.

**గిరిజనుల వారసత్వం**

చిరకాలంగా తూర్పు కనుమలను పాలించిన గిరిజన నాయకులు మధ్య భారతాన్ని, అందులో ఉత్తరాంధ్రాని, ముఖ్యంగా, విశాఖనగరం అభివృద్ధి చేసిన క్రమం వేనోళ్ళ చాటుతుంది. ఆంధ్రవిశ్వ

విద్యాలయం కులపతి విక్రమదేవవర్మ, రాణి చంద్రమణిదేవి, కురుపాం మార్కెట్, తాజ్‌మహల్, దసపల్లా, గిరిజనులతో వియ్యమందిన అనకాపల్లి జమీందారుల ఏవియన్ కళాశాల వగైరాలు, యానాది ఎరుకల విముక్తికి జీవితం ధారపోసిన వెన్నెలకంటి రాఘవయ్య వంటి వారి కృషి; ఈ రోల్ మోడల్స్ ఇవేళ చదువుకున్న గిరిజనులకు తెలియవంటే, అందుకు, వాళ్ళను తమచుట్టు తిప్పుకుంటున్న బుద్ధిజీవులను, వాళ్ళు చెప్పే చదువులను తప్పు పట్టాలి. దళితులలో జాషువా, నాజర్, చీమకుర్తి నాగేశ్వరరావు; బడి చదువుల వల్ల కాదు, తమ అధ్యయనంతో, ప్రతిభతో అజరామరమైన ప్రభావం చూపించారు. గిరిజన రచయితలకు, తమ వారసత్వం గురించి అధ్యయనం చేయాలనే ఆసక్తి, పరిశ్రమ తక్కువైనా, తమసమస్యలు తెలుసు. వాటిని వ్యక్తీకరించే శిల్పంలో 'సహానుభూతి' కనిపిస్తుంది. కానీ వారి కథావస్తువు ఆశ్రమ స్కూళ్ళు, మతం మారటం, నిర్వాసితులు కావటం చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఈ సమస్యలు గిరిజనులకే పరిమితం కావు. జగదీశ్ 'అక్షరాల దారిలో' సవర పిల్లడు 'సన్నాయి' పాటలు పాడించే మాస్టారికి దగ్గరౌతాడు. ఆ మాస్టారు వాళ్ళ ఊరు వెళ్ళినపుడు వాళ్ళ వాద్యాలు, అందులో సన్నాయిని చూస్తాడు. అది షెహనాయికి మాతృక అనిగమనిస్తాడు. అతన్ని బడిదగ్గరలో సన్నాయి విద్వాంసుడి దగ్గర పెడతాడు. అతడు మరో 'షేక్ చిన మౌలానా సాహెబ్', 'బిస్మిల్లాఖాన్ అవుతాడు. గిరిజన 'ఘరానా'లకునాంది పలుకుతాడు. లేదా మరో డ్రాయింగ్ మాస్టారయితే, వాళ్ళ ఉళ్ళో గోడల మీద బొమ్మలు 'ఇడిసింగ్' చూసి, అతడిని పికాసో అంతవాడిని చేస్తాడు అని కథ తిరిగిరాస్తే అది సవర కథ అవుతుంది. ఈ బొమ్మలు వేయటాన్ని పాడేరులో 'గన్నికలు (జలకన్యలు) 'వలచటం' ఆవాహన చేయటం, మోహిం చటం అంటారు. ఆ మూలాలు కథల్లోకి తెస్తే పికాసోలు, చిను అబేలు వస్తారు. మన చదువులలో లోపించిన అటువంటి నేటివిటీ రావాలంటే, కథ, జనం నోట్లో నలగాలి.

**'తనంత తానే వచ్చేది ఏమిలేదు'**

ఈ సందర్భంగా త్రిపురనేని, కొ.కు. ఇచ్చిన సలహాలు రచయితలు మరువరానివి. 'అధ్యయనం లేకుండా ఎవరికీ శబ్ద సంపద పెరగదు. తనంతతానే వచ్చేది ఏమిలేదు' (సాహిత్యంలో వస్తు శిల్పాలు. 148) అందునా గిరిజన సాహిత్యం అంగడిలో దొరికే వస్తువు కాదు.

'ఈనాడు రచయితలకు పెద్దగా భాషాజ్ఞానమూ, పాండిత్యము, ప్రాచీన సాహిత్య పరిచయమూ అవసరములేదన్నది ఏనాడో నిర్ణయమయింది. కాని వారికీ జీవితానుభవం, సామాజిక దృక్పధము కూడా అవసరం లేదన్నది రాను రాను రుజువవుతున్నది. ఇతివృత్తాలలో పాత్ర పోషణలో, సన్నివేశాలలో ఎలాటి వాస్తవికతా అవసరం లేదు' (కవిత్వం చైతన్యం'157).

'సాహిత్యం జీవిత వృక్షానికి పూసే పువ్వు. చెట్టుకు పూలు పూస్తాయి గాని పువ్వుకు పూలు పూయవు, సాహిత్యానికి పుట్టే సాహిత్యం నాకు ఆనాడే కృత్రిమంగానూ, కాగితం పూవులాగానూ కనిపించింది. (ప్రజాసాహితి.కొ.కు ప్రత్యేక సంచిక.10) పరిశీలన గమనించాలి. నేటివిటీ లేని రచనలు 'కాగితంపు పూలు'గా మిగిలితే – అడవి సంప్రదాయంతో మమేకమైనవి గరికపూలైనా మనసును ఆకట్టుకుంటాయి.

'ప్రభుత్వం గుర్తింపు కావాలి' అని రచయితలు అంగలారుస్తుంటే, చెంచులు, కొండరెడ్లు, కొండదొరలు తమ సంప్రదాయ సాహిత్యాన్ని సేకరించి 'గిరిగింజ గిరిమల్లెలు' 'నల్లమలలో చెంచు ప్రపంచం', 'గోదావరి లోయలో కొండరెడ్ల బతుకు కథలు' ప్రచురించారు. నాయక్ పోదు పసుల బుచ్చయ్య తన తెగ సంస్కృతీ మీద ప్రచురణలు తేవటమే కాక, చిత్రకారుడుగా రాణిస్తున్నాడు. గిరిజన సంక్షేమశాఖ తయారు చేయించిన 'గిరిజన సంస్కృతి– ప్రధానోపాధ్యాయులకు కరదీపిక' విశాఖగిరిజనసంస్కృతి రెండువాచకాలు, మొజాయిక్ రామతీర్థ గారి కొండరెడ్డి వాచకాలు ఎప్పుడు వెలుగు చూస్తాయో? గిరిజన సంస్కృతి, దోపిడీ–బుద్ధిజీవులను, సామాజికన్యాయం కోసం పనిచేసే ఉత్సాహవంతులను ఎప్పుడూ ఆకర్షిస్తూనే ఉంటాయి. కానీ సంస్కృతి, చరిత్ర, పలుకుబడి పునాది లేకుండా, నేలవిడిచి సాము చేసేవారు గిరిజనులైనా, పురజనులైనా తొందరగానే వెలిసిపోతారు.

**పరిమళము చెడని, వాడని అడవిపూలచెండ్లు**

అధ్యయనబలంతో, చింతకింది, గిరిజనులమీద చేసే రచనలు, 'ప్రజాశక్తి' వర్ణించినట్లు ఏడువారాల నగలుగా మిగిలిపోకుండా, వాటిలో 'సహానుభూతి' రాటుదేలుతూ, గిరిజనుల శ్రమైక జీవన సౌందర్యంలో 'గంధ మృదుత్వశైత్యా'లను పుణికి పుచ్చుకుని 'పరిమళము చెడని, వాడని' పూలచెండ్లుగా అడవి తల్లి సిగలో ఒదిగిపోవాలి. తనకు ఎంతో దూరంలోలేని, మాడుగుల, వంటలమామిడి సంతలలో గిరిజనులు, వారిలో సంప్రదాయ సాహిత్యం వ్యాఖ్యానించగల వారితో పరిచయం పెంచుకోవటంవల్ల, ఈ రచనల పూలకు కాయలు పండ్లు, విత్తనాలు, వాటినుండి చెట్లు వస్తాయి. మళ్ళీ, వాళ్లలోకి వెళ్లి మారాకు తొడుగుతాయి. ఆ పక్కనే కప్పరిమజ్జిలో కొంధులు ఒకప్పుడు బ్రహ్మాండంగా నాటకాలు ఆడేవారని, పాడేరు దగ్గర అడ్డుమండ గిరిజనులు తుంపాడ నాటకపోటిలో మొదటి బహుమతి పొందారని, ఉత్తరాంధ్ర జానపద సంపదను గ్రంధస్థం చేస్తున్న బద్రి కూర్మారావు పేర్కొంటారు. ఆ రోజులు మళ్ళీ రావాలి. ఈ కథలను వాళ్ళు తమకు అనువుగా మార్చుకోవాలి.

గిరిజనోద్యమంలో, వాటిమీద వచ్చే ఆధునిక సాహిత్యంలో లోపించిన చిత్తశుద్ధి, లక్ష్యశుద్ధినీ సరిచేస్తూ వచ్చే రచనలు ముందుతరాలకు దారి చూపించగలవని, సవరపాటలో కోరుకున్నట్లు వాళ్ళ శ్రేయోభిలాషిగా.. ('నీకోసం, నీ మంచికోసం సదా నీ అభిమానిగా ఉండిపోతాను') రచయితలు మరింత కృషి చేస్తారని, గిరిజనుల నుండి చిను అబేలు, బిస్మిల్లా ఖాన్‌లు, పికాసోలు, చట్టాలు అమలు చేయించుకోగల కథానాయకులు రావాలని, 'తృణ కాష్ఠ జలసమృద్ధి'తో కొండకోనలు మనకు భద్రత నివ్వాలని ఆశిద్దాం.

***'తరుఃప్రసూతి పుష్పాణి,***
***మరుద్వహాతి సౌరభం'.***

చెట్లు పూలు పూస్తాయి. గాలి సువాస నను మోసుకుపోతుంది.

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
98481 23655

# పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషాసాహిత్య సంపద 5

**గ్రమటిక తెలుగికా తొలి తెలుగు ముద్రిత వ్యాకరణ గ్రంథం. దీనికి పూర్వం ముద్రణా సౌలభ్యం లేనందువల్ల మన రాతలు రచనలు అన్నీ తాళపత్ర, బూర్జుపత్ర గ్రంథాల్లో నిక్షిప్తమై ఉన్నాయి. నేడు ప్రామాణిక వ్యాకరణ గ్రంథమయిన చిన్నయసూరి బాల వ్యాకరణం 1858లో అచ్చయింది. షూల్జ్ వ్యాకరణం 1728లో కూర్చబడింది. అంటే షూల్జ్ 130 ఏళ్ళ తర్వాత చిన్నయసూరి వ్యాకరణం వచ్చింది. షూల్జ్ వ్యాకరణంలో కూడా తొలిగా వర్ణమాలను, తెలుగు గుణింతాలను వివరించాడు. పాఠకుల సౌలభ్యం కోసం, యువ పాఠక నేస్తాల కోసం అచ్చు, హల్లు విభాగమేర్పడిన విధానం రేఖా మాత్రంగా వివరించడం అవసరమని పరిచయం చేస్తున్నా.**

సంస్కృతంలో వర్ణాలు 50, ప్రాకృతంలో 40, తెలుగులో 36 సంస్కృత వ్యాకరణాలకు పాణినీయం మూలం. అనుంచి అః వరకు అకారాదులు, మొత్తం 16 వర్ణాలు. కనుంచిళ వరకు కకారాదులు 34 వర్ణాలు హల్లులు అచ్చులు,హల్లులు ఏర్పడటానికి మహేశ్వర సూత్రాలు మూల కారణం అంటారు. ఇవి మొత్తం 14 తొలి నాలుగు సూత్రాల్లో

1. అ ఇ ఉ ణ్ 2. ఋ ఌ లు 3. ఎ ఓ ఙ్ 4. ఐ ఔ చ్

చివరిదయిన నాల్గవ దాన్ని ఇద్వర్ణాలు అంటారు. మొదటి సూత్రంలోని తొలి వర్ణం 'అ' చివరి సూత్రంలోని చకారంతో కలిపి అచ్చులుగా పేర్కొంటారు. అచ్చులనే స్వరములు ప్రాణములు అనే వ్యవహారం కూడా ఉంది. హల్లుకు అచ్చు ప్రాణం కాబట్టి ప్రాణములు అంటారు. అచ్చులు స్వయం ప్రకాశములు అందువల్ల స్వరములు అనికూడా అంటారు. 'స్వయం రాజంతే ఇతి స్వరా:' అని నిర్వచనం హల్లుల విషయానికి వస్తే

5. హ య వ ర ట్ 6. ల ణ్ 7. ఞ మ ఙ ణ న మ్
8. ఝ భ ఞ్ 9. ఘ ఢ ధ ష్ 10. జ బ గ డ ద శ్
11. ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్ 12. క ప య్
13. శ ష స ర్ 14. హ ల్

అనే పది మహేశ్వర సూత్రాలను బట్టి తొలి హ చివరి హల్ కలిపి హల్లుగా పిలుస్తారు. ఇది సూక్ష్మంగా వివరణ. హల్లులకు వ్యంజనములు అనికూడా అంటారు. సాధారణంగా ఉచ్చారణ సౌకర్యం కోసం ఏదో ఒక అచ్చు హల్లుతో కలిపి పలుకుతాం కాబట్టి స్వరములచే ప్రకాశింప బడేవి వ్యంజనములు అని వాడుక. భాషా శాస్త్ర సౌలభ్యం కోసం మానవ ముఖాభినయ ఉ చ్చారణ సౌలభ్యం కోసం కంఠ్యములు, తాలవ్యములు మూర్ధన్యాలు, దంత్యాలు, ఓష్ఠ్యాలు, అంతస్థాలు, ఊష్మములు, అనే విభాగం స్పష్టీకరించినట్టు భాషాశాస్త్రవేత్తల నిర్వచనం. ఇది విశ్వవ్యాప్తంగా అంగీకరించే విషయం.

విశ్వవ్యాప్త భాషాశాస్త్రవేత్తలు పాణిని భాషా శాస్త్రపితామహుడుగా పేర్కొంటారు. పాణిని క్రీస్తు పూర్వం 4వ శతాబ్ది వాడని అంచనా. ఈయన గాంధార దేశవాసి. తల్లి దక్షి. తండ్రి పాణిని. దక్షీ పుత్ర పాణిని అని ప్రాచీన నామం. పాణిని కృతమే అష్టాధ్యాయి. ఎనిమిది అధ్యాయాలున్న గ్రంథం కాబట్టి అష్టాధ్యాయి అని పిలుస్తారు. పాణిని సంస్కృత భాషలో రచించిన ఈ వ్యాకరణ గ్రంథం సశాస్త్రీయమూ, సమగ్రము అయిన వర్ణనాత్మక వ్యాకరణం (Descriptive grammer) అని అంటారు. నిజానికి ప్రపంచంలో మరే భాషకు లేనంతటి శాస్త్రీయత పాణిని అష్టాధ్యాయికి ఉంది.

సూత్ర రూపంలో రచించిన అష్టాధ్యాయి లౌకిక, వైదిక సంస్కృత భాషా స్వరూపాన్ని వర్ణించే ఈ గ్రంథంలో మొత్తం 3981 సూత్రాలున్నాయి. అష్టాధ్యాయికి పతంజలి మహర్షి రచించిన మహా భాష్యమనే వాఖ్యానం. వామన జయాదిత్యులు విశ్లేషించిన కౌశికా వృత్తి ప్రసిద్ధమైనవిగా పండితులు వ్యాఖ్యానిస్తారు. కౌశికా వ్యాఖ్యానంలో సూత్రార్థం, ఉదాహరణం, పద ప్రయోజనం మెదలయిన అంశాలున్నాయి. ఈ గ్రంథ రచన కాశీలో రచించినట్టు చెప్పడం వల్ల కాశిక అనే పేరు వ్యావహారికంలోకి వచ్చి అదే స్థిరపడింది.

అష్టాధ్యాయిలో మొత్తం ఎనిమిది అధ్యాయాలున్నాయి. అవసరాన్నిబట్టి ఒక్కో అధ్యాయంలో నాలుగు ఉప విభాగాలు కూడా ఉన్నాయి.

**మొదటి అధ్యాయం :** సంజ్ఞలు, పరిభాషలు, ఆత్మనేపద, పరస్మైపద ధాతువులు, విభక్తి రూపాలు, సమాస అవ్యయాలు ఉన్నాయి.

**రెండవ అధ్యాయం :** సమాస ప్రక్రియ, సమాస భేదాలు, కారక విశేషాలు దశ విధలకారాలు ఉన్నాయి.

**మూడవ అధ్యాయం :** ఇందులోఅన్ని కృతంద రూపాలున్నాయి.

**నాల్గవ అధ్యాయం:** స్త్రీ ప్రత్యయ రూపాలు, తద్ధిత రూపాలు ఉన్నాయి.

**ఐదవ అధ్యాయం :** నాల్గవ అధ్యాయం కొనసాగింపుగా మరికొన్ని తద్ధిత రూపాలున్నాయి. ఆరవ అధ్యాయం : సంధి, స్వర విధానం ఆదేశాలు, అసాధారణ సమాసాలు, అర్ధ ధాతుక పరిణామాలు, ఆదేశ కార్యాలు లోప కార్యాలు మొదలయినవి.

**ఏడవ అధ్యాయం :** స్వర విధానం, ధ్వని పరిణామ క్రమం ఉన్నాయి.

**ఎనిమిదవ అధ్యాయం:** స్వర నామాలు, సంధి సూత్రాలు యిత్యాదులున్నాయి.

సూక్ష్మంగా అష్టాధ్యాయి వివరణ ఇది. బాలవ్యాకరణ కర్త చిన్నయసూరి తన వ్యాకరణ గ్రంథంలో 1) సంజ్ఞ, 2) సంధి, 3) తత్సమ 4) ఆచ్ఛిక 5) కారక. 6) సమాస 7) తద్ధిత 8) క్రియ 9) కృదంత 10) ప్రకీర్ణక పరిచ్ఛేదాలనే విభాగించాడు. చిన్నయ

బాలవ్యాకరణం 1858లో వచ్చింది. బెంజిమన్ షూల్జ్ గ్రమటిక తెలుగిక 1728లో వచ్చింది. బెంజమన్ షూల్జ్ ఎనిమిది అధ్యాయాలుగా విభజించడానికి గల కారణం అష్టాధ్యాయినే అనుసరించాడని చెప్పడానికి ఈ ఉదాహరణాలన్నీ పేర్కొనడం జరిగింది. షూల్జ్ వ్యాకరణం కేవలం పాశ్చాత్యుల కోసం రచన చేసినా ఆనాటి వ్యావహారిక భాషా పదాలు, ఆకాలం నాటి భాషాబోధనా పద్ధతులు గమనించవచ్చు.

తొలి అధ్యాయం: లిపి (Script) తెలుగు వర్ణమాలను సంపూర్ణంగా అక్షరానుగుణంగా వివరించాడు. అచ్చులు, హల్లులు ఆపై య-ర-ల-వ-శ-ష-స-హ-క-క్ష చివరిగా ఐతో ముగించాడు. అధ్యాయం చివర ఇతి: అని ముగింపు. ఆతర్వాత క గుణింతం ఉచ్చారణ క్రమం వివరించాడు.

అచ్చుల్లో

అ-ఆ-ఇ-ఈ-ఉ-ఊ-రు-రూ-లు-లూ-ఎ-ఐ-ఓ-ఔ-అం-అ: అని పేర్కొని ఋ, ౠలుకూడా ఉన్నాయి. వాటిని ఉచ్చారణలో రు-రూ అని పలుకుతారు. అని వివరించాడు. గుణింతానికి వస్తే పూర్వం మన పల్లెల్లో ఉండే ప్రాథమిక పాఠశాల స్థాయిలో గుణింతాలు పెద్దగా వల్లె వేయించేవారు. అదే క్రమంలో షూల్జ్ కూడా గుణింతాన్ని ఎలా నేర్చుకోవాలో వివరించాడు. బహుశా ఈ పద్ధతి ఆకాలానికి అంటే 1728 నాటికి ఉండి ఉండాలి లేదా ఆయనకు సహకరించిన పండితులయినా ప్రవేశపెట్టి ఉండాలి. ఏమయినా నేటికీ మన ప్రాథమిక పాఠశాలల్లో ఈ పద్ధతినే అనుసరిస్తున్నారు. క కాకు దీర్ఘమిస్తే కా కకు గుడిస్తే కి అని వివరించాడు. ఇందులో క గుణింతం, వలపల గిలక ప్రాచుర్యం మొదలయినవి గమనించవచ్చు.పాఠకులు గత సంచిక గమనించండి.

రెండవ అధ్యాయం: ఉచ్చారణ (Pronounciation) ఇందులో పదాలు పలికే తీరు వివరణాత్మకంగా ఉంది. ఉదాహరణకి సర్వేశ్వరుడు మోక్షం, మంచి మనస్సు, సూర్యుడు, ఘడియ, బూడిద, మెఖం, దొరువు, బొట్టు, పర్వతం, కొండ్ద, బురుద, మంన్ను, తొంట, వారధి, వంత్తెన, పెట, పాళెం, గెవినివాకిలి, తిరువిధి, అంగడి, బంగారు, వెండ్డి, శీసం, సత్తు, వుప్పు, కొమ్మ, పచ్చికసువు, గోధుమలు, పిండి, ఆవాలు, నూనె, సారాయి, పులుసు, మైనం, పాలు, చిలక, కొంగ, జెముడుకాకి, పిచ్చిక, బాతులు, నెమలి, పుంజు, పెట్ట, వుడుత, పంద్దికొక్కు గుర్రం, గాడిదె, ఆవు, దూడ, పెంద్ది, కుక్క తాత, అవ్వ, తండ్రి, తల్లి, బిడ్డలు, కొమారుడు, కూతురు, తొత్తు, బానిస, గరిటె, దీపం, సూది, దువ్వెన, అద్దం, మాదిగెవాండు, ప్రాంత పన్నివాండు, వడ్లవాండు, కుంమ్మరవాండు, వర్తకుడు, మహిమ, నరకం, వెధవది, పొరుగింటి వాండు, మందు, ఆత్మ, దాహం, ఆంకలి, పని, కొక, రాయి, దొవ, యిల్లు ఇందులో తెలుగువారి సంప్రదాయాలు, బాంధవ్యాలు, జంతువుల పేర్లు, వృత్తులు, కులాలు, తెలుగు పేర్లు మొదలయిన వెన్నో కన్పిస్తాయి. భాషాపదదోషాలు యిప్పటికీ కొంతమార్పులున్నా సంయుక్తా క్షర ప్రయోగాలు, ద్విత్వాక్షరాలు, దీర్ఘము మీద సాధ్యపూర్ణాను స్వారాలు ఎన్నో కన్పిస్తాయి.

మూడవ అధ్యాయం: నామవాచకాలు (Nouns). ఇందులో ఏకవచనం, బహువచన రూపాలు వివరించి ఉదాహరించాడు. సంస్కృత వ్యాకరణం అనుసరిస్తే ద్వివచనం కూడా చెప్పాలి కాని తెలుగు రచనా సంవిధాన ప్రక్రియలో కాని, వ్యావహారిక పలుకు బడిలో ద్వివచన విభాగం లేదు. అందువల్ల తెలుగు వ్యాకరణ రచనలో ఆనాటి ప్రాథమిక రచనాక్రమంలో ఏకవచనం, బహు వచనం మాత్రమే చెప్పాడు. దొర-దొరలు అను విభాగంతోపాటు యొక్క లో, లోపల అనే విభక్తి ప్రత్యయ రూపాలు కూడా ఉదాహరించాడు. దొరలయొక్క దొరలలో, దొరలలోపల వీటితోపాటు చేతన్, చేన్, తోడన్, తోన్ అనే విభక్తి రూపాలు కూడా దొరలచేతన్, దొరల చేన్, దొరలతోడన్, దొరలతోన్ ఈ రచనా క్రమంలో దొరకు ధార అని వత్తు ఉంది. బహుశా దొర అనే పలుకులో వత్తుగా ధ అని పలుకుగా విని ఉంచవచ్చు. అది శృతదోషంగా పరిగణిస్తే మిగిలిన రచనా క్రమం అంతా సక్రమంగానే ఉంది. అలాగే అమ్మ అని రాయవలసిన చోట అంమ్మ అని ఉంది ద్విత్వాక్షర రచనల్లో కూడా సంతకు సంత్త అని వింతకు వింత్త అనే రచనా ప్రయోగాలున్నాయి. రచనా సంవిధానం పై సరికొత్త పరిశోధనలు చేయడానికి ఈ వ్యాకరణం ఒక ఆ వరకువు కాగలదు. కొన్ని పండ్లు కూడా ఉదాహరణకు స్వీకరించవచ్చు. అరటి పండు, పనసపండ్లు, మామిడి పండ్లు, మర్రి చెట్టు, గంగరెని చెట్టు, వేంప చెట్టు, టెంకాయ చెట్టు, పొంక చెట్టు మొదలయినవి ఉన్నాయి. రచనా సంవిధానంలో వత్తులు, పొల్లులు, సంయుక్తాలు, ద్విత్వాక్షరాలు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయి.

నాల్గవ అధ్యాయం: విశేషణాలు (Adjectives) ఇందులో ప్రత్యేకంగా విశేషించి పేర్కొనదగినవి ఉన్నాయి. ఉదాహరణకు అశ్లీలమైన పదాలు కూడా రచనలో స్వీకరించిన సందర్భాలున్నాయి. ఉదాహరణకు మంచి మనుషుడు, మంచి ఆండది, ఛద్ద పాపిష్టి, ఛద్ద లంజ, చివరి పదం సాధారణంగా రచనలో కాని అక్షర బద్ధం చేయడంకాని జరుగదు. కాని జనవ్యావహారిక పద పలుకుబడిని స్వీకరించాడనడానికిది ఉదాహరణ. అలాగే షూల్జ్ తొలిగా అచ్చువేసిన తెలుగు పుస్తకాల శీర్షికలు కూడా ఇక్కడ కన్పిస్తాయి. పుణ్యపుదొవ, పాపపుదొవ, ఆకాశపునిచ్చెన, నరకపు వెదన, శశరీరపుపని, తర్కపు మాట. ఈ పదాలు 1746-47లో అచ్చు వేసినన పుస్తకాలు శీర్షికలలో ఉన్నాయి. అలాగే కొన్ని పదాలు విశేషంగా కనిపిస్తాయి. పొడుగు పర్వతం, వెడల్పు సముద్రం అలాగే సంఖ్యా వాచకాలలో వకటి -రెండ్డు -మూడు - నాలుగు -అఇదు -ఆరు -యెడు - యెనిమిది - తొంమ్మిది -పది -పదకొండు -పంద్రెండు -పధ్మూడు - పధ్నాలుగు - పదిహేను - పదహారు - పది హెడు - పద్దెనిమిది - పందొమ్మిది - యిరువై-నూరు-యింన్నూరు - మున్నూరు- నంన్నూరు -యనూరు- ఆరునూరు - యెళ్నూరు - యెనమన్నూరు - తొంమ్మంన్నూరు- వెయ్యి ఈ అధ్యాయం చివరిగా ఒక వాక్యం ఉంది. 'యంన్ని నాళ్లు బ్రతికి వుంన్నాము అంన్నాళ్ళు ధర్మం శాయవలెను" ఈ వాక్యంలో ధర్మం దగ్గర వలపలగిలక లేదు. దీనిని బట్టి రచనలో సందర్భాన్ని బట్టి వలపలగిలక ప్రాధాన్యం ఏర్పరచినట్టు తెలుస్తుంది.

ఐదవ అధ్యాయం: సర్వనామాలు (Pronouns) సర్వనామాల్లో కూడా ఏకవచన బహువచన రూపాలున్నాయి. నేను-మేము, నీవు-మీరు, వారు-వారులు, తాను-తాము, మొదలయినవి కనిపిస్తాయి.

అధ్యాయం చివరగా వకవక మనుష్యుడు - వకకవ ఆండది - వకవక మృగం అని ఉదాహరించాడు. అనంతరం ఒక వాక్యం కనిపిస్తుంది.

"నంన్ను స్నేహించ్చే సర్వేశ్వరుడు మంమ్ముల రక్షించిన కృస్తుస్సు అయ్యవారు నికు మోక్షం యయ్యపొయ్యే యెలినవారు" ఈ వాక్యంలో నన్ను- మమ్ముల నీకు- అనే పదాలుక ఏకవచన బహువచన ఉదాహరణలకోసం రాసి ఉందవచ్చు.

ఆరవ అధ్యాయం: క్రియలు (Verbs). ఇక్కడ కూడా ఏకవచన బహువచన రూపాలే కన్పిస్తున్నాయి. నేను అంప్పిస్తునాను - మేము అంప్పతునాము నెను అంప్పెది లేదు - మెము అంప్పెదిలేదు నెను అంప్పింస్తిని - మెము అంప్పితిమి అలాగే చిన్న వాక్యంలో కూడా క్రియలు వచ్చేలా ఉదాహరించాడు. "పుస్తకం అంప్ప వలెనని చెప్పు" దానుల అంప్పించ్చెటందుకు చెప్పండి. అలాగే క్రియలు వరుసగా కొన్ని చెప్పాడు. ఫేయిస్తునాను - పిలిపింస్తునాను చెప్పింస్తునాను - కట్టింస్తునాను - ముగింపిస్తునాను - పారింస్తునాను కలిశెది - కదిలేది - నలిశెది - వంగ్గిపొయ్యేది - లెవచెశెది -

ఏడవ అధ్యాయం: ప్రత్యయాలు (Particles) : ఆత్మలోను - ఆత్మనుండ్డి, ఆత్మనుంచ్చి, ఆత్మతోను ఆత్మదగ్గర - కురిచిపిట మీద - కురిచి పిట కింద కురిచి పిట అంచున రెపు - రేపటికి యల్లుండి యల్లుండికి కింద - కిందికి, పొదుగునా - పొదుగుకి శిఘ్రుంగా - గొబ్బును, వెగిరంగా అప్పుడే, తిన్నంగా , అవును లేదు, కాదు - యిదుగో, వొట్టింగా -మరింన్ని - అయ్యో - అబ్బా - ఛీ - పో - పోరి - భళా - శాబాస్సు పిలు - వొయి - వొరి - వొసి వొహోయి - ఘిట్ట - స్వభావం ఏం - అబ్బా చిన్న వాక్యాల్లో "సర్వేశ్వరుడికి పెద్దవాడు లేదు సరి ఇన వాడు లేదు" మేము మంచ్చి క్రియలు చెశినపుడు వాడు రూకలు అంపి నాడంబెట్టె అప్పు తీచక వొయినాడంటే ఈ అధ్యాయంలో అన్యదేశాలున్నాయి కుర్చి శబాసు మొదలైనవి. చివరి అధ్యాయం వాక్య నిర్మాణం Syntax ఈ అధ్యాయంలో పుం లింగం - స్త్రీ లింగం - నపుంసక లింగం అని మూడు అధ్యాయాలుగా విభజించాడు సర్వేశ్వరుడు మంచ్చిది కలిగిన వారుగా వున్నారు మనుషులు పాపిష్టులుగా వున్నారు. 'ఆడవాండ్లు అనెక మాటలు మాట్లాడింది వానియక్క చెల్లె చురుకుగా వున్నది. యీ గుర్రం వొక కాసు శాయదు మంచి చెట్లు మంచి పండ్లు పందును నక్షత్రాలు మెరుస్తుంది మంచ్చిధొర - మంచిదొరసాని మంచి మృగం లొకం యొక్క ఘనం నాకు వద్దు సర్వేశ్వరుడు యొక్క కృపమనలకు చాలును మంచి క్రియలు చెసెటందుకు ప్రయాసపడవలెను మీరు పోయి గొడ్డలి తీసుకుని పర్వతాన్ని మెక్కి చెట్లు కొట్టి వగకుడి కట్టి దాని మొక్కపేరు కొత్త శియ్యుంఅని పెరున పిలువండి "వాడు బిక్షం యిచ్చెటట్టు గాను మనసులేదు, యిప్పుదు జపం చెశెటట్టుగాను పొద్దు లెదు లెస్సంగా బ్రతికెటట్టుగాను వానికి ద్రవ్యం కద్దు ఈ వాక్య నిర్మాణంలో అధికశాతం బైబిలు సంబంధి మిగినవి సమాజ సంబంధిగా కన్పిస్తున్నాయి. భాష వ్యావహారికం సంపూర్ణ భాషాశాస్త్ర దృష్ట్యా పరిశోధన చేయగలిగితే ఆ నాటి భాష, మాండలికం, అన్యభాషా పదాలు, వాక్యనిర్మాణం అన్నింటినీ వివరంగా విశ్లేషించవచ్చు.

చివరి అనుబంధంలో ఒకటి ముఖ్యంగా పేర్కొనవచ్చు. క్రైస్తవ మతాను యాములు ప్రతి ప్రార్థనానాంతరం సామూహికంగా జరిపించే పరలోక ప్రార్థన Lords Prayer ఒకటి దీనికి తొలి అనువాదంలో పరమండల మంత్రం అని షూల్ట్ అనువదించాడు. దాదాపు ఇదే కాలంలో షూల్జ్ 14 భారతీయ భాషలతో పాటు విశ్వభాషలన్నీ కలిపి 200 భాషల్లో పరలోక ప్రార్థనను అనువదించాడు. ఇది ఒక చిన్న పుస్తకంగా ప్రత్యేకంగా ముద్రించాడు. ఆధునిక అనువాదానికి తొలి అనువాదానికి గల బేధం కోసం ఇక్కడ ప్రత్యేకంగా పొందుపరచడం గమనించవచ్చు.

పరమండ్డల మంత్రము పరమండ్డలంలో ఉండే మ తండ్రి మి యొక్క నామ ధేయం పూజింప్పం పడునట్టు గాను మీ యొక్క రాజ్యంగాని మీ యొక్క చిత్తం పరమండలంలో శాయంబడు నట్లుగె భూమిలో నుంన్ను శాయం బడునట్టుగాను నానాట కలుగు మభో జనం మకునెడు యియ్యండి మయప్పుల వారికి మెము తాళు నట్లగె మీరుంన్ను మయప్పులు మకు తాళండి మము శోదనలో ప్రవేశం ప్పింప్ప కుండి అఇతే నూ ఛద్ద తనంలో నుండి మమున రక్షంచ్చ కోండ్డి అదెమంటె రాజ్యమున్ను బలమున్ను మమీను న్నుం మాకు యిన్నంటి కెంన్నంటి కింన్ని కలిగి ఉన్నది. ఆమెన్ ప్రస్తుతం 1885 తర్వాత అనువర్తింపబడిన బైబిల్ సొసైటీ వారి ముద్రణలో ఉన్న భాగం ఇది లూక సువార్త 11 : 1 - 4 భాగం నుంచి స్వీకరించడం జరిగింది తండ్రీనీ నామము పరిశుద్ధ పరచబడును గాక, మాకు కావాలిసిన అను దినాహారము దినదినము మాకు దయచేయుము. మేము మాకిచ్చియున్న ప్రతివానిని క్షమించుచున్నాము గనుక మా పాపములను క్షమించుము. మమ్ము శోధనలోకి తేకుము అని పలుకుదని వారితో చెప్పెను. ఈ అనువాదము షూల్జ్ రెండికి స్వల్ప బేధాలున్నా అవి భాషాభేదాలే తప్ప అర్థంలో కాని, విషయంలో కానీ మార్పులేదు ఇక్కడ మరో విషయం స్పష్టంగా కన్పిస్తుంది. షూల్జ్ అనువాదం నాటికి పుటల సంఖ్య కాని విరామ చిహ్నాలు (Punctuation Marks) ఎక్కడ ఉన్నట్టు లేవు. తెలుగు వాక్య రచనా విన్యాసంలో విరామ చిహ్నాలు, భాషా సంస్కరణ అనువాద సంస్కరణ సి.పి బ్రౌన్ తర్వాతే కనిపిస్తుంది.




(తర్వాత భాగం వచ్చే సంచికలో)

**సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు**

డా॥ ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడల్లో ఆనవాళ్లు-2

# నా పిడుగురాళ్ల - పిల్లుట్ల యాత్ర

**ము**ందుగా అనుకున్నట్లు రేపు తెల్లవారుజామునే బయలుదేరదామని అనుకొన్నాం. గుంటూరుజిల్లా మ్యాపు, టోపీ, ఒకటి రెండు బౌద్ధంపై పుస్తకాలు, (ప్రయాణంలో చదువుకోవటానికి) నోట్‌బుక్, అన్నీ సంచిలో సర్దుకొని, టీవీలో వార్తలు చూస్తూ, అన్నంతింటున్నాను. ఇంతలో నాకు రావడం కుదరదని డ్రైవర్‌నుంచి ఫోను. అన్నంమీద, వార్తలమీద ఆసక్తి ఆవిరైంది. తెల్లవారుజాము, 3.00గంటలకు బయలుదేరి, గుంటూరులో ఒకర్ని ఎక్కించుకొని పిడుగురాళ్ల పోదామనుకొన్న ప్లానుకు ఆటంకమొచ్చి పడింది. గబగబా అన్నంతిని, మరో మిత్రునిద్వారా, ఒకరోజువారీ డ్రైవర్ని మాట్లాడుకున్నాక మనసు స్థిమితపడింది. ఆడ్రైవరుకు ఫోనుచేసి, విజయవాడ, మొగల్రాజపురంలోని మధుమాలక్ష్మి ఛాంబర్స్, కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ & అమరావతి దగ్గరకు రమ్మని చెప్పాను. నా సహోద్యోగి చందూ కార్తీక్‌ను, కెమెరా తీసుకొని సిద్ధంగా ఉండమని చెప్పి, రేపటి యాత్రలో మునిగి, తెలియకుండానే నిద్రబోయాను.

అనుకున్నట్లుగానే మరునాటి ఉదయం 3.00గంలకే బయలుదేరి, గుంటూరులో ఒక మిత్రుణ్ణి ఎక్కించుకొని తెల్లారేసరికి పిడుగురాళ్ల చేరాం. అక్కడ జర్నలిస్టు, ప్రముఖ రచయిత, పల్నాడు మీద పరిశోధనలు చేసిన కె.హెచ్.వై.మోహనరావుతో కలసి టీతాగి, పిల్లుట్లకు బయలుదేరాం. ఊరు దాటామో లేదో మోహనరావు మళ్లీ ఫోను చేసాడు. వెనక్కి తిరిగి వచ్చి ఆయన ఇచ్చిన 'గుంటూరు జిల్లా దేవాలయాలు' అన్న పుస్తకాన్ని తీసుకొన్నాను. పిడుగురాళ్ల అంటే మా చిన్నతనం మాటొకటి గుర్తుకొచ్చింది. తెనాలి పంచాయితీ సమితి ప్రెసిడెంటు కనుసన్నల్లోలేని హైస్కూలు టీచర్లను పిడుగురాళ్ల బదిలీ చేస్తారనే మాట అది. ఇప్పుడు పిడుగురాళ్ల మంచి టౌనైంది కాని, ఆరోజుల్లో (1965-66 ప్రాంతంలో) నీళ్లు దొరక్క ఇబ్బంది పడేవాళ్లు. ఎండాకాలం వేడి ఎక్కువుగా ఉండటాన, అక్కడ పిడుగులు రాళ్లలా కురుస్తాయనే అర్థంలో ఆ వూరికి పిడుగురాళ్ల అని పేరు పెట్టారు.గుడ్డిలో మెల్ల అన్నట్లు పిడుగురాళ్లలో చారిత్రక ఆనవాళ్లు కనుమరుగైనా,ఒక పగిలిన రాతిపైగల క్రీ.శ.1318వ సం॥పు శాసనం నాకు ఊరట నిచ్చింది. పాకుడుబట్టి రూపు పోగొట్టుకొన్న అక్షరాల్ని తడిమ తడిమి చదివితే, అది అన్మకొండ పురవరాధీశ్వరుడైన కాకతీయ ప్రతాపరుద్ర దేవమహారాజులకు పుణ్యంగా, ..వయిలెంకంగారి పుత్రుడు, అయోధ్య రామలక్ష్మణులకు చేసిన అస్పష్ట దాన వివరాలున్నాయి.

ఒక్క అడుగు ముందుకేసిన తరువాత 1882లో రాబర్ట్ సివెల్ చూచిన పిడుగురాళ్ల గుర్తుకొచ్చింది. పిడుగురాళ్లలో అమరావతిని పోలిన పెద్దదిబ్బ, దానిచుట్టూ పాతకాలపు కుండపెంకులూ ఉన్నాయని పాత పిడుగురాళ్లలో రెడ్డిరాజుల కోటగోడ శిధిలాలున్నాయనీ, ట్రావెలర్స్ బంగ్లా ఆవరణలో మాధవరామమ్మ, మంగమ్మ, పిడుగురాళ్ల విషం పిల్లమ్మ అనే మూడు శిల్పాలున్నాయనికూడా సివెల్ రాశాడు. సతీసహగమనం చేసిన మంగమ్మ పేరంటాలుగా ఇప్పటికీ కొలవబడుతుంది. పాత కోటగోడ పక్కనేగల ఒక చిన్న శిధిలాలయంలో ఒకప్పుడు ప్రజల్ని పీడించుకుతిన్న ఒక స్త్రీని, 'పిడుగురాళ్ల విషం పిల్లి' అని కొలవటం, ఆమె మళ్లీ వాళ్లజోలికి రాకూడదనే మూఢనమ్మకమే. పాతకోట శిధిలాల్లో చూచిన పాతపాటేశ్వరి, గోపాలస్వామి, రామలింగ స్వామి ఆలయాలు, గణపతి భైరవ, మహిషాసురమర్దని, వీరగల్లులు నాగదేవతలు, సప్తమాతల శిల్పాలు, క్రీ.శ.1552 నాటి శాసనం, ఆనవాళ్లు కోల్పోయి, పిడుగురాళ్ల సంతకాన్ని చెరిపేశాయి. చరిత్ర పరిశోధకులకు తీరని వ్యధను మిగిల్చాయి. దగ్గరలోనే క్రీ.శ. 5వ శతాబ్దికి చెందిన, ప్రసిద్ధ థేరవాద తెలుగు బౌద్ధాచార్యుడు, శ్రీలంకలో బౌద్ధ సంఘనాయకుడిగా ఎన్నుకోబడిన ఆచార్య బుద్ధఘోషుని జన్మస్థలం కోటనెమలిపురిని చూద్దామనిపించింది. అక్కడ ప్రతిష్టించిన ఆయన విగ్రహాన్ని చూచి, తెలుగునేలపై థేరవాద బౌద్ధాన్ని ప్రచలితంగావించిన ఆయన గొప్పతనాన్ని కొనియాడాలనిపించింది. బౌద్ధానికి పునాదిరాళ్లైన శీలం, సమాధి, ప్రజ్ఞలపై ఆ మహనీయుడు రాసిన 'విశుద్ధిమగ్గ', త్రిపిటకాలపై రాసిన వ్యాఖ్యానాలు సామంతపాసాదిక, సుమంగళ విలాసిని, పపంచ సూదని, జాతక, అంధక అత్థకధలనే గ్రంథాలను స్మరించుకోవాలని పించింది. పాళీ సింహళ భాషలపై బుద్ధఘోషుని సాధికారిక పాండిత్యాన్ని శ్లాఘించాలనిపించింది. అనుకొన్నదే తడవుగా అక్కడికెళ్లి, ఆయన విగ్రహాన్ని చూచి, మొక్కి వెనక్కి మళ్లాను.

ఈ తీపి జ్ఞాపకాల్ని నెమరు వేసుకొంటూ తెలుగు వారి తొలి నరసింహస్వామి విగ్రహం దొరికిన ప్రాంతాన్ని చూద్దామని పిడుగురాళ్ల నుంచి 4కి.మీల దూరంలో ఉన్న కొండమోడు చేరుకున్నాను. స్థానికులను ఎవరినడిగినా తెలియదంటున్నారు. అభయాంజనేయ స్వామి ఆలయ అర్చకుడు చూపించిన



ప్రదేశంలో పాటిమట్టి తప్ప అక్కడేమీ లేదు. లేకపోయినా ఒక చారిత్రక స్థలంలో కాలుమోపానన్న ఆనందం మిగిలింది. ఇక్కడ దొరికిన తొలి నరసింహశిల్పం చారిత్రక ప్రాధాన్యత గలది. పల్నాటి సున్నపురాతి శిలపై మొత్తం ఆరు అర్ధ శిల్పాలున్నాయి. మధ్యలో రెండు మానవ చేతులున్న ఆసీన నరసింహుడు, వాటిలో గద, డిండిమలున్నాయి. ముఖం, శరీరం జంతురూపంలో ఉంది. వక్షస్థలంపై శ్రీవత్స చిహ్నముంది. నరసింహునికి అటూఇటూ వృష్ణివీరులు లేక పంచవీరులని పిలిచే ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, వాసుదేవ కృష్ణ, బలరాములు ఆయుధాలను ధరించి నిలబడి ఉన్నారు. బౌద్ధం బాగా విలసిల్లుతున్న ఇక్ష్వాకుల చివరి కాలానికి చెందిన ఈ శిల్పం, వైష్ణవ మత ఉనికిని చాటటమేకాక, వృష్ణి లేక పంచవీర ఆరాధనను తెలిపే ఏకైక శిల్పంకూడా. క్రీ.శ. 4వ శతాబ్దికి చెందిన ఈ శిల్పం, తెలుగువారి వైష్ణవ మత చరిత్ర, శిల్పకళా పరిణామాన్ని తెలుసుకోవటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలాంటి అరుదైన, అపురూపమైన ఈ నరసింహ–పంచవీర శిల్పం, ప్రస్తుతం గుంటూరులోని బౌద్ధశ్రీ ఆర్కియోలజికల్ మ్యూజియంలో ఉంది. పిడుగురాళ్లలో చెన్నకేశవ, రామలింగేశ్వరాలయాలు మధ్యయుగం నాటివేకాని పునరుద్ధరణ పేరిట చారిత్రకత కోల్పోయినందున ఆ దేవాలయాల్ని చూడాలనిపించలేదు.

కొంచెం సేపట్లోనే పిల్లుట్ల చేరుకున్నాం. అదొక వ్యవసాయపుటూరు. పిల్లుట్లకు ఆ పేరు ఎలా వచ్చిందోనని ఒకరిద్దరిని అడిగినా సరైన సమాధానం లేదు. వేణుగోపాల స్వామి గుళ్లో పూజారిని అడిగినా తెలవదనే సమాధానం. పిల్లి, ఉట్టి, అల = ఉట్టిమీద పిల్లి ఉన్న ఊరు అని అర్థాన్ని స్ఫురింపజేసుకొని చారిత్రక అవశేషాల అన్వేషణలో పడ్డాను.

గ్రామంలో శాసనాలేమి లేవు. కాశీ విశ్వేశ్వర, వేణుగోపాలస్వామి దేవాలయాలున్నాయి. అవి కూడా గతకాలపు ఆనవాళ్లేమీ మిగలకుండా పూర్తిగా ఆధునీకరింపబడినాయి. కాశీ విశ్వేశ్వరాలయం చుట్టుపక్కల పరిశీలించగా 16వ శతాబ్దపు నంది స్తంభం నిలబెట్టి ఉంది. ఇక్కడే బహుశా



పురాతన ఆలయం ఉండి ఉంటుంది. ఈ స్తంభాన్ని చూస్తే తక్షశిలకు చెందిన గ్రీకు రాయబారి హెలియోడరస్ క్రీ.పూ. 110 ప్రాంతంలోని విదిశాలోని బేస్‌నగర్‌లో నిలబెట్టిన గరుడ స్థంభం గుర్తుకొచ్చింది. సైజులేదు, ఆ కాలమూ కాదు కానీ, సాంప్రదాయం కొనసాగింది. అతడు భాగవతుడు. ఇక్కడ ఎవరో ఒక మహేశ్వరుడు, శైవ మత ప్రచారంలో భాగంగా ఎత్తించి ఉంటాడు. అయితే పది అడుగుల ఎత్తున్న (ఇంకా భూమిలో 5 అడుగులుంటుంది). ఈ స్థంభం కోసం క్రింద, చదరంగా, పైన ఎనిమిది పలకలగాను, ఆపైన చిన్న ఫలకం, దాని మీద చక్కటి నంది. కళాచరిత్రకారుల దృష్టి నాకర్షించాల్సిన ఈ నంది కమ్ముకొచ్చిన ఇళ్ల మధ్య పట్టించుకునే వాళ్లు లేక, బిక్కు బిక్కు మంటుంది. దాన్ని చూచి జాలేసింది. రాయిని క్వారీ నుంచి తెచ్చి, చదునుచేసి క్రీ.శ 16వ శతాబ్దికి చెందిన విజయనగర శిల్పకళకు మచ్చుతునకగా తీర్చిదిద్దిన నాటి శిల్పుల పనితనాన్ని మెచ్చుకోకుండా ఉండలేక పోయాను. ఆశ్చర్యమేమిటంటే, అక్షరాస్యత అంతగా లేని, శృంగార సాహిత్యాన్ని బొత్తిగా తడమని గ్రామీణులకు నిశ్శబ్ద శృంగార ప్రేరణ కలిగించే బూతు బొమ్మలు విద్యాత్మకంగా ఉన్నాయి. ఒకామె తెల్లవారుఝామున మజ్జిగ చిలుకుతుంటే, పొలం పోయే పైలాపచ్చీసు మొగుడు వెనుకగా వచ్చి ఆనందాన్ని అంటిస్తున్నాడు. మరో జంట, ఒకరికొకరు పైనకింద, ఆశీనులై ప్రపంచాన్ని పట్టించుకోకుండా శృంగారకేళీ కలాపంలో మునిగి తేలిపోతున్నారు. బాగా పరిశీలిస్తేగాని ఈ మైథున శిల్పాలు కన్పించవు. ఇది ఆనాటి సమాచార ప్రసరణలో భాగమే గానీ, బూతూ కాదు, రోతా కాదు.

ఆలయం బయట నిరాదరణకు గురైన వీరభద్రుని విగ్రహం నన్ను కాలు కదలకుండా చేసింది. త్రిభంగిమలో నిలబడి అన్ని అలంకారాలను ధరించి కత్తి, డాలు పట్టుకొని ఉన్న వీరభద్రుడు, ప్రభామండలం క్రింద అంజలి ముద్రలో ఉన్న దక్షుడు, శిల్పాన్ని చెక్కిన తీరు, తంగెడలోని రెడ్డి రాజుల కాలపు వీరభద్రుని శిల్పాన్ని తలపించింది. క్రీ.శ. 14,15 శతాబ్దాలకు చెందింది. సత్తువలేని ముసలి తాతను ఇంటి బయట కొట్టంలోకి నెట్టినట్లు, ఆలనా పాలన లేక కొంచెం



భిన్నమైన ఈ విగ్రహాన్ని నిర్దాక్షిణ్యంగా, ఆలయం ప్రాకారం వెలుపల పడేశారు. పూనుకొని ఆలయంలోపల పెట్టే నాధుడేలేడా అనిపించింది. ఒక్క నిట్టూర్పుతో ఊరుదాటాను. కారులో పోతున్న కొద్దీ చూచిన నందిస్థంభం, వీరభద్ర విగ్రహం మదిలో పదే పదే మెదులుతూనే ఉన్నాయి. శృంగార శిల్పాలైతే అంగారక గ్రహంమీద కాలుమోపిన అనుభూతిని కలిగించాయి.

ఇక నా చూపు, మోర్జంపాడువైపు. ఎప్పుడో, పిడుగురాళ్లలోని ఒక నగల వ్యాపారి, నాకు ఫోనుచేసి మావూళ్లో ఆలయం శిధిలమైంది. ఒకసారి చూచి,



పునరుద్ధరణకు సలహాలిస్తారా అని అడిగిన విషయం జ్ఞాపకమొచ్చింది. ఊరి చివరున్న అయిదడుగుల లోతు దిగుడుబావి, పక్కనే తూర్పు చాళుక్యుల కాలంలో కట్టిన సాదాసీదా బుగ్గరామలింగేశ్వరాలయాన్నీ చూశాను. ఇక్కణ్ణుంచి కృష్ణానది మూడుకిలోమీటర్లు ఉంటుంది. నదిలోతుగాఉన్నా ఇక్కడి నీటిఊట 5 అడుగుల్లోనే ఉండటం ఆశ్చర్యాన్ని కలిగించిది. గ్రామస్థులైతే, అది ఆవూరి మహిమ అని చెప్పుకొన్నా నిజానికి సున్నపు రాతిపొరల్లోంచి, నీటి జాలు నిరంతరం వస్తూనే ఉంటుంది. ఇది సహజ పరిణామమేగానీ, మహిమకు సంబంధంలేదని స్థానికులకూ, పూజారికీ చెప్పాను. 'అయ్యా, మీకు దేవుని మీద నమ్మకం లేదా' అని అడిగారు. చర్చపెరక్కుండా, ఊళ్లో ఉన్న నీలకంఠేశ్వరస్వామి గుడికి బయలుదేరాం.

ఊళ్లోకి చేరుకొని ఆలయం ముందు నుంచి చూస్తే, పాత ఆలయాన్ని ఊడదీసి, కేవలం రాతిద్వారాలను మాత్రం వాడుకొన్నారు. మిగతా చెక్కడాల్ని రోడ్డు పక్కన పడేశారు. నిలువెల్లా నిరుత్సాహం. ఆ ఆలయంముందున్న ఒక చారిత్రక బావి, మళ్లీ ఉత్సాహాన్నిచ్చింది. పది అడుగుల దారి, అటూఇటూ ఏనుగుల శిల్పాలు, మెట్లుదిగిన తరువాత, ఎడమవైపుకు నడవ, అక్కణ్ణుంచి మెట్ల వరుస, నీరు ఎంత పకడ్బందీగా ఉందీ దిగుడుబావి అనుకొని చుట్టూ తేరిపారా చూస్తే, బావిలోపలి గోడలమీద విష్ణుమూర్తి దశావతారాలు, కృష్ణలీలలు, నిలబడిన సప్తమాతలు జంతువులు, శృంగార, మైథున శిల్పాలు, ఆబావి చరిత్రకు అద్దంపడుతున్నాయి. క్రీ.శ.16వ శతాబ్ది–విజయనగర శైలి. ఒకప్పుడు దప్పికతీర్చి, గంగతో సమానంగా పవిత్రంగాచూచి, పూజలు చేసిన ప్రజలు ఇంటింటికీ కుళాయి రావటం వల్ల, చెత్తాచెదారాన్ని ఇందులోనే వేస్తున్నారు. నాతో పాటొచ్చిన రత్నకుమార్, నేనూ కలసి, గ్రామస్తుల్ని పోగుచేసి,ఆబావి వాస్తు, శిల్పకళా విన్యాసం, చారిత్రక నేపథ్యాన్ని వివరించాం. అంతే ! అక్కడున్న ఐదారుగురు, ఆచెత్తాచెదారాన్ని ఏరి బయటేశారు. ఈ బావిని కాపాడుకొని, బయటి నుంచి వచ్చేవాళ్లకు దీని చరిత్ర, నిర్మాణరీతి, శిల్పకళగురించి, తెలియజెప్పమని నేను టూరిస్టు అవతారం ఎత్తాను. వాళ్లలో ఇద్దరు కుర్రాళ్లు నేను చెబుతున్నదంతా మొబైల్ ఫోనులో రికార్డు చేసుకొన్నారు. మోర్జంపాడుకు వచ్చే చుట్టాలకు, స్నేహితులకు వీటి గురించి చెబుతామన్నప్పుడు మనస్సు ఆనందంతో నిండిపోయింది. మోర్జంపాడు గ్రామంలో సంప్రదాయానికి ఆధునికతను జోడించి సీమ వాస్తు శైలితో ఎంతో అందంగా కట్టుకున్న ఒక ఇల్లు, ఆ ఊరి మొత్తానికే ఆకర్షణ. ప్రవేశ ద్వారం, దానిపైన 1936 సం॥ అర్థచంద్రాకారపు ద్వారశాఖ పైన కోడిపుంజు నెత్తిమీద ఉండే అలంకారం, అటు ఇటూ ఎనిమిది కోణాల పడకగదులు, వాటి పైన బాల్కనీ, దాని క్రింద మళ్లీ కొయ్య అలంకారం, మొదటి అంతస్తు పైన చుట్టూ సుధాశిల్ప విన్యాసం, అన్నీ కలిపి ఉట్టిపడే రాజసం, ఆ ఇంటికే సొంతం. చక్కటి కొయ్య శిల్పంతో సింహద్వారం, అందమైన కిటికీలు, వాటిపైన పొదుచుకొచ్చిన చూరులూ, బర్మాకొయ్యతో నాటి నగిషీ పనుల్లో దిట్టలైన వడ్రంగులు రెచ్చిపోయి, పని తనంలో పోటీపడిన నేపథ్యాన్ని గోడకు బిగించిన కొయ్యఅల్మారాలు గుర్తు చేశాయి. ఇప్పుడు డబ్బుందీ, కొయ్యా ఉంది, వడ్రంగులూ ఉన్నారు. లేనిదల్లా అనాటి అలోచనలు, ఓపిక, కళాత్మక దృష్టి. అక్కడే నిలబడి స్థాణువులా చూస్తున్న నన్ను ఇంటివాళ్లు లోపలకు పిలిచి, ఇల్లంతా కలియజూపారు. సున్నపు తాపడపు గోడలు, కప్పులూ, చలువరాతి గచ్చు, దీపాలు పెట్టుకునే గూళ్లు, కాలెత్తితే కాని దాటలేని గడపలు, యనభై ఏళ్ల నాటి మద్రాసు ఇనపభోషాణం, సింహాసనాన్ని తలపించిన పందిరి మంచం, చీమలు



పట్టకుండా మంచం కోళ్లకింద నీళ్లు పోసుకోవటానికి గాడి చెక్కిన రాతి దిమ్మెలు, వాటిపైన ఏమాత్రం తేడాలేని తరిణెబట్టి భరిణెల్లా తీర్చిదిద్దిన మంచంకోళ్లు, మంచంపైన స్ప్రింగ్ పరుపు, దోమతెరలు కట్టుకొవటానికి కట్టె చట్రం, నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. నేను ఈ ఇంటి యజమాన్నైతే ఎంతబాగుణ్ణనే ఆలోచన పుట్టింది. లక్ష్మీదేవితో సమానంగా చూచుకొన్న రోలు, పన్ను బిగించిన రోకళ్లు (అవి ఎన్ని పెళ్లిళ్లు చూశాయో), తరతరాల సంతానానికి పిండిని పండించిన తిరగళ్లు, పల్నాటి జీవనాన్ని కళ్లముందు కదిలించాయి. మోర్జంపాడు నుంచి, బయలుదేరి మళ్లీ పిడుగురాళ్ల వచ్చి తిరుగు ప్రయాణ మైనాం. గత కాలపు వైభవ, ప్రాభవాలు, కళ్లముందు కదలాడుతూనే ఉన్నాయి. వారసత్వ సంపద పట్ల నిర్లక్ష్యం నీడలావెంటాడుతూనే ఉంది. మంచి కాలం రాకపోతుందా అని ఆలోచించేలోపు విజయవాడకు చేరుకొన్నాం.

(తరువాయి వచ్చే సంచికలో...)

డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

# తెలుగు కథల కొలను సదానంద




**దాదాపు నెల రోజుల క్రితం (25, ఆగష్టు2020) తన 81వ యేట కాలధర్మం చెందిన కలువకొలను సదానంద గారిలా బాల సాహిత్యాన్నీ, పెద్దల సాహిత్యాన్నీ సరిదీటు గా సృజించిన రచయిత తెలుగులో మరొకరు లేరనడం అతిశయోక్తికాదు. సునిశితమైన వ్యంగ్యంతో సమాజాన్ని తూర్పారబట్టే ఆలోచనా త్మకమైన రచనలనూ, సున్నితమైన అమాయక పాఠకులైన పిల్లలకోసం సులభంగా అర్ధమయ్యే నీతి కథలనూ వొకే రచయిత రాయగలడని నిరూపించిన అరుదైన కథకుడు సదానందగారు. యస్సెల్సీ మాత్రమే చదువుకొని, ప్రాథమిక పాఠశాలలో వుపాధ్యాయుడై, సాహిత్య సాధనను తన వుపాధ్యాయకత్వానికి వుపనదిగా మార్చుకొన్న కొద్దిమంది గొప్ప తెలుగు కథకుల్లో ఆయనే చివరివాడు గావచ్చుగూడా!**

"మాతృభాషలో మాత్రమే గొప్ప రచయితలు పుడతారు" అని నిర్ద్వంద్వంగా చెప్పేవాడు ప్రఖ్యాత కన్నడ రచయిత యు.ఆర్. అనంతమూర్తి. అయితే మాతృభాష మాత్రమే తెలిసిన సదానందగారి లాంటి రచయితకు నలభైయాభై యేళ్లక్రితం గొప్ప రచయితల్ని తయారు చేసే ఒక గొప్ప సాహిత్య ప్రపంచం వుండేది. తన సాహితీ జీవితపు ప్రారంభాన్ని గురించి చెబుతూ ఆకలి, వొంటరి తనం అడుగడుగునా పరామర్శించే పడుచుప్రాయంలో భయంకరమైన అధోలోకపు జీవులతో మాత్రమే తిరుగాడు రోజుల్లో, వాళ్లల్లో వొకడుగా పరిణామం చెంది పతనమైపోకుండా తనను కాపాడింది తనలో అంకురించిన రచనాసక్తి వొకటి మాత్రమేనంటాడాయన.

ఆరోజుల్లో ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక అనే రెండు పత్రికలు తనను రచయితగా తయారు చేశాయని అంటారు సదానంద. తిండీ నీళ్లూ లేకపోయినా వుండగలిగే వాణ్ణిగానీ వాటిని చూడకపోతే వుండలేకపోయేవాణ్ణి అంటాడు అప్పటి తెలుగు పండితుల గొప్పతనంవల్ల భాషా స్వరూపం ఆయనకు కరతలామలకమై పోయిందట. సరిగ్గా అదేరోజుల్లో తెలుగులో ప్రపంచ ప్రసిద్ధ నవలలు ఒక ఉద్యమంలాగా అనువదింపబడేవి. విజయవాడ కేంద్రంగా ఆంధ్రగ్రంథమాల వంటి ప్రచురణ కర్తలు అనేక అనువాదాల్ని ప్రచురించారు. టాగూరుకథలు, ఓహెన్రీ కథలు, కాశీమజిలీ కథలు, అరేబియన్‌నైట్స్,దార్క్విక్సెట్, రాబిన్‌హుడ్, రాబిన్ సన్‌క్రూసో ట్రెజర్ ఐలాండ్, హంచ్‌బాక్ ఆఫ్ నాటర్‌డాం, లేమిజరబుల్స్, త్రీమస్కటీర్స్ గొగోల్ వోవర్‌కోట్, జాక్‌లండన్ కాల్ ఆఫ్‌ది నేచర్-మొదలైన పుస్తకాల అనువాదాలే తనకు పాఠ్యగ్రంథాలని సదానందగారు చెప్తారు. కథాలక్షణాలు యిలా వుండాలి అంటూ మంత్రోపదేశం చేసిన మహర్షులుగా ఆ పుస్తకాలను ఆయన సంభావిస్తారు.

ఆయన పిల్లల సాహిత్య సృజనతోనే తన సాహితీయాత్ర ప్రారంభించారు. "మనిషికి నీతి వుండాలి. ఏ వ్యవస్థకైనా ఏ సమాజానికైనా దాని మనుగడకు ప్రాణభూతమైన నీతీనియమాలు కొన్ని ఉంటాయి. వాటి విలువలు నశిస్తే ఆ సమాజం దెబ్బతింటుంది. పెద్దలకు చెప్పడంకంటే, పిల్లలకు చెప్పడంవల్ల ప్రయోజనం వుంటుంది. అందుకే పిల్లలకోసం రాసిన కథల్లో వినోదంతోబాటూ ఒకసూక్తి లేదా సందేశం అందించటానికి ప్రయత్నించాను" అంటాడాయన.

పిల్లలకోసం ఆయన రెండు వందలకుపైగా కథలు రాశాడు. అవి కేవలం పిల్లలకోసమేగాదు. పెద్దలకు గూడా ఆకథలు జీవితపు వైచిత్రిని విస్పష్టంగా విప్పిచూపుతాయి. "సాంబయ్యగుర్రం" కథలో సాంబయ్య యువకుడిగావున్నప్పుడు మంచి గుర్రాన్ని కొనుక్కొని స్వారీ చేస్తూ తిరుగుతూ వుంటాడు. యెదురైన ప్రతివాణ్నీ ఆపి, వాడికి తన గొప్పలు చెప్పుకుంటూ వుంటాడు. అయితే కాలక్రమంలో అతని ఆస్తులు పోతాయి. గుర్రమూ ముసలిదైపోయింది. యిప్పుడు మనిషెవరైనా కనబడితే తప్పించుకుని పారిపోదామనుకుంటున్నాడు సాంబయ్య. అయితే మనిషి కనబడ్డప్పుడల్లా ఆ గుర్రానికి మాత్రం ఆగిపోవడం అలవాటైపోయింది. అది ఆగినప్పుడల్లా దాన్ని తిడుతూ తరమడమొక్కటే యిప్పుడు సాంబయ్య చేయగలిగిన పని.

'కోతిబుద్ధి' అనే కథలో వో గురువుగారి దగ్గరుండే బంగారం తయారు చేసే విద్యను శిష్యుడొకడు నేర్చుకోవాలని వెంటబడతాడు. తన దగ్గర కొంత పాత బంగారముంది గానీ, దాన్ని తయారు చేసే విద్యంటూ ఏదీ లేదని గురువు మొత్తుకున్నా వాడు వినడు. తప్పనిసరి గావడంతో గురువు చివరకో మంత్రాన్ని శిష్యుడికి నేర్పించి రాతి పైన ఆకు పసరు పిండుతూ దాన్ని జపించమంటాడు. అయితే అలా జపిస్తున్నప్పుడు కోతిని మాత్రం తలుచుకోగూడదని, తలచుకుంటే మంత్రం పనిచేయదనీ హెచ్చరిస్తాడు. పాపం, శిష్యుడెంత ప్రయత్నించినా ఆ మంత్రం జపిస్తున్నప్పుడల్లా, కోతి గుర్తుకు వస్తూనే ఉంది మరి!

భారతదేశానికి, చైనాకూ మధ్య 1962లో జరిగిన యుద్ధం భూమికగా సదానంద గారు "బంగారు నడిచిన చోట" అనే నవల రాశారు. పంచతంత్రంలోలాగా అందులోని పాత్రలన్నీ జంతువులే! అడవికి రాజైన సింహంపేరు సర్వమంగళం. వార్తల్ని చేరేసే గ్రద్దపేరు ఆకాశవాణి. జంతువుల్ని తినగూడదని దాంతో సంధికుదుర్చుకున్న మనిషిపేరు బంగారం. అయితే నవల చివరలో సంధి కుదిరిన తర్వాతకూడా బంగారు తుపాకీ నొకదాన్ని దగ్గర పెట్టుకోవడం

మరిచిపోడు. సర్వమంగళం మాట తప్పినప్పుడు దాని అవసరం వస్తుందని అతడి అనుమానం. 'పంచశీల' ఒప్పందం కుదిరిన రోజుల్లో రాసిన ఈ నవల యిప్పటికీ అర్థవంతంగానే వుంటుంది. యీ నవలకు 1966లోనే కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వాళ్లిచ్చే వుత్తమ బాల సాహిత్య బహుమతిని అప్పటి దేశాధ్యక్షుడి దగ్గర నుంచి అందుకున్నాడు సదానంద. 2007లో కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్యానికి కూడా బహుమతులనివ్వడం ప్రారంభించినప్పుడు ఆ అవార్డును తెలుగులో తొలిసారిగా 'అడవి తల్లి' నవలకందుకోవడం చాలా సహజంగా, తగినదిగా జరిగిన పని.

తెలుగులో ఉన్న అతి కొద్దిమంది గొప్ప వ్యంగ్య హాస్య రచయితలలో సదానంద ముఖ్యులు. 1976లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు పొందిన ఆయనా కథల సంపుటం 'నవ్వే పెదవులు - ఏడ్చే కళ్లు'లో రామదాసు చెర, ఇస్ జెండేకే నీచే, తాత దిగిపోయిన బండి వంటి గొప్ప కథలున్నాయి. పొకానొక స్వాతంత్ర్య దినోత్సవం నాడు బడిపిల్లలనంతా ఊరి మధ్యలో ఉండే పోలీసు మైదానంలో సమావేశపరుస్తారు. పిల్లలా ఎండలో ఎలా అవస్త పడుతున్నారో పట్టించుకోకుండా ఊరి ప్రెసిడెంటు, ఆయన వందిమాగధులు కొలువు చేస్తారు. యెండలో నిలువుకాళ్ల వుద్యోగం చేసే బడిపంతుళ్లను పట్టించుకోరు. చివరకు పిల్లలకిచ్చే మిఠాయిల్లో కూడా పెద్ద శాతం వాళ్లకు చేరదు. సమావేశానంతరం పెద్ద బండిలో గాంధీ పఠం పెట్టి వూరేగిస్తారు. మరునాటి ఉదయాన చూసినప్పుడు అదే బండిలో మునిసిపాలిటీ వాళ్లు చెత్త పోగేస్తుంటారు. అంటే ఆ వూరేగంపు కోసమని ఆ బండిని స్వాతంత్ర్య దినోత్సవం నాడు మాత్రం శుభ్రం చేసి వాడుకున్నారన్న మాట! అది చూసి నివ్వెర పోతున్న కథకుడితో మరో పంతులు అశ్చర్య పోతున్నావా సదానందం! మన దేశంలోనే అది యిప్పుడు తాత దిగిపోయిన బండి అంటాడు. అవనిగడ్డ గాంధీ క్షేత్రం మండలి బుద్ధప్రసాద్ గారు తెలుగు కథల్లో గాంధీ దర్శనం ఉన్న కథల్ని సంకలనం చేయించినప్పుడు, ఆ సంకలనానికి సంకలన కర్త 'తాత దిగిపోయిన బండి' అనే పేరు పెట్టారు. (సంకలన కర్త : మధురాంతకం రాజారాం. ప్రచురణ- గాంధీ క్షేత్రం, అవనిగడ్డ).

"రామదాసు చెర"లో ఊరేగింపులో వున్న దేవుడు బియ్యం కొనడం కోసం ఖాళీ సంచితో వెళ్తున్న రామదాసునే మధ్యతరగతి బడుగు జీవివికీ వల్లమాలిన ఫోజు లేందుకు ? బొగ్గు పొడి ఉండగా పేస్టులే కావల్సి వచ్చాయా? నీ ముఖానికీ పౌడర్లు తక్కువా?' అని మందలిస్తాడు. అదే వూరేగింపులో ఎదురైన ధనవంతుల్నీ, రాజకీయ నాయకుల్నీ, బుజ్జగించి మురిసిపోతాడు సినిమా తారతో సల్లాపాలాడుతారు. 'ఇస్ జెండేకే నీచే' కథలోని మధ్యతరగతి వుద్యోగి బట్టలింగడి వాడికి సమయానికి అప్పుకట్టలేక రాజవీధులొదలి పెట్టి సందు గొందుల్లోనే తిరుగుతాడు. 'రంగు రంగుల చీకటి' అనే కథలో వూర్లో థియేటర్‌లో విడుదలైన సినిమాని ప్రచారం చేసే బండిలో మైకు పట్టుకుని ప్రేక్షకుల్ని రకరకాల మాటలతో వూరించి కవ్వించే మనిషొకడుంటాడు. చిత్రమేమిటంటే వాడు పుట్టంధుడు. జీవితం వాణ్ణి వాడు చూడలేని లోకాన్ని వర్ణించి బులిపించే వుద్యోగంలోకి నెట్టేసింది.

సదానంద గారు చిత్తురు జిల్లాలో పాకాల అనే చిన్న బస్తీలో పుట్టి అక్కడే చదివి, ఆ ఊరి బడుల్లోనే వుద్యోగం చేసి అక్కడే పదవీ విరమణ చేసి అక్కడే చివరి వరకూ జీవించి, అ వూర్లోనే చనిపోయాడు. ఆయన తనకు తెలిసిన 'పాకాల'ను మొత్తం భారతదేశానికంతా ప్రతీకగా మలిచేసారు. ఆయన రాసిన 'రక్త యజ్ఞం', 'గందరగోళం', 'గాడిదబ్రతులు', నవలల్లోనూ యిటువంటి హాస్యమూ, వ్యంగ్యమూ, పాతకుల్ని సవాలు చేస్తాయి. గురజాడ 'కన్యాశుల్కం' లో లాగే ఆయన కథల్లోనూ భీభత్స రసమే వుంటుంది.

ఇలా సమకాలీన సమాజంపైన అసహనం, నిరశనా వుండడం వల్లనే సదానంద గారు పాకాల సామాజిక జీవనంలో గూడా మమేకంగా లేదు. యెక్కువగా ఇంటిలోనే కాలం గడిపే అంతర్ముఖత్వమే ఆయన స్వభావం. ఆయన మాట యెప్పుడూ స్పష్టంగానే ఉండేది. ఆయన దృష్టి చాలా నిశితమైంది. ఆయన రాత యెప్పుడూ బలంగానే వుండేది. సమకాలీన సమాజం తాను ఆశించిన తీరులో వుండనప్పుడు, దాన్ని నిరసించడానికీ మరోమార్గం లేకపోయినప్పుడు, రచయిత తన అభిప్రాయాల్ని చెప్పకుండా ఉండలేకపోయినప్పుడు, వ్యంగ్య రచనలు మాత్రమే గత్యంతర మవుతాయనీ విమర్శకులు అంటారు. 'ఓంద్రింతలు' అనే పేరుతో రెండు రశాబ్దాల క్రితం సదానంద గారు రాసిన వ్యంగ్య కథలు యిప్పటి రాజకీయ పరిస్థితులకు కూడా వ్యాఖ్యానాలుగా వుంటాయి.

సదానంద గారు చిత్రకారుడు గూడా! అనేక పుస్తకాలకు ఆయన ముఖచిత్రాలు రూపొందిచాడు. కార్టూన్లు చాలా వేశాడు. అసలే అందమైన తెలుగు లిపి ఆయన దస్తూరీలో మరింత అందంగా ఉండేది. ముప్పయ్యేళ్ల క్రితం ఆయన రాసిన పిల్లల కథను ఆంధ్రప్రభలో ఆయన దస్తూరిలోనే బ్లాకు చేసి ప్రచురించారు.

**నిరుడు కురిసిన హిమసమూహాల్లో సదానంద గారు గూడా ఇప్పుడు కలసిపోయారు. ఆయన రచనలు మాత్రం కాలదోషం పట్టకుండా నిలిచే ఉంటాయి.**





# రాయలసీమ పాటకు ఆహ్వానం

పాట రాయలసీమ నిర్దిష్ట జీవితాన్ని ప్రతిబింబించాలి. పాట ప్రక్రియ లక్షణాలు తప్పనిసరిగా పాటించాలి. ఇరవై పాదాలకు మించకుండా ఉండాలి. ఈ పోటీల కోసమే కొత్తగా రాయాలి. **అక్టోబరు నెల 15వ తేదీలోపు** రాసిన పాటను 9492287602 వాట్సప్ నెంబరుకు పంపాలి. దసరా సందర్భంగా అంతర్జాల వేదికలో ఏర్పాటు చేసే రాయలసీమపాట కార్యక్రమంలో తమ పాట ఎలా పాడాలో రచయితల తెలియచేయవలసి ఉంటుంది.

**వివరాలకు : డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి, రాయలసీమ సాంస్కృతిక వేదిక, 996397187**

అప్పిరెడ్డి హరినాథరెడ్డి
99639 17187

# దోనయామాత్యుని సస్యానందము : సమకాలీనత




**భా**రతీయ సాహిత్యంలో ప్రాచీన కాలం నుండి అనేక శాస్త్ర గ్రంథాలు వెలువడినాయి. శాస్త్రగ్రంథాల కంటే ఎక్కువగా సాహిత్యం, చరిత్ర, మతసంబంధిత గ్రంథాలు వెలువడటం సహజం. ఇతివృత్తం ఏ కాలానిదైనా అప్పటి సమకాలీన సమాజం కూడా వాటిలో ప్రతిబింబిస్తుంది.

ప్రస్తుత సమకాలీన సమాజానికి ఆ రచనలు, లేదా అందులోని అన్ని అంశాలు ఉపయోగపడకపోవచ్చు. అవి ఒక చారిత్రక పరిణామక్రమం అధ్యయనానికి తోడ్పడతాయి. శాస్త్రగ్రంథాల విషయానికి వచ్చినప్పుడు నేటి సమాజానికి తప్పకుండా అవి వినియోగపడతాయి. మనిషి భౌతిక అవసరాలను తీర్చడానికి ఉపయోగపడే విజ్ఞానశాస్త్రం ఏ కాలంలో అయినా ప్రకృతి పరిశీలన, కార్యకారణ సంబంధం, ప్రాథమిక శాస్త్ర నియమాలతో రూపొందుతుంది. ఆ శాస్త్రనియమాలు ఏ తరానికైనా ప్రామాణికంగా నిలుస్తాయి. అందుకే ఒకనాటి భారతీయ శాస్త్ర గ్రంథాలు నేటి సమకాలీన సమాజంలోనూ నిలబడుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో దోనయామాత్యుని "సస్యానందం లేదా వర్షశాస్త్రం" గ్రంథాన్ని గురించి ఇందులో పరిశీలిద్దాం.

దోనయామాత్యుడు గ్రంథ అవతారికలో రాసుకొన్న పద్యాన్ని బట్టి క్రీ.శ 1356 కాలం చెందిన వారని, తల్లిదండ్రులు మాచిరాజు, రుద్రమ్మలుగా తెలుస్తుంది. మరొక పద్యంలో...

*"వసుధలోన బరమ వంశ విభూషణ/ వమైన నన్నుపేంద్రుడాదరింప / శ్రీకరముగ సర్వలోకాశ్రయము జెపి /మిన్నుముట్ట కీర్తిగన్నవాడ"...* అని చెప్పుకున్నాడు. ఉపేంద్ర చక్రవర్తి ఆదరణతో 'సర్వలోకాశ్రయం' అనే గ్రంథం రాసి లోకంలో ప్రసిద్ధి పొందానని తెలియజేసాడు. ఈ ఉపేంద్రుని విషయమై నిడదవోలు వేంకటరావు భారతిలో వంశవృక్షం ప్రకటించారు. ఉపేంద్రుడు తూర్పు చాళుక్య శాఖవాడు. కళింగ సీమలోని ఎలమంచిలి సర్వసిద్ధి మండలంలో పాలన చేశాడు. 1350లలో ఇతను ఉన్నట్లు నిడదవోలువారు నిర్ణయించారు.

సస్యానందం గ్రంథం నాలుగు తాళపత్రాలు, రెండు రాత ప్రతులు సి.పి బ్రౌన్ సేకరించాడు. ఇవికాక ఇంకా జనంలో ఉండే వీలుంది. 1891లో పువ్వాడ సూర్యనారాయణరావు అండ్ బ్రదర్స్ వారు తడకమళ్ళ వేంకటకృష్ణారావు గారిచే పరిష్కరింపచేసి ప్రచురించారు. సంగ శేషాచలశాస్త్రి తాత్పర్యం రాసారు. ఆ తర్వాత 1915, 1921లలో ఇది పునర్ముద్రణ అయింది. 1955లోను ప్రచురణ అయినట్లు ఆరుద్ర గారు పేర్కొన్నారు. 'సస్యానందము - దోనయామాత్యుడు' అనే వ్యాసాన్ని భారతిలో 1946లో జూన్ నెలన నిడదవోలు వేంకటరావు రాసారు. విలువైన అంశాలు అందులో వెలుగు చూశాయి. ఆ తర్వాత కాలంలో చాగంటి శేషయ్య, ఆరుద్రలు తమ గ్రంథాలలో దోనయామాత్యుడికి స్థానం కల్పించారు. 1921 ప్రతి ఆధారంగా ఉన్నం జ్యోతివాసు పరిష్కరణ - విస్తృత పీఠిక రాసారు. 2016లో శ్రీమతి రావి కృష్ణకుమారి, చీరాల వారు ప్రచురించారు. కొత్త చూపుతో జ్యోతివాసు ఇందులో విషయాలను ప్రస్తావించారు.

సస్యానందానికి మరో పేరు వర్ష శాస్త్రం. సస్యాలు అంటే పంటపొలాలు. అవి ఆనందంగా పండాలంటే వానలు కావాలి. వానల గురించి వివరిస్తుంది కాబట్టే వర్షశాస్త్రం అని కూడ ఈ గ్రంథానికి పేరు వచ్చింది. వాన రాకడ ప్రాణం పోకడ చెప్పలేమనే సామెత కూడా ఉంది. వానల రాక గురించి తెలుసుకోవాలసిన అవసరం, ఆసక్తి రైతులకు తప్పని సరి అవుతుంది. జ్యోతిష్య శాస్త్రంలో నిష్ణాతుడయిన దోనయామాత్యుడు ఈ వానల విషయమై రాయలను కొన్నాడు.

*"వానచేత సస్యవర్గంబు వర్ధిల్లు /సస్యవృద్ధి సకల జన సమృద్ధి/ కారణంబు దాన గావున ధరలోన/ వానవలయు నెల్లవారలకును"...* అని అంటాడు.

ఈ గ్రంథం రాయడానికి పూర్వుల గ్రంథాలను, అప్పటికే ప్రజలు అనుసరిస్తున్న పద్ధతులను ఆధారంగా చేసుకొన్నానని వివరిస్తూ.. "అను లోకోక్తులాకర్ణించి గార్గ్య, వరాహమిహిర, లల్లాది, సంహితా సారంబులు గూర్చి ప్రవర్ష వివర్షణంబులు జనులకు బోధ సేయుటకై సస్యానందము జెప్ప నుద్యోగించితిని" అని అంటాడు. తన పూర్వుల కృషిని నిజాయితీగా దోనయామాత్యుడు ప్రకటించాడు.

వేదాంగాలలో జ్యోతిషం ఒకటి. గ్రహగతులు, నక్షత్రాల ఆధారంగా కాలనిర్ణయం చేయడం, ఆయా కాలాల బట్టి మంచి చెడుల ప్రభావాలను జ్యోతిష్యం తెలియచేస్తుంది. జ్యోతిష్యశాస్త్రం ఆధారంగా వర్షాలపై కూడా పూర్వ గ్రంథాలలో అనేక ప్రస్తావనలు ఉన్నాయి. సంస్కృత భాషలో ఉన్న వాటిని తెలుగు భాషలో రైతాంగానికి అర్థమయ్యే విధంగా పద్యగద్యాలలో దోనయామాత్యుడు రాసారు. సస్యానందంలోని పద్యాలు రైతుల నోళ్ళలో వ్యాపించాయి. కేవలం పూర్వ గ్రంథాలలోనివే కాకుండా, లోకంలో అనుసరిస్తున్న ఇతర శాస్త్రీయ పద్దతులను కూడ ఇందులో దోనయామాత్యుడు చేర్చాడు. ప్రకృతి, వాతవరణ పరిస్థితులను పరిశీలించి, ప్రయోగం ద్వారా నిరూపణయైన వాడుకలోని అనుభవాలను కూడా సస్యానందంలో వివరించడం విశేషం.

సస్యానందంను మొత్తం 232 పద్యగద్యాలతో, నాలుగు ప్రధాన అధికారాలుగా విభజించాడు. ఆయా అంశాలబట్టి అంతర్గత విభజన కూడా చేశాడు. సరైన పద్ధతిలో మేఘము కనిపెట్టి, మేఘ గర్భ

ధారణను, గర్భపాతమును, గర్భపాత కారణాలను, గర్భ పరిపక్వ కారణాలు, గర్భము ఫలించు కారణాలు చక్కగా తెలుసుకొని వర్షము కురియుట, కురవకపోవుట చెప్పాలి. నోటికి వచ్చునట్లు తెంపు చేసి చెబితే సభలలో అవమానం పొందుతారు; గౌరవం కోల్పోతారని దోనయామాత్యుడు హెచ్చరిస్తాడు. శాలివాహన శక సంవత్సరాలను ఎనిమిదితో పెంచి వచ్చిన మొత్తాన్ని తొమ్మిదిచేత భాగించగా వచ్చిన శేషము బట్టి ఆయా సంవత్సర మేఘాల నిర్ణయం చేయాలంటాడు. శేషము 1 అయితే ఆవర్తనమేఘము, 2 సంవర్తనమేఘము, 3 పుష్కరమేఘము, 4 ద్రోణమేఘము, 5 కాలమేఘము, 6 నీలమేఘము, 7 కారుమేఘము, 8 గౌనీమేఘము, 9 తమము అని శేషసంఖ్యల ఆధారంగా మేఘనిర్ణయం చేశాడు.

వర్షానికి ఆధారమైన ధాతువులుగా వాన, మంచి ఎండ, మంచి శీతము నలువైపుల వ్యాపించు మేఘము, ఉరుము, మెరుపు, పరివేషము, ఇంద్రధనుస్సు, మంచు, వాయువులను పేర్కొన్నాడు. సూర్యుని వేడికిరణాలు భూమిపై వ్యాపించి జలం ఆవిరి రూపాన పైకి తీసుకెళ్లే కాలాన్ని గర్భకాలము అన్నాడు. ఆ ఆవిరి మరల వర్షంగా మారే కాలాన్ని ప్రసవకాలం అని వివరించాడు. మేఘాలు గర్భం దాల్చి నూటనలుబదియేడవ దినం భూమంతయు కానరా కుండ వర్షిస్తుందని వివరించాడు.

గ్రహాల స్థితిగతులు, రాశుల బట్టి ఆయా మాసాలలో వర్షం పడే విధానాన్ని తెలిపాడు. ఉదాహరణకు... వృశ్చిక రాశియందు సూర్యుడు ఉన్నప్పుడు సూర్యుడు ఉండే రాశికి, రెండు, మూడు, నాలుగు రాసులతో అనగా ధనస్సు, మకర, కుంభమందు శుక్రుడు, బుధుడు, బృహస్పతి చంద్రుడు అనే ఈ నాలుగు గ్రహాలు ఉన్నట్లయితే భూమి అంతటా వర్షాలు పడతాయంటాడు.

సూర్యుడు అనూరాధలో ప్రవేశించునపుడు గానీ, మూలా నక్షత్రములో ప్రవేశించునపుడు గాని కొంచమైన వాన పడకపోతే ఆ కార్తె మొదలు పదునాలుగు దినాలు వాన ఉండదంటాడు. సూర్యుడు జేష్ఠ నక్షత్రంలో ప్రవేశించునపుడు మేఘాలు దట్టంగా ఉంటే వర్షం వస్తుందని వివరించాడు. మార్గశిర, స్వాతి, ఆరుద్ర, శతభిషములలో వాన, ఎండ మేఘము, ఉరుము, పరివేషము అనే ధాతువులలో ఏ ఒక్కటి ఆకాశంలో కనిపించినా సస్యసమృద్ధిగా వానలు వస్తాయి.

పుష్యమాసములో మూలా నక్షత్రం మొదలుకొని అమావాస్య వరకు తూర్పుగాలితో కూడిన వాన దట్టంగా వస్తే మొదటి కారు పంటలకు సమృద్ధిగా వానలొస్తాయి. చైత్ర శుద్ధ పూర్ణిమకు లోపల నాలుగు దినములలో వానలు కురిస్తే, ఆ సంవత్సరం రెండవ పంట సమయంలో వానలు తక్కువగా కురుస్తాయి.

వైశాఖంలో ముందుగా పడమటి వైపున మబ్బుపట్టి ఎంత నేల చినుకులు పడతాయో ఆ నేలంతా ఆ సంవత్సరం చక్కగా వానలు పడతాయి. ఈ మాసంలో మబ్బుపట్టి ఉరుము శబ్దం ఎంతవరకు వినిపిస్తుందో అంత దాకా వానలుంటాయని వివరించాడు. ఈ విధంగా ఆయా మాసాలలో వర్షాల స్థితిగతులు క్రమపద్ధతిలో వివరించాడు.

జ్యోతిష్యశాస్త్రం ప్రకారమే కాకుండా ప్రకృతి పరిశీలన, వాతావరణ మార్పులు, జీవరాశుల ప్రతిస్పందనలబట్టి కూడా శాస్త్రీయంగా వానల గురించి సస్యానందంలో నమోదుచేశాడు.

సంవత్సర కాలంలో మొత్తంగా వానల పరిస్థితిని అంచనా వేసేందుకు నాగలికి దూది పెట్టి వర్ష రాకలను అంచనా వేసే తులాపరీక్ష పద్ధతిని వివరించాడు.

పుష్యశుద్ధ పూర్ణిమ నాటి ప్రదోష సమయంలో పలిమెడు దూది నాగలికి తగిలించి ఏ అడ్డు లేకుండా బయలులో ఉంచాలి. మరునాడు ఉదయం ఆ దూది పిండాలి. ధారగా నీళ్ళు వస్తే మరుసటి సంవత్సరం వానలు సమృద్ధిగా పడతాయి. కొన్ని బిందువులే దూది నుండి వస్తే మధ్యరకంగా వానలొస్తాయి. దూది మంచునీటితో కనీసం తడవకపోతే వానలు కురియవు అని పేర్కొన్నాడు. ఒక ప్రయోగం ద్వారా ఇలా శాస్త్రీయంగా ఇలా ఆరోజులలో ఒక అంచనాకు రావడం విశేషం.

మెట్టకప్పలు కూసినపుడు, జంతువులు నీళ్ళలోకి దిగినపుడు, చిన్న చిన్న చేపలు ఎగిరినపుడు, తామర పుప్పొడిలో తొండలు పొర్లాడినపుడు పంటలు బాగా పండేలా వానలొస్తాయి. భూనాగాలు మెట్టను విడవకుండా పొర్లాడినపుడు, పశువులు కారణం లేకుండా పుట్టలు, మెట్టల మీదికి ఎక్కినపుడు దట్టంగా వానలొస్తాయి. ఊరి పొలిమేరలలోని పశువులు తోకలెత్తుకొని, అంభారాలు చేస్తూ గ్రామంలోకి ప్రవేశించినపుడు, సంతోషంతో చీమలు ముక్కున గ్రుడ్లు కరచుకొని బారులుతీరి పోతుంటే, సకల దిశల వ్యాపించిన మేఘాలు నడినెత్తిన మెరుములతో ఉంటే, అనేక సార్లు తూర్పుగాలులు భూమిపై వ్యాపిస్తే, ఆకాశంలో గోమూత్రం వంటి కాంతులు దట్టంగా వ్యాపిస్తే తప్పక వానలొస్తాయి.

సూర్యోదయం, సూర్యాస్తమయాలలో కొంచం ముందుగా కుక్కలు మొరుగకున్న ఎడల నష్టం కలిగించని, పైరులకు భంగంలేని వాన వస్తుందని వివరించాడు.

పై వాటిలో జంతువుల వింత ప్రవర్తనలు, అరుపుల వెనుక శాస్త్రీయ అంశాలు దాగి ఉన్నాయి. సునామి వచ్చిన సందర్భంలో కొంత ముందుగానే అనేక తీరప్రాంత జీవరాశుల విచిత్ర ప్రవర్తనను గుర్తించారు. అలాగే భూకంపాలు తదితర సందర్భాలలో తక్కువ స్థాయి తరంగాలను కూడా జీవరాశులు ముందుగా గుర్తిస్తాయని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ గ్రంథంలో వర్షాలకు ముందు జీవరాశుల ప్రవర్తనను దోనయామాత్యుడు నమోదు చేశాడు.

తొలకరి వాననీటి రుచిని బట్టి ఆ సంవత్సరం ఏయే పంటలు పండుతాయో ఇలా వివరిస్తాడు. వగరు, కారంగా ఉంటే కొర్రపైరు, చేదుగా ఉంటే నువ్వులు, తియ్యగా ఉంటే పత్తి, కుసుమలు, చప్పగా ఉంటే మద్దిగడ్డలు, కసురుగా ఉంటే జొన్నలు, గోధుమలు, పుల్లగా ఉంటే వరిగెలు, సజ్జలు, చిట్టిచామలు బాగా పండుతాయి. ఉప్పుగా ఉంటే ఆ సంవత్సరం పంటలు ఎక్కువ తాలు కంకులే అవుతాయని వివరించాడు.

వర్షం రావడానికి వాయువు కీలకం అంటాడు. వాయువు వలనే మేఘములు పుడుతాయి. మేఘాలు విచ్చిపోయి వానలు వస్తాయి. వాయువు వలన ఉరుముల వస్తాయి. సర్వానికి వాయువే కారణం అని వాయు లక్షణాలు వివరించాడు.

ఆషాడశుద్ధ పున్నమి నాడు మొదటి జామున గాలి వీస్తే శ్రావణంలో, రెండవ జామున గాలి వీస్తే భాద్రపద మాసంలో, మూడవ జామున వీస్తే అశ్వయుజమాసంలో, నాలుగోవ జామున

వీస్తే కార్తీకమాసంలో తగినవిధంగా వర్షాలొస్తాయంటాడు.

వాయు ప్రసారం బట్టి వానలను అంచనా వేసే మరో ప్రయోగాన్ని వివరించాడు. ముతకనూలుతో ఎనిమిది మూరల పొడవు, రెండు మూరల వెడల్పు వస్త్రం నేయించాలి. నలభై ఎనిమిది మూరల పొడవున్న కర్రకు ఆ గుడ్డను పతాకంగా కట్టి ఆషాఢ శుద్ధ పూర్ణిమనాడు తెల్లవారుతున్నప్పుడు నిలబెట్టాలి. ఆ వస్త్రం గాలికి తూర్పుకు దిశకు ఊగితే వానలు బాగా పడతాయి. ఆగ్నేయ దిశకు పోతే వానలు పడవు. దక్షిణ, నైరుతి వైపు పోతే మేఘాల పుడతాయే కానీ వానలు ఉండదు. పడమటి దిక్కుకు పోతే అతివృష్టితో పాటు, గాలి ఉంటుంది. వాయువ్యం వైపు పోతే అతివృష్టి, సుడిగాలి ఉంటుంది. ఉత్తరం వైపు పోతే పంటలకు తగినంత వాన ఉంటుంది. ఈశాన్య వైపు పోతే మధ్యరకంగా ఉంటుంది. అన్ని వైపులకు తిరుగుతూ మెలికలు పడుతుంటే పంటలు పండే సమయంలో వానలు దట్టంగా పడి చెడిపోతాయి. లేదా శత్రువులైనా చెడగొడతారని వివరించాడు.

మేఘం పరివేషం లక్షణాలు, ఆకారాలను బట్టి కూడా వర్షాల రాకను వివరించాడు. భారతదేశంలో ఏయే ప్రాంతాలకు ఏయే గ్రహాలు ఆధిపత్యం వహిస్తాయో వివరించాడు.

"చందస్సు విషయంలో కొన్ని క్రొత్త సంగతులు చెప్పినట్లే దోనయామాత్యుడు మన భాషలో ఆనాడు వాడుకొనే కొన్ని మాటలను గురించి కూడా మనకు చెప్పాడు. ఇవి మనకు తరచుగా కనబడని ప్రయోగాలు, మన తిథులలో ద్వాదశి మనకెంతో పుణ్యమైనది. దానికి పారశి అనే పర్యాయపదమున్నట్లు దోనయామాత్యుడు యతి ప్రస్థానంలో వాడినందువల్ల తెలుస్తున్నది" అని ఆరుద్ర పేర్కొన్నారు. ఈ పదంపై జ్యోతివాసు వివరణ తర్వాత చూపుతాను. మేఘాల వర్ణనలో "కాటుక క్రోవులు" ఇంకా రైతులు వాడే "ఓదెలు, ఓరంత ప్రొద్దు, నులిపున్నమ, నొరకొలదులు వంటి పదప్రయోగాలను ఆరుద్ర చూపాడు.

నిఘంటువులకెక్కని పదాలు సస్యానందంలో ఉన్నాయని ఉన్నం జ్యోతివాసు వివరించారు. "తొలుతటి వానలదోయంబు లొగరైన, వట్టన యగునేన కొర్రచేలు"..లో వగరుగా, వట్టిగా పదాలలో వజ్ర నిఘంటువులలో లేదని బ్రౌణ్యం''కారము''గా స్వీకరించిందని చూపుతాడు. "తలివమ్ము ముతకనూలున"లో "తలివమ్ము" పదానికి పరుపు, శయ్య అర్థాలున్నాయి. కానీ ఇక్కడ కంబళి, దుప్పటి అర్థం వస్తుంది. "వెంగలియై సస్యకోటి పెంపడగించున్"లో వెంగలికి అవివేకి, జఢుడు, మూఢుడు అని అర్థాలున్నాయి. కానీ ఇక్కడ కవి "వెనుక" అనే అర్థంలో వాడారు. ఇదే పద్యంలో రెండవ పాదంలో ముంగలి పదం ఉంది. దానికి వ్యతిరేకంగా వెంగలి అని వాడారు. "ప్రతిపద" పదాన్ని పాడ్యమి అర్థంలో ఇందులో వాడటం ఉంది. "ద్వాదశి"కి వికృతి రోదసి, బారసి పదాలున్నాయి. బారసి పదం ఇందులో ప్రయోగించాడు. అచ్చు ప్రతిలో పారశి అని ఉండటంతో ఆరుద్ర గారు కొత్తపదంగా అనుకొన్నారని అది "బారసి" అని ఉన్నం జ్యోతివాసు వివరించాడు.

వస్తుపరంగాను, భాషాపరంగాను దోనయామాత్యుడి సస్యానందం ఎంతో విలువైంది. సమకాలీన సందర్భంలోను ఇది నిలబడుతుంది. ఈ గ్రంథంలో వర్షాల విషయంగా ప్రతిపాదించిన జ్యోతిషశాస్త్ర విషయాలు, అదే విధంగా వర్షాలపై లోకవ్యవహారంలో ఆ రోజులలో చేసిన ప్రయోగాలను నేటి ప్రస్తుత శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో మరింత అధ్యయనం చేసి అందులో ప్రామాణిక అంశాలను నిరూపించి వెలుగులోకి తీసుకొనిరావాలి.

## పదనిష్పాదనకళ

**25 వ పుట తరువాయి.......**

ఆవశ్యకత వారికి లేదు.

కానీ భవిష్యత్తులో అవే సబ్జెక్టుల్ని తెలుగులో చెప్పాల్సివస్తే మాత్రం తెలుగు పదాలు కావాలి. అర్థం కావడం అనేది ఒక కాలాను గతమైన ప్రక్రియ. పుడుతూనే మనకు ఏదీ అర్థం కాదు. అందటికీ అర్థం అవుతాయని చెబుతున్న ఇంగ్లీషు పదాలు కూడా శిక్షణాప్రక్రియలో నేర్చుకున్నవే. పుడుతూనే నేర్చుకున్నవి కావు. మన పదజాల పరిజ్ఞానం వయసుతో పాటు పెఱుగుతూ పోతుంది. ఆ పెఱిగే పదజాలంలో తెలుగు ఎందుకు ఉండకూడదు ? ఇంగ్లీషు పదాల పరిజ్ఞానాన్ని మాత్రమే ఎందుకు పెంచుకోవాలి ? మన వర్ధమాన పదజాలంలో తెలుక్కి ఎందుకు స్థానం ఉండకూడదు ?

కాబట్టి కొత్త తెలుగు పదాలు జనానికి అర్థం కావనే వాదాన్ని మనం అంగీకరిస్తే దాని సారాంశం ఏమౌతుందంటే –

1. తెలుగులో ఏ శాస్త్రానికి సంబంధించీ, ఏ విధమైన సాంకేతిక పదజాలమూ ఉండకూడదు. డు, ము,వు,ల్లాంటివి మాత్రమే ఉండాలి. ఇంగ్లీషుని తెలుగులిపిలో వ్రాస్తే అదే తెలుగు.

2. ఉన్నా అది అందఱికీ అర్థం కాకూడదు. (ఎందుకంటే వాళ్ళకు ఏది అర్థం కావాలో ఏది కాకూడదో మనం ముందే నిర్ణయించేశాం. అంతకు మించి వాళ్ళకు ఇంకేమీ అర్థం కాకూడదు)

3. తెలుగులో సాంకేతిక పదజాలాన్ని ప్రచారం చేయకూడదు (ఎందుకంటే మేము ఇదివఱకే ఒక విధమైన ఇంగ్లీషు పదజాలాన్ని ప్రచారం చేసేశాం. దానికి మీరు అడ్డం రావద్దు)

4.కాబట్టి తెలుగులో సాంకేతిక శాస్త్రాలేవీ వద్దు. అవన్నీ ఇంగ్లీషులోనే ఉండాలి.

5.ఆ విధంగా తెలుగులో సాంకేతికపదాలూ, సాంకేతిక పదాలూ లేకుండా చేస్తాం కనుక తెలుగు పొట్టపోసుకోవడానికి పనికి రాదు. పోనివ్వండి. మాకు ఇంగ్లీషుంది.

6. తెలుగు మనకు పొట్టపోసుకోవడానికి పనికిరాదు కనుక మనం అసలు అది మాట్లాడొద్దు. నష్టమేముంది ?

తరువాయి– వచ్చే సంచికలో

**మాతృభాషకాని భాషలో విద్యాభ్యాసం విద్యార్థి చదువుకు అడ్డంకిగా మారుతుంది – 'యునెస్కో'**

యాత్రాసాహిత్యం

# 'ఆమె లేఖలు'

మూల రచన : జూలియా చార్లోటి
అనువాదం : కీ.శే. పెన్నేపల్లి గోపాలకృష్ణ,
డా. కాళిదాసు పురుషోత్తం
90006 42079

(గత సంచిక తరువాయి...)

### 13వ లేఖ

**"ఈ దేశంలో స్త్రీ పురుషుడికంటే వందరెట్లు హీనం. స్త్రీ అంటే నిర్లక్ష్యం, నిరాదరణ. స్త్రీ విద్య వినాశనమేనని ఇక్కడి ప్రజల నమ్మకం."**

**అ**క్టోబరు 31వ తేది ఉత్తరంలో 'ఆమె' చిన్న సంఘటనను వివరిస్తూ ముగింపుగా పై అభిప్రాయం వెలిబుచ్చుతుంది.

జడ్జిదంపతులు రాజమండ్రిలో నేటివ్ స్కూలు నెలకొల్పాలని అనుకొంటారు. తగిన ఉపాధ్యాయుడి కోసం వెదుకుతున్నారు కూడా. స్కూలు నెలకొల్పుతున్నట్లు నేటివులకు తెలియజేయడం, వారి పిల్లల్ని పంపుతామని మాట తీసుకోడం కూడా మరోవైపు జరుగుతోంది. ఇలా వుండగా శ్రీనివాసరావు అనే కోర్టు ఉద్యోగి (పోస్టాఫీసు హెడ్ రైటర్) జడ్జిగారిని చూడడానికి వచ్చాడు.

పిల్లల్ని స్కూలుకు పిలుచుకొచ్చే బాధ్యత తాను వహిస్తానని అన్నాడు. "ఆడపిల్లల స్కూలు పెడితే పిల్లలు వస్తారా ?" జడ్జిగారు అతన్ని అడిగారు.

'రారండీ! అయినా ఆడపిల్లలకి చదువెందుకండీ!' అని సమాధానమిచ్చాడు. ఈ విషయాన్ని గురించి చాలా సేపు చర్చ సాగింది. కానీ శ్రీనివాసరావు మాత్రం తన అభిప్రాయం మార్చుకోలేదు. స్త్రీలు చదువుకొంటే, అరిష్టం దాపురిస్తుందని, బంధువులకు ఏదో కీడు మూడుతుందనీ, ముఖ్యంగా తల్లికో, తండ్రికో చావు తప్పకపోవచ్చునని అతను కచ్చితంగా అన్నాడు.

"మరి నేను చదువుకొన్నాను గదా, మా అమ్మవాళ్లు నిక్షేపంగా వున్నారే. యూరోపియన్ స్త్రీలందరూ చదువుకొన్నవారే, అయినా అందువల్ల వాళ్ళ చుట్టాలకు ఏ అరిష్టమూ జరగలేదే" అని ఆమె వాదించింది. ఐనా అతను వొప్పుకోలేదు –

"యూరోపియన్లకేం ఫర్వాలేదు, వాళ్లకేం కాదు, ఎటొచ్చీ నేటివులం మాకే ముప్పు" అన్నాడు అతను. అదంతా నిజం కాదని, నేటివులు బాగుపడకుండా చేసేందుకు ఏ పిశాచమో వాళ్ల తలల్లో ఈ ఆలోచన రేపి పెట్టిందని జడ్జిగారు నచ్చజెప్పబోతే –

శ్రీనివాసరావు – "మీరు చెప్పేది నిజమైతే కావచ్చుగానీ, ఆడపిల్లలకు అంత తెలివితేటలు లేవుకదా, వాళ్లకు చదువెట్లా వస్తుందండీ ?" అని ఎదురు ప్రశ్న వేశాడు. స్త్రీలు కుటిలస్వభావులని, అబద్ధాలకోరులని, నీచులని కూడా ఇక్కడి వాళ్లు భావిస్తారంటూ, ఆమె యూరోపియన్ బాలురకు సహాయకులుగా స్త్రీలను నియమించడం ప్రమాదమనే అభిప్రాయం వ్యక్తపరుస్తుంది. ఆడవాళ్లు నమ్మకస్తులుకాదనే అభిప్రాయంతో పిల్లల్ని ఎత్తుకొని తిప్పడానికి మగవాళ్లను నియమించుకొంటున్నారని ఈ సందర్భంలో వ్యాఖ్యానిస్తుంది.

స్కూలు ఏర్పాట్లు, సన్నాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మంచి ఉపాధ్యాయుడు దొరకడం కష్టంగా ఉంది. రాజమండ్రి ప్రాంతాల్లో నేటివ్ క్రైస్తవులు లేరు. హిందువులను (Heathens) నియమించడం జడ్జిదంపతులకు ఇష్టం లేదు. ఆదివారంనాడు అనుకోకుండా ఒక కొత్త వ్యక్తి వచ్చాడు. అతన్ని ఇదివరకెప్పుడూ జడ్జిగారు చూడలేదు. అతన్ని గురించి వాకబుచేయగా, ఏదో కోర్టు వ్యవహారం మీద రాజమండ్రి వచ్చాడని, రెండు రోజులుంటాడని, ఇంగ్లీషు బాగా అర్థం చేసుకోగలడని, దస్తూరి, ఉచ్చారణ బాగుంటాయని తెలిసింది. అతడు చర్చికి రావడాన్ని బట్టి గౌరవస్థుడే ననిపించిందం"టుంది ఆమె. జడ్జిగారు అతనికి జాబు రాశారు, స్కూల్లో ఉపాధ్యాయుడుగా చేరమని.

చివరకు 25 మంది మగ పిల్లలతో స్కూలు ప్రారంభమైనట్లు అదే ఉత్తరంలో నవంబరు 23న రాసింది. స్కూల్లో చేరిన వారంతా పై కులాలవారే. బడికి అస్పృశ్యులను (Pariahs) తీసుకొని రావడం కంటే పై కులాల వారిని తీసుకొని రావడం కష్టం గనక, పైకులాలవారికి చదువు చెప్పడమే మంచిదని, పై కులాలవారు చదువుకోడమే మేలని జడ్జిగారి అభిప్రాయమని ఆమె ఆ ఉత్తరంలో రాస్తుంది. స్కూల్లో తెలుగు బోధించడాని కొక బ్రాహ్మణుడు, ఇంగ్లీషుకి డేవిడ్ గంజాల్వ్స్ (David Gonsalves) అనే మిశ్ర జాతి వ్యక్తి (half cast) కుదిరారు.

ఒక రోజు ఉదయాన్నే ఆమె స్కూలు చూడ్డానికి వెళ్లింది. పొద్దున ఆరు గంటలకే బడికి రావడం ఇక్కడ పిల్లలకు అలవాటు. స్కూల్లో కులాలవారీగా పిల్లలు కూచుంటారు. బ్రాహ్మణ, వైశ్యుల పిల్లలు ఒకచోట, 'మూచీ' (పనివాళ్ల) పిల్లలు మరొక వరస, ముస్లిం బాలురు ఇంకోవరస – ఇట్లా వుంటుంది ఏర్పాటు. వీళ్లందరి వెనక పెద్దవాళ్లు – వాళ్ళు తమాషా చూడ్డానికి వస్తారు. చిక్కంతా వాళ్లతోనే! ఎప్పుడూ మాట్లాడుతుంటారు. అందుకే వాళ్లను పరీక్షలపుడు మాత్రమే బడికి రానివ్వాలని అనుకొన్నారు.

పుస్తకాలు చాలా ఖరీదు కావడం వల్ల కొద్దిగానే తెప్పించారు. స్కూలుకయ్యే మొత్తం ఖర్చును జడ్జిదంపతులు, హామిల్టన్ దంపతులు భరించుకోవాలి. అందువల్ల పిల్లలకు బాగా ఉపకరించే మంచి పుస్తకాలు మాత్రమే కొంటున్నారు. స్పెల్లింగులు నేర్చుకొనే పుస్తకాలు కాకుండా, చదవడానికి కూడా పనికొచ్చే పుస్తకాలు మాత్రమే తెప్పించారు. అక్షరాలు, స్పెల్లింగులు, మొదటి పాఠాలను ఆమె పెద్ద అట్టమీద రాసింది. ఒక అట్టమీద రాస్తే, పిల్లలందరూ నేర్చుకుంటారు. అవి పుస్తకాల్లా ఉపయోగపడుతున్నాయి. స్కూలు గది చుట్టూ ఆమె అలాంటి అట్టలు తగిలించింది. పిల్లలకు మొదటిసారి Psalm CXV. 4–8.ను ఆమె ఎంపిక చేసింది. ఇలాంటి అట్టలు మద్రాసు నుంచి తెప్పించుకోవచ్చు, కానీ వాతావరణం అనుకూలంగా లేనందువల్ల ఓడల రాకపోకలు సక్రమంగా లేవు, రోడ్డు మీద పంపాలంటే ఆలస్యమవుతుంది. అప్పటిదాకా పిల్లలు వేచివుండడం ఆమె కిష్టం లేదు. తన బోధనలతో పిల్లల్ని వెంటనే క్రైస్తవులుగా మార్చెయ్యాలనే ఆశ ఆమెకూ లేదు కానీ, వాళ్లకు తాను "చేయదగింది ఏదో

చెయ్యాల"ని మాత్రం వుంది. ఇలాంటి స్కూలు నడపడం ఒక్కటే తాను చేయగలిగిందని ఆమె అంటుంది. "దేశమంతటా యిటువంటి పాఠశాలలు నెలకొల్పడం ద్వారా వాళ్ల మూఢత్వాన్ని రూపుమాప వచ్చునని నా ప్రగాఢ విశ్వాసం" అని ఆమె రాస్తుంది.

జడ్జిగారు రాజమండ్రిలో ఎంతకాలం వుండగలరో ఆమెకే తెలియదు, ఉద్యోగులలో చాలా మార్పులు జరుగుతున్నాయి గనక, తాము ఆవూళ్లో ఎక్కువ కాలం వుండకపోవచ్చునని అంటూ, ఇప్పుడు వాతావరణం ఎంతో హాయిగా వుందని, అందువల్ల ఇప్పట్లో ఈ వూరువదలి పోవాలనిపించడంలేదని, ఏమైనా వేసవిలోగా ఇక్కడి నుంచి బదిలీ అయితే బాగుంటుందని ఆమె రాస్తుంది. ఉష్ణోగ్రత 84-86 డిగ్రీల మధ్య వుంది. వేసవి వేడికి బాగా వేగిపోవడంతో ఆమె యిక్కడి వాతావరణానికి అలవాటుపడి, ఇప్పటి వాతావరణం ఆహ్లాదకరంగా వున్నట్లు భావిస్తుంది. తెల్లవారు ఝామునైతే 74 డిగ్రీలు వుంటుంది, అప్పుడు ఆ చలిలో 'క్లోక్' ధరించికానీ బయటకు వెళ్లలేనని ఆమె రాస్తుంది. "మా యింటి కిటికీలోంచి కనబడే సుందర దృశ్యం లాంటిది దేశంలో మరెక్కడా వుండదని అందరూ అంటారు. ఇప్పుడిప్పుడే మాతోటను చక్కగా పెంచుకొంటున్నాం. ఇక్కడ అంతా అనుకూలంగా, హాయిగా వుంది" అని ఆమె చెప్తుంది. వారి లాన్‌లో మూడు లేళ్లను పెంచారు. అవి అందంగా వుండి మచ్చికయ్యాయి. కొన్ని అందమైన అడవి నెమళ్లను కూడా ఆమె పెంచుతోంది.

రాత్రి వేటగాడు ఒక చిరుతపులిని చంపి తెచ్చాడు. అంత అందమైన జంతువును నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపినందుకు మాకు విచారం కలిగింది. అవి పశువుల్ని చంపుతాయి గనక వాటిని వేటాడి తెచ్చిన వారికి ప్రభుత్వం బహుమతి నిస్తుంది. వాటి చర్మాన్ని కలెక్టరు తీసుకుంటాడు. "ఈ చిరుతపులి మా ప్రాంతంలో దొరికింది గనక, దాని చర్మాన్ని నాకు యివ్వమని అడగాలనుకుంటున్నాను'' అంటుందామె.

"శీతాకాలం రాత్రులు జడ్జిగారి తోటలోకి తరచు నక్కలు, తోడేళ్లు వచ్చి అరుస్తూంటాయి. ఆ అరుపులు ఎవరో దీనంగా రోదిస్తున్నట్లు భయంకరంగా వుంటుంది. పిల్లి పసిబిడ్డను ఎత్తుకుపోయిందని ఎవరో చెప్పారు. చాలా భయపడ్డాను. తీరా విచారిస్తే పావురం పిల్లను ఎత్తుకొని పోయినట్లు తెలిసింది. బాతులు చాలా గుడ్లు పెట్టాయి. వాటిని పొదిగించమని జడ్జిగారు చెప్పారు (You must make little ducks). అందుకు బట్లరు "Sir, I shall do" అని జవాబు చెప్తే నాకు నవ్వాగింది కాదు." బట్లరు కోడిని పట్టుకొచ్చి గుడ్లతో బుట్టలో మూతవేసి పెట్టి కాసేపటికి నాలుగు పిల్లల్ని పొదిగినట్లు చెప్పేసరికి ఆమె ఆశ్చర్యపోయింది.

మద్రాసు మునీ నుంచి ఆమెకు జాబు వచ్చింది. తల్లీ బిడ్డల యోగక్షేమాలు విచారిస్తూ"the concern I have for your happiness as my matron, your state of health, and the state of my rising matron, your child"అని రాశాడు. అంటే Patronను స్త్రీ వాచకంగా అతడు భావించి నట్లున్నాడని ఆమె పరిహాసంగా రాస్తుంది.

ఆ దారంట వెళ్లే విదేశీయులకు ఆతిథ్యం యిచ్చిన చిన్న సంఘటనను ఆమె ఈ వుత్తరంలో పేర్కొన్నది –

ఒక సాయంకాలం హామిల్టన్ దంపతులు, మరికొంతమంది మిత్రులు ఆమె యింట్లో కూర్చొని కబుర్లు చెప్పుకొంటుంటే, కలెక్టరు సిఫారసుతో M.d. Arzel అనే ఫ్రెంచి వ్యాపార సంస్థల ప్రతినిధి వచ్చాడు. అతనికి ఇంగ్లీషు ఒక్కమాట రాదు, అక్కడున్న వారికి ఫ్రెంచి అస్సలు రాదు. ఐనా ఎవరి భాషల్లో వారు మాట్లాడారు. ఇంగ్లీషు తెలియక పోయినా, స్థానిక భాషలు బొత్తిగా రాకపోయినా, అతను మూగ సైగలతోనే మద్రాసు నుంచి 400 మైళ్లు ప్రయాణించడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. మరో రోజున ఖజానా మోసుకొచ్చే సిపాయిలపై అధికారి – పదిహేడేళ్ల (జూనియర్ ర్యాంక్ కమాండెంట్ ఆఫీసరు) యువకుడు గుర్రం మీద వచ్చాడు. అతను తన గుర్రాన్ని మనిషిలాగా భావిస్తూ దానితో మాట్లాడేవాడు. ఊరి పొలిమేరల్లో కొన్ని అడవి గుర్రాలు దాని మీద పడ్డాయి. "అప్పుడు దాని మీది జీను (bridle)ను తీసేసి నా పోనీని వాటిపైకి వదిలాను. అక్కడి వాళ్లు వాటిని విడదీయకుండా వుండి వుంటే నా పోనీటి అంతు తేల్చుకొని వుండేది. మావాడు అసాధ్యుడండీ!" అన్నాడతను. ఇక్కడ గుర్రాలను, కుక్కలను మేలురకం, తక్కువరకం అంటూ రెండుగా విభజిస్తారని, అరబ్ అశ్వాలను మేలురకంవిగా, స్థానికజాతి గుర్రాలను తక్కువరకంవిగా అంటారని ఆమె రాస్తుంది. ఆమె వద్ద మేలురకం అశ్వం వుంది.

దానికి చాలా పొగరు. చుట్టుపక్కల పోనీ కనిపించినా సహించలేదు. అందుకని దానికాపరి ఎప్పుడూ దాని ముందు పరుగెత్తుతూ ఎదురుగా ఎక్కడా పోనీలు తారసపడకుండా చూస్తాడని ఆమె చెప్తుంది.

(తరువాయి వచ్చే సంచికలో...)


## శ్రీమతి శివేగారి దేవమ్మ స్మారక పురస్కారం

2020లో ముద్రితమైన కవితా, కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము మూడేసి ప్రతులను డిసెంబర్ 31.12.2020లోపు పంపవలేను.

బహుమతి పొందిన కథల సంపుటానికి రూ. 7,000, కవితా సంపుటానికి రూ.7,000 నగదుతో సభలో పురస్కార ప్రధానం జరుగును. మీ ప్రతులు మాకు పంపవలెను.

మా చిరునామా: శివేగారి, కాలవపల్లి, ఎం.పీ కొటూరు (పోస్ట్) పలమనేరు (మండలం)
చిత్తూరు (జిల్లా) పిన్ కోడ్: 517408 సెల్:6300318230

అవార్డు వ్యవస్థాపకులు: శివేగారి వివరాలకు: 6300318230

ప్రథమిక హక్కుల కాపరి

పెండ్యాల సత్యనారాయణ
98664 42034

# చరితార్థుడు స్వామీ కేశవానంద భారతి



**ఆయన ఒక సన్యాసి. సర్వసంగ పరిత్యాగి. తన కోసం ఏదీ కోరుకోడు. తన గురించి ఆలోచించడు. ఆయన ఆలోచించేది తాను నమ్మిన సిద్ధాంతం గురించి, ఆ సిద్ధాంతాన్ని విశ్వసించే ప్రజలను గురించి. ఒక చిన్న ఆశ్రమమే ఆయన నివాసం. అయితేనేం, కొన్ని ప్రత్యేక పరిస్థితులలో, భారత రాజ్యాంగంలో పొందుపరచబడ్డ ప్రాథమిక హక్కులను సంబంధిత ప్రజా ప్రభుత్వమే హరించివేయటాన్ని సహించలేని ఆ సన్యాసి, ప్రభుత్వంపైనే యుద్ధాన్ని ప్రకటించాడు. ప్రాథమిక హక్కుల సంరక్షకుడిగా భారత రాజ్యాంగ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. చరితార్థుడైనాడు. ఆయనే, సెప్టెంబరు ఆరవ తేదీన తుది ఊపిరి విడిచిన స్వామీ కేశవానంద భారతి.**

కేరళలోని ఎడనీర్ మఠానికి అధిపతి కేశవానంద భారతి. భూసంస్కరణలలో భాగంగా, ఎడనీర్ మఠానికి చెందిన ఆస్తులను అప్పటి కేరళ రాష్ట్ర ప్రభుత్వం జాతీయం చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ, కేశవానంద భారతి, కేరళ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆ అప్పీలులో స్వామీజీకి పాక్షికంగానే ఉపశమనం లభించటంతో, సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది నానీ ఫాల్కీవాలా, ఆ అప్పీలును దాఖలు చేశారు. ఆ క్రమంలో ఫాల్కీవాలా ఒక సాహసం చేశారు. అప్పటికే ఇందిరాగాంధీ ప్రభుత్వం, ప్రాథమిక హక్కులకు కోత పెడుతూ, పార్లమెంటు చేసే రాజ్యాంగ సవరణలపై సుప్రీంకోర్టు సమీక్ష జరిపే అవకాశంలేని విధంగా రాజ్యాంగంలోని 24, 25, 26, 29 అధికరణాలను సవరించింది. ఆ సవరణల ద్వారా పార్లమెంటుకు పూర్తి అధికారాలు సంక్రమించబడ్డాయి. ఈ పరిస్థితిని ఫాల్కీవాలా జీర్ణించుకోలేకపోయారు. కేరళ భూసంస్కరణల చట్టాన్ని, ప్రాథమిక హక్కులతో ముడిపెట్టారు. కేరళ భూసంస్కరణల చట్టంతోబాటు, 24, 25, 26, 29 రాజ్యాంగ సవరణలను కూడా ప్రశ్నిస్తూ కేశవానంద భారతి తరపున అప్పీలు దాఖలు చేశారు ఫాల్కీవాలా.

**కేశవానంద భారతి తరపున దాఖలైన ఈ అప్పీలును విచారించి, రాజ్యాంగ ధర్మసంకటాన్ని తీర్చటానికి 13 మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. సుప్రీంకోర్టు చరిత్రలో ఇంత పెద్ద ధర్మాసనం అంతకు పూర్వంగాని, ఆ తర్వాతగాని ఇప్పటివరకు ఏర్పడలేదు. ప్రాథమిక హక్కులు, భారత రాజ్యాంగ మౌలిక స్వరూపం, పార్లమెంటుకు గల రాజ్యాంగ సవరణాధికారం, ఆ క్రమంలో సాధారణ సవరణలకు, ప్రాథమిక హక్కులకు సంబంధించిన రాజ్యాంగ సవరణలకు మధ్యగల తేడా, పార్లమెంటు చేసే రాజ్యాంగ సవరణలను సుప్రీంకోర్టు సమీక్షించవచ్చా, సుప్రీంకోర్టుకుగల న్యాయసమీక్షాధికార పరిమితులు తదితర ఎన్నో అంశాలపై ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది. చివరకు 703 పేజీలతో సమగ్రమైన తీర్పును వెలువరించింది. (కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ, ఏఐఆర్ 1973, సుప్రీంకోర్టు, పేజీ 1461).**

అయితే ఎవరూ ఊహించని విధంగా సుప్రీంకోర్టు ధర్మాసనం అటూ ఇటూకాని ఒక విచిత్రమైన తీర్పును వెలువరించింది. సరి క్రొత్త గందరగోళానికి తెరతీసింది. ఆ క్రమంలో ధర్మాసనంలోని న్యాయమూర్తులు రెండు సగాలుగా చీలిపోయారు. హెగ్డే, జగన్మోహన రెడ్డి, ముఖర్జీ, సిక్రి, గ్రోవర్, షెలలు (ఆరుగురు న్యాయమూర్తులు), రాజ్యాంగ సవరణలపై పార్లమెంటుకు గల అధికారాలపై రాజ్యాంగంలోనే అంతర్లీనంగా పరిమితులున్నాయని, అందువలన రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని మార్చే విధంగా రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు లేదని అభిప్రాయపడ్డారు. అయితే, చంద్రచూడ్, బేగ్, మాథ్యూ, ఎ.ఎన్.రే. ద్వివేది, పాలేకర్లు (ఆరుగురు న్యాయమూర్తులు) మాత్రం, రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు పూర్తిగా ఉన్నదని అభిప్రాయపడ్డారు. చివరగా, మిగిలిన పదమూడవ న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా అభిప్రాయం నిర్ణయాత్మకంగా మారింది.

చాలా అంశాలపై గోడ మీది పిల్లివాటంలాగా ఊగిసలాడిన ఖన్నా, చివరకు, రాజ్యాంగాన్ని సవరించే సంపూర్ణాధికారం పార్లమెంటుకు ఉన్నదంటూనే, ఆ పేరుతో రాజ్యాంగాన్ని విధ్వంసం చేసే విధంగా రాజ్యాంగాన్ని సవరించరాదంటూ, హెగ్డే తదితరులతో ఏకీభవించారు. దీనితో, 7-6 తేడాతో కేశవానంద భారతి కేసులో తీర్పు వెలువడింది. పర్యవసానంగా, రాజ్యాంగ మౌలిక స్వభావానికి విరుద్ధం కాని విధంగా, ప్రాథమిక హక్కులకు సంబంధించిన అధికరణాలతో సహా రాజ్యాంగంలోని ఏ అధికరణాన్ని అయినా సవరించే అధికారం పార్లమెంటుకు ఉంటుందన్న వాదనకు ఆమోదముద్ర వేయ బడింది.

కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన చరిత్రాత్మక తీర్పు సారాంశం ఏమిటంటే, రాజ్యాంగం ఉన్నతమైనది. అందువలన రాజ్యాంగం యొక్క మౌలిక లక్ష్యాలకు విరుద్ధంగా రాజ్యాంగాన్ని సవరించరాదు. ఆ విధంగా సవరించినట్లయితే, అటువంటి రాజ్యాంగ సవరణలపై ఉన్నత న్యాయస్థానం న్యాయ సమీక్ష చేయవచ్చు. ప్రాథమికహక్కులు అనేవి ఒకరు ఇచ్చేవి కావు. రాజ్యాంగం యొక్క మౌలిక లక్ష్యంలో ప్రాథమికహక్కులు అంతర్భాగం. ఈ విధంగా ప్రాథమికహక్కులకు ఒక విధమైన రాజ్యాంగ భద్రతను కల్పించిన వ్యక్తి కేశవానంద భారతి. నిజానికి ఈ తీర్పువలన కేశవానంద భారతికిగాని, ఆయన మఠానికి గాని

ప్రత్యేకంగా ఒరిగింది ఏమీ లేదు. కానీ ఈ తీర్పు ద్వారా పరోక్షంగా, ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణకు దోహదపడ్డ మహనీయుడు కేశవానంద భారతి.

ఈ నేపథ్యంలో ప్రాథమిక హక్కులు, పార్లమెంటుకుగల రాజ్యాంగ సవరణాధికారాలు, ఉన్నత న్యాయస్థానానికి గల న్యాయ సమీక్షాధికారం గురించి సంక్షిప్తంగానైనా తెలుసుకోవటం అవసరం. ఎందుకంటే, ఈ రగడ కేశవానంద భారతితో మొదలు కాలేదు, కేశవానంద భారతితో ముగిసిపోలేదు. రావణ కాష్టంలా 1951 నుండి (రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటినుండి) ఇప్పటిదాకా కాలుతూనే ఉన్నది, ఇక ముందూ కాలుతూనే ఉంటుంది.

భారత రాజ్యాంగంలోని మూడవ విభాగంలో ప్రాథమిక హక్కులు పొందుపరచబడ్డాయి. ఐక్యరాజ్య సమితిచే ఆమోదించబడ్డ మానవహక్కులే మన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులని భావించుకోవచ్చు. మానవుని పరిపూర్ణ వ్యక్తిత్వానికి ప్రతిరూపమే మానవహక్కులు. జీవించే హక్కు, భావప్రకటనా హక్కు మొదలైనవన్నీ మానవ హక్కులే. ఈ మానవహక్కులు ఎవరో ఇచ్చేవి కావు. ప్రకృతి పరంగా సహజసిద్ధమైనవి. అందువలన ఇటువంటి హక్కులను ఎవరో ఇవ్వటం, హరించివేయటం అనేది అసంబద్ధం. ఈ మానవ హక్కులకు ప్రభుత్వాలు సంరక్షకులు మాత్రమే. ఈ మానవ హక్కులను సంరక్షించి, ప్రజలందరూ అనుభవించే అవకాశాన్ని, పరిస్థితులను కల్పించటమే ప్రభుత్వాల విధి, బాధ్యత. ఈ సూత్రీకరణ పైనే మానవ హక్కుల సిద్ధాంతం ఆవిష్కరింప బడింది. ఇవన్నీ, నీతి సూత్రాలలాగానే వినటానికి బాగానే ఉంటాయి. కానీ, ప్రపంచంలో ఎక్కడా ఈ సూత్రం ఆచరణలో లేదు. ప్రపంచ వ్యాపితంగా అన్ని దేశాలలో, అన్ని ప్రభుత్వాలూ మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. ఇది గతం, వర్తమానం, భవిష్యత్తు కూడా. ఇది ఒక పెద్ద వివాదాస్పదమైన అంశం. అందువలన ఆ అంశాన్ని ప్రక్కకుబెట్టి, మన దేశంలో ప్రాథమికహక్కులపై కేశవానంద భారతి తీర్పు ప్రభావాన్ని, పర్యవసానాన్ని విశ్లేషించుకుందాం.

ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా, నిజానికి కేశవానంద భారతి కేసులో తీర్పు ద్వారా పార్లమెంటుదే సర్వాధికారం అన్నది నిర్ధారణ అయింది.

కానీ, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన రాజ్యాంగ సవరణలపై న్యాయసమీక్ష చేసే అధికారం ఉన్నతన్యాయస్థానాలకు ఉంటుందన్న అంశాన్ని మాత్రం పెట్టుబడిదారీ అనుకూల రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు జీర్ణించుకోలేక పోయాయి.

అసలు ప్రాథమిక హక్కులపై ఇంత రగడ ఎందుకు? ఎందుకంటే, ప్రాథమిక హక్కులపట్ల రాజ్యాంగ నిర్మాతలకే గౌరవం లేదు, నమ్మకం లేదు, విశ్వాసం లేదు. రాజ్యాంగ నిర్మాతలు, రాజ్యాంగాన్ని రచించిన వారంతా భారతదేశంలో అత్యల్ప శాతంగా ఉన్న ధనికవర్గానికి, దోపిడీ వర్గానికి ప్రతినిధులే, ఆ వర్గానికి సంబంధించినవారే. అందువలన దేశంలో అత్యధిక శాతంగా ఉన్న కార్మికులకు, కర్షకులకు, పేదలకు, బడుగు, బలహీన వర్గాల వారికి ప్రాథమిక హక్కులను కల్పించటం రాజ్యాంగ నిర్మాతలకు ఇష్టం లేదు.

కానీ ఆ విషయం బహిరంగంగా చెబితే, ఇబ్బంది కనుక, ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో పొందు పరుస్తూనే, హేతుబద్ధమైన పరిమితులు, ఆంక్షలు పేరుతో ప్రాథమిక హక్కులకు సంకెళ్ళు వేశారు. ఇది ఒక రకంగా ఒక చేత్తో ఇచ్చి, మరొక చేత్తో వెనుకకు తీసుకోవటంగా ఉంటుంది. నిశితంగా పరిశీలిస్తే అసలు భారత రాజ్యాంగంలోని ప్రజాస్వామ్యం అనేదే అంతా ఒక మాయ, కనికట్టు. ఈ అభిప్రాయంతో చాలామంది పాఠకులు విభేదించవచ్చు.

కానీ ఇది వాస్తవం. ఒక చిన్న ఉదాహరణ. వయోజన ఓటు హక్కు అంటూ, 21 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కును కల్పించింది మన రాజ్యాంగం. 1951 నాటికి భారత దేశంలో ఎక్కువ శాతం ప్రజలు అజ్ఞానులు, నిరక్షరాశ్యులు. రాజకీయ పరిణత శూన్యం. (ఇప్పటికీ మన దేశంలో నిరక్షరాశ్యుల సంఖ్య కొన్ని కోట్లలో ఉన్నది). అటువంటి ప్రజలు తమ ఓటు హక్కును సక్రమంగా ఎలా వినియోగించగలరు? ఆ హక్కును సక్రమంగా వినియోగించలేకపోయినప్పుడు ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. ప్రజాస్వామ్యంపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఈ వాస్తవం రాజ్యాంగ నిర్మాతలకు తెలియదా. తెలుసు. అయినా తెలిసి ఈ విధమైన ఓటు హక్కును ఎందుకు కల్పించారు? నిజాయితీతో ఆలోచిస్తే సమాధానం సులభంగానే దొరుకుతుంది. ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఒక మాయ. కనికట్టు. ఉన్నది లేనట్లుగా భ్రమింపచేయటం. రాజ్యాంగ నిర్మాతలు కోరుకున్నది ఇదే.

ఇక్కడ మరొక దేవ రహస్యం కూడా ఉన్నది. అక్షరాశ్యత వేరు, రాజకీయ పరిణతవేరు. ఇప్పటికీ అక్షరాశ్యులు, ఉన్నత విద్యావంతులలో ఎంత మందికి స్పష్టమైన రాజకీయ అవగాహన ఉన్నది? ఓటు వేస్తున్న ఉన్నత విద్యావంతుల వద్దకు వెళ్ళి, వివిధ రాజకీయ పార్టీల సిద్ధాంతాలను గురించి వారికున్న అవగాహనను చెప్పమనండి. చెప్పరు, చేప్పలేరు. ఎందుకంటే ఆ విషయంలో వారికి రాజకీయ పరిణత శూన్యం కనుక. అందుకే ఇటువంటి ప్రయత్నాన్ని ఏ ప్రసార మాధ్యమాలూ ఇప్పటివరకు చేయలేదు, ఇక ముందూ చేయవు. ఎందుకంటే ఆ విధంగా చేస్తే, అసలు బండారం బయట పడుతుంది. నడువలేని స్థితిలో ఉన్న వయో వృద్ధులు, ఎవరి సహాయంతోనో పోలింగ్ బూత్ వద్దకు ఓటు వేయుటానికి వస్తారు. ఇది మన దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లిందనటానికి నిదర్శనమంటూ ప్రసార మాధ్యమాలు శ్లాఘిస్తాయి. ఆ వయో వృద్ధుడి క్లిప్పింగును టీవీ ఛానళ్ళు మళ్ళీ మళ్ళీ ప్రదర్శిస్తుంటాయి. అంతే తప్ప, ఏ విలేఖరీ ఆ వృద్ధుడి వద్దకు వెళ్ళి, తాతా, ఈ దేశంలో ఎన్ని రాజకీయ పార్టీలు ఉన్నాయి, వాటి సిద్ధాంతాలను గురించి నీకు తెలుసా అని ప్రశ్నించవు. ఎందుకని? ప్రశ్నిస్తే, అసలు బండారం బయట పడుతుంది. ఇక నిరక్షరాశ్యుల మాట చెప్పేదేముంది. (భారత రాజ్యాంగ నిర్మాతలను గురించి, వయోజన ఓటు హక్కు గురించి, భారతదేశంలో ప్రజాస్వామ్యం గురించి నేను వ్యక్తీకరించిన అభిప్రాయాలతో కొందరు పాఠకులు ఏకీభవించకపోవచ్చు. అయితే, ఓటర్లలో రాజకీయ పరిణత ఉండి, సరైన రాజకీయ అవగాహనతో ఓటు హక్కును వినియోగించినట్లయితే, మన దేశంలో ప్రజాస్వామ్యం ఇటువంటి దయనీయ స్థితిలో ఉండేది కాదని, రౌడీలు, గూండాలు,

బడా పారిశ్రామిక వేత్తలు, ఆర్థిక నేరగాళ్ళు, మానభంగం, హత్య తదితర నేరాలకు పాల్పడ్డ నేరస్తులు చట్ట సభలకు ఎన్నికయ్యే దుస్థితి దాపురించేది కాదన్న వాస్తవంతో పాఠకులు ఏకీభవిస్తారన్న నమ్మకం నాకున్నది).

ఈ దేశంలో ప్రజాస్వామ్యం మాయ అయినప్పటికి, ఆ రహస్యం బయటకు కనిపించకుండా చేసే ప్రయత్నంలో భాగమే రాజ్యాంగం మూడవ విభాగంలోని ప్రాథమికహక్కులు. అదే క్రమంలో ప్రాథమికహక్కులకు విరుద్ధమైన చట్టాలపై న్యాయసమీక్ష జరిపే అధికారాన్ని న్యాయస్థానాలకు సంక్రమింపచేయటం జరిగింది. ఈ అంశానికి సంబంధించి. రాజ్యాంగ నిర్మాతల ఆలోచన ఏవిధంగా ఉన్నప్పటికి, ఆచరణలో, ఈ ఏర్పాటు, పాలక వర్గాలకు తలనొప్పిగా మారింది. ప్రాథమిక హక్కులను కాలరాస్తూ ప్రభుత్వాలు తీసుకున్న అనేక చర్యలు, చట్టాలకు న్యాయస్థానాల నుండి ఎదురు దెబ్బలు తగలటం ప్రారంభం అయింది. ఈ పరిస్థితిని జీర్ణించుకోలేని పాలకవర్గాలు, న్యాయస్థానాలకున్న న్యాయ సమీక్షాధికారాలను కుదించివేయటానికి, హరించివేయటానికి ప్రయత్నాలు చేయటం ప్రారంభించాయి. ప్రజాతంత్ర వాదులు ఇందుకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ పోరాటంలో ఒక భాగమే, కేశవానంద భారతి కేసు.

**న్యాయ సమీక్షాధికారానికి సంబంధించి, న్యాయవ్యవస్థకు, పాలక వర్గాలకు (ప్రభుత్వానికి) మధ్య పోరాటం నిజానికి 1950లోనే ప్రముఖ పార్లమెంటేరియన్, కమ్యునిస్టు పార్టీకి చెందిన ఎ.కె. గోపాలన్ అక్రమ నిర్బంధంతోనే ప్రారంభం అయింది.** ప్రాథమిక హక్కులను హరించే విధంగా చట్టాలను చేసే అధికారం పార్లమెంటుకు లేదని ఆ కేసులో సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. వెంటనే ప్రభుత్వం, రాజ్యాంగాన్ని సవరించింది. తొమ్మిదవ షెడ్యూలును అదనంగా చేర్చటం జరిగింది. తొమ్మిదవ షెడ్యూలులో చేర్చబడిన చట్టాలపై న్యాయస్థానాలకు న్యాయసమీక్షాధికారం లేకుండా చేయబడింది. ఈ రాజ్యాంగసవరణ యొక్క ఔచిత్యాన్ని ప్రశ్నించటం జరిగింది. శంకరీప్రసాద్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ, రాజ్యాంగాన్ని సవరించే సంపూర్ణాధికారం పార్లమెంటుకు ఉన్నదన్న సుప్రీం కోర్టు, గతంలో, ఎ.కె. గోపాలన్ కేసులో ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. మరికొంత కాలం గడిచింది. 17వ రాజ్యాంగ సవరణ ద్వారా మరికొన్ని శాసనాలను తొమ్మిదవ షెడ్యూలులో చేర్చటం వివాదగ్రస్తం అయింది. సుప్రీం కోర్టు మళ్ళీ జోక్యం చేసుకున్నది. ప్రాథమిక హక్కులను హరించే విధంగా చట్టాలను చేసే అధికారంగాని, రాజ్యాంగాన్ని సవరించే అధికారంగాని పార్లమెంటుకు లేదన్నది సుప్రీం కోర్టు. (గోలక్‌నాథ్ కేసు, 1971). దీనితో పాలకవర్గాలు ఖంగుతిన్నాయి. **24వ రాజ్యాంగ సవరణ ద్వారా సుప్రీంకోర్టుకుగల న్యాయ సమీక్షాధికారాలను కుదించటం జరిగింది. ఈ 24వ రాజ్యాంగ సవరణను వ్యతిరేకిస్తూ దాఖలు చేయబడిన కేసే కేశవానంద భారతి కేసు. రాజ్యాంగం యొక్క మౌలిక లక్ష్యాలకు విరుద్ధంగా చట్టాలను రూపొందించే హక్కు పాలక వర్గాలకు లేదన్న సుప్రీం కోర్టు, ఒక రకంగా పాలక వర్గాల నిరంకుశాధికారాలను పరిమితం చేసింది.**

ఈ తీర్పుతో ఇందిరాగాంధీ, న్యాయవ్యవస్థపై తీవ్రంగా మండి పడింది. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని తెరపైకి తీసుకువచ్చిన ఆరుగురు న్యాయమూర్తులలో ఒకరైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన సిక్రీ, ఆ తీర్పు వెలువడిన మర్నాడే పదవీ విరమణ చేశారు. క్రొత్త ప్రధాన న్యాయమూర్తి నియామకంలో అప్పటి వరకు సంప్రదాయంగా వస్తున్న సీనియారిటీ సంప్రదాయాన్ని కాదని, తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన ఏ.ఎన్.రే ను సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిగా నియమించింది ఇందిరాగాంధి. ఇందుకు నిరసనగా ఏ.ఎన్.రే ఖన్నా సీనియర్లయిన న్యాయ మూర్తులు షెలాత్, హెగ్డే, గ్రోవర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. ఇందిరాగాంధీ అంతటితో శాంతించలేదు. రాజ్యాంగాన్ని మరింతగా సవరించింది. ప్రాథమిక హక్కులకు, న్యాయస్థానాల న్యాయసమీక్షాధికారానికి వ్యతిరేకంగా అనేక రాజ్యాంగ సవరణలు జరిగాయి. వాటిలో 1977లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ ముఖ్యమైనది. రాజ్యాంగంలోని చాలా అధికరణాలు ఆ సవరణ ద్వారా సవరించబడ్డాయి. (సుప్రీం కోర్టుకుగల న్యాయ సమీక్షాధికారాలకు కత్తెరవేస్తూ 368 అధికరణంలో (4), (5) క్లాజులను అదనంగా చేర్చటం, ఆ రాజ్యాంగ సవరణలలో అతి ముఖ్యమైనది). ఇది జరిగిన కొద్ది కాలానికే, రాయబరేల్లీ నుంచి ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదంటూ తీర్పురావటం, ఎమర్జెన్సీ విధింపు, తదనంతర ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవటం, జనతాపార్టీ అధికారంలోకి రావటం, ఇందిరాగాంధీ కాలంలో తీసుకువచ్చిన అనేక రాజ్యాంగ సవరణలను, 44వ రాజ్యాంగ సవరణ ద్వారా రద్దు చేయటం తదితర పరిణామాలు సంభవించాయి.

కానీ విచిత్రం ఏమిటంటే, ఇందిరాగాంధీ పరిపాలనా కాలంలో జరిగిన చాలా రాజ్యాంగ సవరణలను రద్దు చేసిన జనతాపార్టీ ప్రభుత్వం, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా, సుప్రీం కోర్టుకుగల న్యాయసమీక్షాధికారాలకు కత్తెరవేస్తూ, 368 అధికరణంలో అదనంగా చేర్చబడ్డ (4), (5) క్లాజులను మాత్రం తొలగించలేదు. అంటే న్యాయవ్యవస్థకు ఉన్న న్యాయసమీక్షాధికారాలను తొలగించటంలో అన్ని పార్టీలది, పాలకవర్గాలది, ఒకటే దారి నియంతృత్వ దారి. పౌరహక్కుల విధ్వంసక దారి.

ప్రజాస్వామ్యం పేరుతో దోపిడీని కొనసాగించాలన్నది, పాలక వర్గాల ఏకైక మనోరథం. అది నెరవేరాలంటే, న్యాయస్థానాల అడ్డు తొలగాలి. న్యాయస్థానాలకు ఎటువంటి న్యాయ సమీక్షాధికారాలు ఉండరాదు. ఇందుకు సంబంధించిన పోరాటం కేశవానంద భారతి కేసుకన్నా ముందే ప్రారంభం అయింది. ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నది. ఇక ముందూ కొనసాగుతుంది. ఈ పోరాటంలో తీర్పులు అటూ ఉంటాయి, ఇటూ ఉంటాయి. ఇందుకు కారణాలు ఏమిటన్నది మరొక ప్రత్యేకమైన అంశం. ఆ అంశంలోకి పోవటానికి ఇది సందర్భం కాదు. ఏది ఏమైనప్పటికి, **ఈ దేశంలో అత్యధికులైన కార్మిక, కర్షక, బడుగు, బలహీనవర్గాల ప్రాథమిక హక్కులకు సంబంధించిన అవిశ్రాంత పోరాటం ఇంకా కొనసాగుతూనే ఉన్నదన్నది వాస్తవం. వారికి ప్రాథమిక హక్కులు నిరాకరింపబడుతున్నాయన్న విషయం వాస్తవం. ఆ విధంగా ప్రాథమిక హక్కులు నిరాకరింపబడు తున్నంతకాలం పోరాటం తప్పదు. ఆ పోరాటం కొనసాగినంతకాలం, భౌతికంగా మన మధ్య లేకపోయినా, స్వామీ కేశవానంద భారతి చిరంజీవిగా మన మధ్యే ఉంటాడు. ఆవిధంగా ఆయన ధన్యజీవి. తన జీవితాన్ని చరితార్థకం చేసుకున్న సర్వసంగ పరిత్యాగి.**

**పుస్తక సమీక్ష**




## గుంటూరు సీమ సాహిత్య చరిత్ర

రచయిత :
పెనుగొండ లక్ష్మీనారాయణ
సెల్: 9440248778
వెల : రు.200/-
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్‌హౌస్
నవచేతన బుక్‌హౌస్

*'... యావదాంధ్రమ్మొకయెత్తు, గుంటురు పురమ్మొక యెత్తు, కళాప్రతిష్ఠలక్...” - జాషువా*

**దా**దాపు ఐదు దశాబ్దాలుగా అభ్యుదయ సాహిత్యోద్యమంలో మమేకమైనవాడు, స్వీయగ్రంథాలు, సంపాదకత్వాలు, సాహిత్య ఉద్యమాలు, సంస్థలు, ముఖ్యంగా అభ్యుదయ రచయితల సంఘం సాహిత్య సాంస్కృతిక ఉద్యమ ప్రస్థానం గురించి సమగ్రంగా మేధస్థం చేసుకున్న సాహిత్య చరిత్ర పరిశోధకుడు, 'అరసానికి పెనుజెండా'గా ప్రసిద్ధుడు పెనుగొండ లక్ష్మీనారాయణ.

గుంటూరు సీమది తెలుగు సాహిత్యచరిత్రలో ఒక విడదీయరాని భాగం. మొదటినించీ తెలుగు సాహిత్యంలో మమేకమై మార్గదర్శి అయిన గుంటూరు సీమ సాహిత్య చరిత్రను రాయబూనటం సాహసమే అని సవినయంగా చెప్పుకున్నారు లక్ష్మీనారాయణ. గుంటూరు రచయితల సంఘం ఏర్పడిన దశాబ్ది అయిన సందర్భంగా, జిల్లా సాహిత్యం పై ఒక వ్యాసం రాసి రేఖామంత్రంగా స్పర్శించిన రచయిత, ఇప్పుడు యిలా పుస్తకరూపంలో దాదాపు వెయ్యి మంది రచయితల ముఖ్యరచనలను, గుంటూరు సీమ సాహిత్య చరిత్రలో భాగమైన వ్యాసాలను పొందుపరచి, జిల్లా సాహిత్య చరిత్ర రచనను ప్రారంభించిన మొదటి సాహిత్యకారుడుగా చరిత్రలో స్థానం నిలుపుకున్నారు.

గుంటూరు సీమలో జన్మించి అక్కడ స్థిరపడినవారు, ఆ సీమలో పుట్టి పెరిగి వేరే ప్రాంతాలలో నివసిస్తున్నవారు, వేరే చోట పుట్టినా యీ సీమను కార్యక్షేత్రం చేసుకున్న రచయితలను, వారి రచనలనూ పరిశీలనకు తీసుకున్నట్లుగా రచయిత తన ప్రవేశికలో పేర్కొన్నారు. గుంటూరు సాహిత్య చరిత్రలో మూడు విభాగాలు ప్రధానమైనవి. మొదటి విభాగంలో పద్యం, గేయం, వచనం, కథానిక, నవల, నాటకం, బాల సాహిత్యం, స్త్రీ వాదం, విమర్శ, పరిశోధన రంగంలో జరిగిన కృషిని వివరించారు. మహాభారతంలో 15 పర్వాలను ఆంధ్రీకరించిన మహాకవి తిక్కన సోమయాజి (పాత గుంటూరులో జన్మించిన) తో ప్రారంభమై 19వ శతాబ్ది చివరి నుంచి 20వ శతాబ్దానికి చెందిన పద్యకవుల గురించి యిందులో వివరాలున్నాయి. గుంటూరు కవిత్రయంగా పేరొందిన జాషువా, తుమ్మల మరియు ఏటుకూరిలతో పాటు ఆశుకవితా ధోరణిలోను అవధానాల తో ప్రసిద్ధి చెందిన కొప్పరపు కవులు, కరుణశ్రీ, కొమాండూరి, కాంచనపల్లి కనకాంబ, తల్లావఝ్జుల, దీపాల పిచ్చయ్య శాస్త్రి, జమ్మలమడక, త్రిపురనేని రామస్వామి, బలిజేపల్లి, కొండవీటి వెంకటకవి, ఊటుకూరి లక్ష్మీకాతమ్మ మొదలైన పద్యకవులతో పాటు కొల్లా కృష్ణారావు, రామడుగు, సుఖవాసి, పి.యస్.ఆర్. ప్రసాద్, కలువకొలను సూర్యనారాయణ వంటి ఎందరో పద్యవాహినిని ప్రవహింప చేసిన వారిని పేర్కొన్నారు. ఆ విధంగానే ఇతర సాహిత్య ప్రక్రియలలో రచనలు సాగించిన వారి వివరాలతో పాటు ఆయా ప్రక్రియల వికాసంలో లబ్ధప్రతిష్ఠులైన ఈ జిల్లా వారిని గురించి, వారి రచనల గురించి రేఖామాత్రంగా వివరాలతో పాటు స్వల్ప వ్యాఖ్యానాలలో సాగుతుంది మొదటి భాగం, రెండు, మూడు భాగాలలో సమకాలీన సాహిత్యం, సమాజంలోని ముఖ్యమైన అంశాలను విశ్లేషించారు. రెండవ భాగంలో ప్రధానంగా ఆంధ్రోద్యమం, పల్నాటి పుల్లరి సత్యాగ్రహోద్యమం, పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమాల గురించి; దళిత బహుజన సాహిత్యం, రైతు సాహిత్యం, స్త్రీ వాద సాహిత్యాలతో పాటు గుంటూరు సీమలో అరసం పోషిస్తున్న పాత్ర తదితర విషయాలపై వ్యాసాలున్నాయి.

ఇక మూడవ భాగంలో వినుకొండ సాహిత్య చరిత్ర, గుంటూరు సీమ కథానికా రచయితల, రచయిత్రుల జబితా, ఈ సీమకు చెందిన చలన చిత్ర రచయితలు, ఆరసం గుంటూరు శాఖా ప్రచురణలు, గుంటూరు సీమ సాహిత్యం; ఇక, రచయిత తన స్వీయ రచనల గురించిన వివరాలు అనుబంధంగా ఇచ్చారు.

రాష్ట్రాల విభజన అనంతరం రాష్ట్ర చరిత్రలతో పాటు, జిల్లాల చరిత్ర రచనల మీద సాహిత్యకారుల దృష్టిపడింది. కొందరు చరిత్రకారులు పూనుకొంటున్నారు. ఈ నేపథ్యంలో చూస్తే, చరిత్ర రచనలు స్థూల చరిత్రల నుండి సూక్ష్మచరిత్రల దిశగా పరిణామాలు చోటుచేసుకోటం, ఈ దిశగా గుంటూరు సీమ సాహిత్య చరిత్రను పెనుగొండ ప్రారంభించడంలో ప్రధానంగా తెలుగు సాహిత్య చరిత్రలో గుంటూరుది ప్రతిభావంతమైన స్థానం అని తాను నమ్మటం, కష్టసాధ్యమైనప్పటికీ గుంటూరుకు గల సుదీర్ఘ సాహిత్య ప్రస్థానాన్ని ఒక్క చోటకు చేర్చటంలో లక్ష్మీనారాయణ కృషి అభినందనీయం. ఇచ్చిన రచయితల వివరలతో పాటు, ఇంకా కొంత మందిని చేర్చవలసి ఉంది. ఆ విధంగానే, మూడు విభాగాల మధ్య సమన్వయాన్ని చేకూర్చవలసి ఉన్నది. ఇవి తరువాతి ముద్రణలలో సరిచేయబడతాయని ఆశిద్దాం.

-ఎం.వి. శాస్త్రి
9441342999


### మీ స్పందనను తెలియజేయండి

**'అమ్మనుడి'**లో రచనలలోని అంశాలపై
మీ స్పందనను క్లుప్తంగా తెలియజేయండి.
సంపాదకుడు **'అమ్మనుడి',**

జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004.
ఇ-మెయిల్ : *editorammanudi@gmail.com*

## గ్రంథాలయం



**వర్గాల గురించి మార్క్స్-ఎంగెల్సులు ఏం చెప్పారు?**
సేకరణ : బి.ఆర్.బాపూజీ, అనువాదం: వి.విజయకుమార్
వివరణలూ,ముందుమాటా,వివరిమాటా:రంగనాయకమ్మ
పుటలు: 256, వెల :50/-
ప్రతులకు :అరుణా పబ్లిషింగ్ హౌస్ ఏలూరు రోడ్డు,
విజయవాడ - 520 002 ఫోన్ : 9440630378



సంపాదక చక్రవర్తి
**విశాలాంధ్ర'రాఘవాచారి'గారి**
సంస్మరణ సంచిక
సంపాదకుడు : ముత్యాల ప్రసాద్
ప్రచురణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి,
చంద్రాబిల్డింగ్స్, మాచవరం, విజయవాడ
ఫోన్ : 0866 - 2431301

**విహారం** (దీర్ఘకావ్యం)
రచన :బి.ఎస్.రాములు
పుటలు:77, వెల: రు.60/-
ప్రచురణ :విశాల సాహిత్య అకాడమి,
2-2-186/53/5 రామకృష్ణానగర్,
బాగ్అంబర్‌పేట, హైదరాబాదు -13
ఫోన్: 8331966987



**గొట్టిగుండాల పిల్లల కథలు**
రచన: గొట్టిగుండాల చిన్నారులు
సంకలనం: వెలుగోటి నరేష్, టీచర్
వెల : అమూల్యం
ప్రతులకు : వెలుగోటి నరేష్, టీచర్
చౌటభీమవరం (పోస్టు) ఎ.ఎస్.పేట మండలం
పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా - 524 304
సెల్: 73823 92390





**స్వప్నఫల శాస్త్రము** (కలలు - వాటి ఫలితాలు)
రచన : కోటిపల్లి సుబ్బారావు
పుటలు: 92, వెల:95/-
ప్రతులకు: తెలుగు బుక్‌హౌస్, 3-3-862,
ఆర్య సమాజ్ ఎదురు వీధి, కాచిగూడ క్రాస్‌రోడ్డు,
హైదరాబాదు - 500027
ఫోన్ : 9247446497



**రవీంద్ర గీతాంజలి**
అనువాదకులు : ఇలింద్ర రంగనాయకులు
సంపాదకులు : డా. వెన్నిసెట్టి సింగారావు
పుటలు: 142, వెల :50/-
ప్రతులకు: ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం
ప్రిన్స్‌పాల్, మహాత్మ కాలేజ్,
గుంటూరు.

**అశోక నివాళి** మూడవ భాగం
రచన: శ్రీశ్రీ, సింగంపల్లి అశోక్ కుమార్
పుటలు: 120, వెల: రు.100/-
ప్రతులకు :ఆలోచన, 305 ప్రగతి టవర్స్,
వీరయ్య వీధి, మారుతి నగర్,
విజయవాడ 520004, ఫోన్ :9246277375



**తేజోమూర్తులు (ముఖాముఖి ఫీచర్)**
రచన : డా. సి.భవానీ దేవి
పుటలు: 70, వెల :70/-
ప్రతులకు :డా. సి.భవానీ దేవి,
హిమబిందు పబ్లికేషన్స్,
102, గగనమహల్ అపార్టుమెంట్స్,
దోమలగూడ, హైదరాబాదు- 500 029
ఫోన్ : 040 - 2763 6172





**నిలువెత్తు గురజాడ**
రచయిత :డా॥ కాందూరి సీతారామచంద్రమూర్తి
పుటలు :72, వెల :60/-
ప్రతులకు: డా॥ కాందూరి సీతారామచంద్రమూర్తి
11-20/6, ఎఫ్- 202, శ్రీనివాసమ్, శ్రమశక్తి నగర్
చినముషిరివాడ, విశాఖపట్టణం
ఫోన్ : 9515607336



**కరోనా వైరస్**
రచన :డా॥టి. సేవకుమార్
పుటలు:56, వెల: రు.60/-
ప్రతులకు :ఎస్.హెచ్.ఓ క్లినిక్ & దయాగ్నొస్టిక్ సెంటర్
ఎస్.హెచ్.ఓ బిల్డింగ్ 2/1 బ్రాడీపేట, ఓల్డ్ క్లబ్ రోడ్డు
కొత్తపేట, గుంటూరు - 500 001
సెల్ : 82475 44703, 90635 05111

**బ్లాక్‌బోర్డు**(కవితాసంపుటి)
రచయిత: ఎర్రోజు వేంకటేశ్వర్లు
పుటలు: 96, వెల:100/-
ప్రతులకు: ఈ.జ్యోతిర్మయి, 2-231/6, సూర్యనగర్,
కరీంనగర్‌జిల్లా, తెలంగాణ
చరవాణి : 9492557037



**తేళ్ళ వసంతయ్య మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల**
(మధిర- ఖమ్మం జిల్లా) పూర్వ విద్యార్థి సంఘం
42వ వార్షిక సమ్మేళన సంచిక
సంపాదకులు: దుగ్గినేని సత్యనారాయణ,
డా. ఎ.వి.రమణారావు
కార్యదర్శి: మాధవరపు నాగేశ్వరరావు,9440652699



Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

## వ్యాసరచన పోటీకి అంశాలు

**1. తెలుగు నుడి:** తెలుగు నుడి పుట్టుక, వికాసం, మాండలికాలు, యాసలూ, లిపి, లేఖనం, రచనాసంప్రదాయం, వ్యాకరణం, భాషాశాస్త్ర అనువర్తనాలు, పనిముట్లు మొదలైన వాటి గురించి రాయవచ్చు.

**2. తెలుగు వారి చరిత్ర, తెలుగు నేల చరిత్ర:** తెలుగు వారి గురించి తెలుగు నేల గురించిన చరిత్రకు ఆధారమైన ప్రతి అంశమూ తెలుగువారి ప్రాచీన నాగరికతలూ, శాసనాలూ, రాగిరేకులూ, తాళపత్రాలు ఇతరత్రా చరిత్ర ఆనుపానులు.

**3. తెలుగు సంస్కృతి:** తెలుగు సమాజం, జన జీవన స్రవంతి, సామాజిక చైతన్యం, సంస్కరణలు, మన కట్టూ బొట్టూ, గుడులూ గోపురాలూ, ప్రార్థనామందిరాలూ, చెరువులూ బావులూ, పశువులూ సేద్యం, పాడి పంటలూ, మందులూ మాకులూ, వంటా వార్పూ, తిండీ తిప్పలూ, నమ్మకాలు మన్నింపులు, పెండ్లిళ్ళూ పేరంటాలూ, పండుగలూ సంబరాలూ,

జానపద, గిరిజన విజ్ఞానం, కథలూ కథనాలూ, ఆటలూ పాటలూ, నాటికలూ నాటకాలూ సినిమాలూ బుల్లితెర విన్యాసాలూ ఇంకా ఇలాంటివి ఏవైనా కావొచ్చు.

4. ఇంకా **నేటి, రేపటి తరం తెలుగింటి పిల్లలను తెలుగు నుడి వైపుకు ఆకట్టుకొనే వ్యాసం** ఏదైనా. పై అంశాల మీద ఇంతకు ముందు ఎక్కడా ప్రచురించబడని, కొత్త, సరికొత్త వ్యాసాలను పంపవచ్చు. అందిన మొత్తం వ్యాసాలలో 100 మేటి వ్యాసాలను ఎంపిక చేసి ఒక్కొక్క వ్యాసానికి అక్షరాలా వెయ్యి రూపాయల నగదు బహుమతి అందిస్తాం.

## మొబైల్ యాపులు

గడచిన పదేళ్ళుగా మనలో ప్రతి ఒక్కరి చేతికీ స్మార్ట్‌ఫోన్లు వచ్చేశాయి. అయితే అందులో తెలుగెంత? మన తెలుగు జనాభాలో పూర్తిగా ఆంగ్లంలో నూటికి పది మంది వ్యవహరించగలిగితే, మరో 20 మంది తొలిమెట్టు ఆంగ్లంలో వ్యవహరించగలరేమో! అంటే దాదాపు నూటికి 75 మంది వచ్చీ రాని ఆంగ్లంతో మొబైల్ ఫోనులను వాడుతున్నారు. అంతరవర్తి (ఇంటర్‌ఫేస్) స్థాయి వరకూ, పేర్లను దాచుకునే వరకూ తెలుగు ఉన్నా చాలా అనువర్తనాలు (యాపులు/apps) నేటికీ కేవలం ఆంగ్లంలోనే ఉన్నాయి. కానీ తెలుగులో అనువర్తనాలు తయారు చేసుకునేందుకు సాంకేతికంగా నేడు ఎలాంటి అడ్డంకీ లేదు. అయితే, తెలుగు వారి పట్టనితనం వలననే తెలుగులో మొబైల్ యాపులు రావటం లేదు. అందుకని తెలుగు భాషోద్యమ సమాఖ్య తెలుగు మొబైల్ యాపు నిపుణులకు తెలుగులో మొబైల్ యాపులు రూపొందించమని పిలుపునిస్తూ, మొబైల్ యాపు పోటీని నడుపుతున్నాం.

**ఈ మొబైల్ యాపు పోటీలో ఎలాంటి యాపులు రూపొందించవచ్చు?**

- తెలుగునుడి నేర్చుకోవడానికి ఉపయోగపడే యాపులు
- తెలుగు ఆటలు
- ఈ తరం పిల్లలు తెలుగు సాహిత్యాన్ని గురించి మక్కువతో తెలుసుకునేలా చేసే సాహిత్య ప్రధానమైన యాపులు
- తెలుగు శుభలేఖలు, ఆహ్వానపత్రాలు, సభలకు, వేదికలకు తెరలు తయారు చేసుకునే యాపులు
- తెలుగు మాటలతో ఆటలు మున్నగున్నవి
- నేటి రేపటి తరం తెలుగింటి పిల్లలను తెలుగు నుడి వైపుకు ఆకట్టుకొనే యాపు ఏదైనా కొత్తగా తయారు చేసి పంపవచ్చు.
- ఇతర సేవల ఆధారంగా తయారుచేసిన యాపులు, అయితే తెలుగులోనే కనబడాలి.

ఎంపికైన యాపులకు 3 లక్షల రూపాయలవరకూ నగదు బహుమతులను అందజేస్తాము.

మరిన్ని వివరాలకు, పోటీ కట్టుబాట్ల కొరకు https://telugubhashodyamasamakhya.blogspot.com లంకెను చూడండి.

తెలుగు భాషోద్యమ సమాఖ్య ఈమెయిలు చిరునామా: tebhasapoti@gmail.com

నిర్వహణ:

డా॥ చుక్కారామయ్య, గౌరవాధ్యక్షుడు
డా॥ సామల రమేష్‌బాబు, అధ్యక్షుడు
తెలుగు భాషోద్యమ సమాఖ్య

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
వీవెన్
రహ్మానుద్దీన్

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
October 2020 Vol :6, Issue 5

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244